దారి దీపం

మాసపత్రిక

DAARI DEEPAM - RNI Title Code : APTEL 16175

సంపుటి 5 - సంచిక 1 | అక్టోబరు 2026 | వెల : రూ.15

జాతిపితకు నివాళి

జ్ఞానేశ్ కుమార్.. రోజురోజుకీ భారం!

యూరప్‌లో ప్రజా ఉద్యమాల వెల్లువ!

బ్రెజిల్ అధ్యక్ష ఎన్నికలు లూలా తిరిగి విజయం!

మహాత్మునితో ఆత్మకథ రాయించినదెవరు?

ప్రజాస్వామిక, లౌకికవాది మహాత్మాగాంధీ

గాంధీజీ ముఖ్య ఉద్యమాలు - కాలక్రమం

పెరుగుతున్న అసమానతలు పెట్టుబడి దోపిడీకి సంకేతం

జాతీయ సమగ్రతను, బహుళత్వాన్ని రక్షించ గలిగేది

లౌకిక, ప్రజాస్వామ్య, సామ్యవాద రాజ్యాంగం మాత్రమే!

మానవ సమాజం + పురాతన సమాజం

ఎన్నికల్లో గెలిచిన అబ్రహం లింకన్‌కు కారల్ మార్క్స్ అభినందనలు

కాడ్వెల్ కవిత్వ తత్వం

అక్టోబరు - 2026

పేజీలు : 54

దారి దీపం

మాసపత్రిక

సంపుటి : 5 - సంచిక : 1


డి.వి.వి.యస్.వర్మ
- సంపాదకులు

సంపాదక వర్గం
కొప్పర్తి వెంకటరమణమూర్తి
మందలపర్తి కిషోర్
డి.సోమసుందర్
డా॥ బి.రమేష్ చంద్రబాబు

వెల : 15 రూపాయలు

ఈ సంచికలో..

1) జాతిపితకు నివాళి - సంపాదకీయం 3
2) జ్ఞానేశ్ కుమార్.. రోజురోజుకీ భారం!
-ఎ. కృష్ణారావు 4
3) యూరప్‌లో ప్రజా ఉద్యమాల వెల్లువ!
- ఆర్. లక్ష్మయ్య 6
4) బ్రెజిల్ అధ్యక్ష ఎన్నికలు
లూలా తిరిగి విజయం! 12
5) మహాత్మునితో ఆత్మకథ రాయించినదెవరు?
- డా. నాగసూరి వేణుగోపాల్ 15
6) ప్రజాస్వామిక, లౌకికవాది మహాత్మాగాంధీ
- వి.రాంభూపాల్ 17
7) గాంధీజీ ముఖ్య ఉద్యమాలు -
కాలక్రమం - 20
8) పెరుగుతున్న అసమానతలు పెట్టుబడి దోపిడీకి సంకేతం
- ఎ.నర్సింహారెడ్డి 21
9) జాతీయ సమగ్రతను, బహుళత్వాన్ని రక్షించ గలిగేది లౌకిక,
ప్రజాస్వామ్య, సామ్యవాద రాజ్యాంగం మాత్రమే! 24
10) మానవ సమాజం + పురాతన సమాజం
- రాహుల్ సాంకృత్యాయన్ 25
11) ఎన్నికల్లో గెలిచిన అబ్రహం లింకన్‌కు
కారల్ మార్క్స్ అభినందనలు 29
12) కాడ్వెల్ కవిత్వ తత్వం
- కేతవరపు రామకోటిశాస్త్రి 31
13) కార్టూన్స్ 53 - 14) కొత్త పుస్తకాల స్వీకారం 54



కార్టూన్ : సతీష్ ఆచార్య ఫేస్‌బుక్ సౌజన్యంతో..

వివరాలకు సంప్రదించండి : డా॥ బి.రమేష్ చంద్రబాబు, 34-15-1, దొడ్డిపట్ల వారి తోట వీధి, తణుకు - 534211, ప.గో.జిల్లా, ఏపీ ఫోన్ : 93971 14495

దారి దీపం గత సంచికల కోసం : **DVVSVARMA.COM**

దారి దీపం
మాసపత్రిక
మీ విరాళాలను ఈ క్రింది అకౌంట్‌కు పంపండి

Daari Deepam
Union Bank of India
Branch : TANUKU
A/C No : 0554 1101 0000 054
IFSC code : UBIN0805548

మీ పేరు విరాళం వివరాలను..
డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు
నంబరుకు విధిగా
వాట్సాప్ మెస్సేజ్ పెట్టండి.
ఫోన్ నెంబరు 93971 14495



జాతిపితకు నివాళి

గాంధీజీని జాతిపిత అంటున్నాం. ఇది ప్రభుత్వాలు ఇచ్చిన బిరుదు కాదు. సుభాష్ చంద్ర బోస్ మొట్ట మొదటిసారి ఆయనను జాతిపితగా పేర్కొన్నారు. దేశ ప్రజలు ఆమోదించారు. ఇది నేటికి ప్రజలు మాటగాసాగిపోతున్నది. ఇక్కడ ఒక తేడా వుంది. ఒక దేశాన్ని దాని సరిహద్దులను నిర్ధారించి ఒక భౌగోళిక దేశాన్ని రూపొందించడం. మరొకటి ఒక దేశంలో నివసించే ప్రజల్ని సోదరులుగా భావింపజేసి ఒక జాతిని రూపొందించడం.

1947లో మనకు స్వాతంత్ర్యం వచ్చింది. పాకిస్థాన్ విభజన తర్వాత కూడా మన దేశం భౌగోళికంగా ఒక దేశంగా లేదు. బ్రిటిష్ ఇండియాతోపాటు 563 సంస్థానాలు వున్నాయి. వలస పాలకులు బ్రిటిష్ ఇండియాతోపాటు ఈ సంస్థానాలను స్వతంత్ర దేశాలుగా ప్రకటించారు. ఈ సంస్థానాలకు వేర్వేరు జెండాలు వున్నాయి. వేర్వేరు కరెన్సీలు వున్నాయి. రాజ్యాంగ నిర్ణాయక సభ ఏర్పాటు చేసినప్పుడు అందులో ఈ సంస్థానాలకు స్వతంత్ర దేశాలుగా ప్రాతినిథ్యం వుంది

1947లో ఏర్పడిన ప్రభుత్వానికి భౌగోళికంగా ఈ దేశాన్ని ఏకం చేయాల్సిన పరిస్థితి ఎదురైంది. ప్రధాని నెహ్రూ, హోం మంత్రి పటేల్ అందుకు పూనుకున్నారు. కొన్ని సంస్థానాలతో ఒప్పందాలు చేసుకున్నారు. కొందరికి రాయితీలు ఇచ్చారు. కాదన్న వారిపై పోలీసు చర్యలు తీసుకున్నారు. అప్పటికే ఆ సంస్థానాలలో సాగుతున్న ప్రజా ఉద్యమాలు దీనికి తోడ్పడ్డాయి. ఫలితంగా 1950లో భారత రాజ్యాంగం అమలులోకి వచ్చే నాటికి ఈ నాటి భారతదేశం ఒకే భూభాగంగా రూపు దిద్దుకుంది. అయినప్పటికి రాజ్యాంగం ఈ దేశంలోని వైవిధ్యాన్ని గుర్తించి భారతదేశాన్ని రాష్ట్రాల సమ్మేళనంగా ప్రకటించింది. 1950కి పూర్వం ఖండ ఖండాలుగా వున్న భారతదేశం ఒక నిర్దిష్ట సరిహద్దులుగల భౌగోళిక దేశంగా రూపొందింది. ఇలా భౌగోళిక దేశాన్ని రూపొందించడంలోనూ కొన్ని సమస్యలు వున్నాయి. అయితే అప్పటికే ప్రభుత్వం ఏర్పడింది.. దానికి పోలీసు, సైనిక బలగాలు వున్నాయి. అందువల్ల దానిని సాధించడం కొన్ని సంవత్సరాలలోనే సాధ్యమైంది. ఒక దేశంలో పలు ప్రాంతాలను కలిపి ఏకఖండం చేయడంకంటే దేశ ప్రజలను ఒక జాతిగా రూపొందించడం మరింత కష్టతరమైంది. దానికి పునాదులు వేసినవాడు గాంధీజీ. స్వాతంత్ర్యోద్యమ సారధిగా గాంధీజీ మనకు తెలుసు. కాని బ్రిటిష్ సామ్రాజ్యానికి వ్యతిరేక పోరాటం విజయం సాధించాలంటే దేశ ప్రజలందరిని సమైక్య పరచాలని గాంధీజీ భావించారు. మన స్వాతంత్ర్యోమాన్ని ఒక జాతీయ ఉద్యమంగా రూపొందించారు.

ఒక జాతీయ ఉద్యమం కావాలంటే ఉద్యమంలో దేశ ప్రజలంతా పాల్గొనాలి. అన్ని మతాలవారు, అన్ని తరగతుల వారు పాల్గొనాలి. అలాంటి విశాల ప్రజా ఉద్యమం ఈ దేశ ప్రజల్ని ఐక్యపరుస్తుందని, ఒక జాతిగా రూపొందిస్తుందని భావించారు. గాంధీజీ ఒక సనాతన హిందువుగా ప్రకటించుకున్నారు. కానీ ఈ సనాతనం అన్ని మతాలనూ గౌరవించేదిగా, మత సామరస్యానికి దోహదకారి కావాలని భావించారు. అందుకే "ఈశ్వర, అల్లా తేరేనాం"ను తన ప్రార్థనా గీతంగా చేసుకున్నారు. మత విద్వేషానికి బదులు మత సామరస్యాన్ని ప్రబోధించారు.

దేశంలో అన్ని ప్రాంతాలనూ ఆయన ఒకటికి రెండుసార్లు పర్యటించారు. చరఖాను, ఖాదీని జాతీయ జాతీయ చిహ్నాలుగా స్వదేశీ భావనను రగిలించారు. సహాయ నిరాకరణ ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం, అంతిమంగా క్విట్ ఇండియా ఉద్యమం దేశ ప్రజలందరూ భాగస్వాములయ్యే విధంగా జాతీయ ఉద్యమాలను నిర్వహించారు. జాతీయ ఉద్యమంలో హరి జనోద్ధరణను, వేల సంఖ్యలో మహిళలను ఉద్యమంలో భాగం చేశారు. దేశ ప్రజలలో సోదర భావాన్ని పెంపొందించారు. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా ఒక జాతి నిర్మాణానికి పునాదులు వేశారు. అందుకే ఆయన జాతి పిత అయ్యారు. ఒకనాడు మతవిద్వేషం ఈ జాతిపితను బలి తీసుకుంది. ఇప్పుడు అదే మత విద్వేషం ఈ జాతి నిర్మాణానికి అవరోధంగా మారింది. విద్వేషం నుంచి దేశాన్ని కాపాడుకోవడమే జాతిపితకు సరైన నివాళి. ❑

- డి.వి.వి.యస్.వర్మ, సంపాదకులు, 85006 78977

జ్ఞానేశ్ కుమార్.. రోజురోజుకీ భారం!



-ఎ. కృష్ణారావు

హనుమంతుడు తొలుత అశోక వనాన్ని ధ్వంసం చేశాడు. తర్వాత కింకరుల్ని హతమార్చాడు. జంబుమాలీ, మంత్రి కుమారులు, సేనాధిపతులూ కుప్పకూలిపోయారు. రావణుడి కుమారుడు అక్ష కుమారుడినీ బండకేసి కొట్టి చంపాడు. చివరకు ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రం ప్రయోగించిన తరువాతే హనుమంతుడి ప్రతాపం తగ్గింది. గత రెండు, మూడు నెలలుగా దేశ రాజధానిలో చోటు చేసుకుంటున్న దృశ్యాలు చూస్తుంటే వాల్మీకి రామాయణంలోని సుందరకాండ ఘట్టాలు గుర్తుకు వస్తున్నాయి.

జూలై–ఆగస్టు నెలల్లో ప్రధాని మోదీ ప్రభుత్వాన్ని కాక్రోచ్ జనతా పార్టీ ఉక్కిరిబిక్కిరి చేసింది. అనేక ఎన్నికల యుద్ధాల్లో ఆరితేరిన ధర్మేంద్ర ప్రధాన్‌ను కేంద్రమంత్రి మండలి నుంచి తొలగించడం మోదీకి అనివార్యమయింది. భారత ఎన్నికల సంఘం ప్రధానాధికారి జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ అక్టోబర్ 10న జంతర్‌మంతర్ వద్ద మళ్లీ నిరసనకు పూనుకుంటామని సీజేపీ ప్రకటించేసరికి మోదీ సర్కార్ అప్రమత్తమైంది. రెండు రోజుల ముందే సరిహద్దు భద్రతా దళాలు, సాయుధ పోలీసు బలగాలు, కేంద్ర రిజర్వు పోలీసు బలగాలు, పారామిలటరీ దళాలు, రాపిడ్ యాక్షన్ ఫోర్స్ రంగంలోకి దిగాయి. దాదాపు 50 వేల మంది భద్రతా సిబ్బందికి తోడుగా ప్రైవేట్ దళాలు చేరాయని అంచనా. అడుగడుగునా బారికేడ్లు. పోలీసులు లాఠీలు ఝళిపించారు. రెండు, మూడు రోజులపాటు న్యూఢిల్లీలో గాలి కూడా పూర్తిగా స్తంభించినట్లు కనపడింది. సీజేపీ నేతలు అభిజీత్ దీప్కే, సౌరవ్‌దాస్, అశుతోష్ రంకాలను విమానంలోనే అరెస్టు చేసి వేర్వేరు ప్రదేశాలకు తరలించారు. ఢిల్లీలోనే దాదాపు 10 వేల మందిని అరెస్టు చేశారు. అనేకమంది ఆన్‌లైన్ వ్యాఖ్యాతలు, కార్యకర్తల్ని కస్టడీలోకి తీసుకున్నారు. అన్ని మెట్రో స్టేషన్లనూ మూసివేశారు. ఢిల్లీకి వచ్చే రైళ్లను రద్దు చేశారు. ఇంటర్నెట్‌ను నిలిపివేశారు. అయినప్పటికీ కన్నాట్ ప్లేస్‌లోను, జంతర్ మంతర్ వద్దకు చొచ్చుకు వచ్చిన యువతీ యువకులనూ నిర్బంధించారు. మీడియానూ వదలలేదు. బస్సుల నుంచి తప్పించుకుపోకుండా, వాటిలోనే ఇనుప చువ్వలతో లాకప్‌లను నిర్మించారు. దేశ రాజధానిలో యువతరంగం ఉవ్వెత్తున ఎగిస్తే ఏమి జరుగుతుందో అని ప్రభుత్వం భయపడినట్టు ఈ చర్యలతో స్పష్టమయింది.



ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే సర్వోన్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టులో కూడా సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ కింద బ్యానర్లు కట్టారు. సుప్రీంకోర్టు ముందున్న లాయర్ల చాంబర్లలోకి ప్రవేశించి న్యాయవాదులను కూడా అరెస్టు చేశారు. సుప్రీంకోర్టు నుంచి మండీహౌస్‌కు ఊరేగింపుగా వెళుతున్న న్యాయవాదులను అరెస్టు చేసి, యమునా కాంప్లెక్స్‌కు తరలించారు. సీనియర్ న్యాయవాది దినేశ్ ద్వివేది వారిలో ఒకరు. ఎన్నికల కమిషన్ తరఫున వాదిస్తున్న రాకేశ్ ద్వివేదీకి ఆయన స్వయానా సోదరుడు. 'అసలు సుప్రీంకోర్టులోనూ, సుప్రీంకోర్టు ముందు నిషేధాజ్ఞలు విధించేందుకు మీ అనుమతి తీసుకున్నారా?' అని సీనియర్ న్యాయవాది గోపాల్‌శంకర్ నారాయణ్ అడిగిన ప్రశ్నకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఎలాంటి సమాధానమూ ఇవ్వలేదు. తనకూ ఈ నిషేధాజ్ఞల గురించి తెలియదని ప్రభుత్వ ప్రధాన న్యాయవాది సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అన్నారు. న్యాయవాదుల అరెస్ట్‌ను సుప్రీంకోర్టు, హైకోర్టు బార్ అసోసియేషన్లూ, అడ్వకేట్ ఆన్ రికార్డ్ అసోసియేషన్ ఖండించాయి. చివరకు భారత ప్రధాన న్యాయమూర్తి జోక్యంతో న్యాయవాదులను విడుదల చేశారు. జమ్మూ–కశ్మీర్‌లో ఇంటర్నెట్, టెలీ కమ్యూనికేషన్ సదుపాయాలను నిలిపివేయడం రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులను కాలరాయడమేనని అనురాధా బాసిన్ కేసులో జస్టిస్ రమణ బెంచ్ 2020లో ఇచ్చిన తీర్పును పలువురు న్యాయవాదులు ఉటంకించడంతో ఢిల్లీలో నిషేధాజ్ఞలు ఎత్తివేయాలని కేంద్రానికి సీజేఐ సూర్యకాంత్ చెప్పాల్సి వచ్చింది. జ్ఞానేశ్ కుమార్ రాజీనామాపై ప్రారంభించిన ఉద్యమం వేడి సుప్రీంకోర్టుకు

తగిలినట్లే కనపడుతోంది. ఎందుకంటే ఈ విషయంలో సరైన సమయంలో జోక్యం చేసుకోలేని నిస్సహాయతే సుప్రీంకోర్టును ఆత్మరక్షణలో పడేలా చేసింది.

ఈ నేపథ్యంలో అక్టోబర్ 12న ఇండియా కూటమి సుప్రీంకోర్టు వరకు నిరసన ఊరేగింపును నిర్వహించింది. ప్రభుత్వం దాదాపు ప్రేక్షకపాత్ర వహించింది. కాంగ్రెస్ చెబుతున్న ప్రకారం.. నిషేధాజ్ఞలు ఉన్నప్పటికీ దాదాపు రెండున్నర లక్షల మంది నాలుగు గంటలపాటు న్యూఢిల్లీలో జరిగిన ఈ నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు. కాంగ్రెస్, ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల కార్యకర్తలే కాకుండా, కాక్రోచ్ పార్టీ పిలుపునకు ప్రతిస్పందించిన విద్యార్థులు, యువజనులు, పౌర సమాజ సభ్యులూ పాల్గొనడంతో కన్నాట్ ప్లేస్ పరిసర ప్రాంతాలు జన సమ్మర్దంతో కిక్కిరిసిపోయాయి. మొట్టమొదటిసారి కాంగ్రెస్ పార్టీ తన బలం యావత్తునూ పూర్తిగా కేంద్రీకరించడంతో వివిధ రాష్ట్రాల నుంచి ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు వేల సంఖ్యలో ఢిల్లీకి చేరుకున్నారు. ఢిల్లీకి రాకపోతే అధిష్ఠానం ఆగ్రహానికి గురికావల్సి వస్తుందన్న భయం మొదటిసారి కాంగ్రెస్ నేతల్లో కనపడింది. సుప్రీంకోర్టుకు ఊరేగింపు ఒక నెపం మాత్రమేనని, మొత్తం పార్టీలో ఉద్యమ స్ఫూర్తిని, వీధి పోరాటతత్వాన్ని రగల్చడమే రాహుల్‌గాంధీ వ్యూహం అన్న విషయం విదితమయింది. పదవులు ఆశిస్తూ, పైరవీలే ధ్యేయంగా జీవిస్తున్న కాంగ్రెస్ నేతలు మొట్ట మొదటిసారి చెమటోడ్చారు. పోలీసులతో రాహుల్, ప్రియాంక వాదిస్తూ, వారిని ప్రతిఘటిస్తూ, బారికేడ్లను దాటుతూ ముందుకు సాగుతుంటే కాంగ్రెస్ కార్యకర్తల్లో కదలిక రాకుండా ఎలా ఉంటుంది? ఒక రకంగా ఇది కాంగ్రెస్ నరనరాల్లో చైతన్యాన్ని రగిల్చిన క్షణం. ఈ నిప్పురవ్వను మరింతగా మండించేందుకే రాహుల్, ప్రియాంక సిద్ధపడుతున్నట్లు కనపడింది. మొదట ఎన్నికల కమిషన్ కార్యాలయం వరకు, ఆ తరువాత సుప్రీంకోర్టు దాకా నిర్వహించారు. ఇక రాష్ట్రాల్లో ప్రకటించిన కార్యాచరణను కాంగ్రెస్ ఎంత ఉద్యమస్ఫూర్తితో నిర్వహిస్తుందో వేచి చూడాలి. ఓట్ చోరీపై ప్రారంభించిన ఈ ఉద్యమం ఓటర్లలో తమ ఓటు హక్కు గురించి చైతన్యాన్ని కల్పించే దిశలో ఊపందుకుంటే కానీ ఆశించిన ఫలితాలు రావు.

అదే సమయంలో సర్‌పై, వ్యవస్థల విశ్వసనీయతపై తలెత్తిన వివాదం మోదీ, బీజేపీ ప్రతిష్ఠకు ఎంతవరకు నష్టం వాటిల్లిందో చెప్పేందుకు ఇప్పుడే ఎలాంటి కొలమానాలూ లేవు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ చుట్టూ ఏర్పడిన ప్రతిష్టంభన ఎంతకాలం కొనసాగుతుందో చెప్పలేం. జ్ఞానేశ్‌కుమార్‌ను రాజీనామా చేయిస్తే ఓట్ చోరీపై ప్రతిపక్షాల విమర్శలను ప్రభుత్వం ఒప్పుకున్నట్లవుతుంది. ప్రతిపక్షాలు ఎంత రాద్ధాంతం చేసినా, తమ పోరును ఎంత ఉధృతం చేసినా ఎన్నికల్లో మాత్రం తమ యంత్రాంగం, వ్యూహరచన, ఎన్నికల ప్రచారంలో భావోద్వేగ అంశాలు, సామాజిక సమీకరణల ద్వారా విజయాలు సాధించగలమనే విశ్వాసాన్ని మాత్రం బీజేపీ అగ్రనేతలు కోల్పోయినట్లు కనపడడంలేదు. ఎన్నికల్లో తాము గెలిస్తే చాలు, ప్రతిపక్షాలు నీరుగారిపోతాయన్న వ్యూహాన్నే వారు అవలంబిస్తున్నారు.

ఈ సందిగ్ధ సంక్షోభ సమయంలో ప్రజా జీవనం అస్తవ్యస్తంగా మారనుందనడంలో సందేహం లేదు. మోదీని గద్దెదించడమనేది కాంగ్రెస్, ఇతర శక్తులకు జీవన్మరణ సమస్యగా మారింది. ఈ శక్తులు తమ పోరును ఉధృతం చేసిన కొద్దీ ప్రభుత్వం మరింత కఠోర చర్యలకు పాల్పడే అవకాశాలున్నాయి. రైళ్ల రద్దు, మెట్రో స్టేషన్ల మూసివేత, ప్రజలు తిరిగే చోట నిషేధాజ్ఞలు, ట్రాఫిక్ రద్దీలు, ఇంటర్నెట్‌పై ఆంక్షల మూలంగా వేల సంఖ్యలో సాధారణ ప్రజలకు తీవ్ర అసౌకర్యాలు కలుగక తప్పదు. రాజకీయ, ప్రజా ఉద్యమాలు కేవలం ఢిల్లీలోనే కాకుండా ప్రధానంగా బీజేపీ అధికారంలో ఉన్న 22 ఎన్డీఏ రాష్ట్రాలకు విస్తరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. డీలిమిటేషన్ కోసం ప్రభుత్వం ప్రత్యేక సమావేశాలు నిర్వహించే పరిస్థితి లేకపోగా నవంబర్, డిసెంబర్ నెలల్లో జరిగే శీతాకాల సమావేశాలు కూడా భగ్నమయ్యే అవకాశాలు ఉన్నాయి. రాబోయే ఏప్రిల్‌లో జరిగే ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల వరకూ సంక్షోభం తీవ్రతరం కావడమే కానీ చల్లారే సూచనలు కనపడడం లేదు.

ప్రభుత్వం నిరసనలను నిరోధించడానికి ప్రయత్నించి విఫలమైంది. నిషేధాజ్ఞలు విధించి కూడా ఉద్యమకారులను కట్టడి చేయలేకపోయింది. జంతర్ మంతర్‌ను నిరసనలకు కేంద్రం కాకుండా చేయడం తేలికేకానీ ప్రజాగ్రహ అగ్నిపర్వతం నుంచి ఉబికివచ్చిన లావా ప్రవాహాన్ని ఆపలేదు కదా. ఆ ప్రవాహం మరో దారిని వెతుక్కుంది మరి. నిరసన ప్రదర్శనలను దేశభక్తికీ, జాతీయవాదానికీ, విదేశీ కుట్రలకు ముడిపెట్టి ప్రజాభిప్రాయం మళ్లించడం కూడా అంత సులభం కాదు. ఇప్పటి తరానికి ఎమర్జెన్సీ రోజులు తెలియకపోవచ్చు కానీ ప్రస్తుతం అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతోందన్న అభిప్రాయం వారిలో ఏర్పడుతోంది. అణచివేత, హింసాకాండను ప్రభుత్వమే అమలు చేస్తుంటే, ఈ సోషల్ మీడియా యుగంలో నవతరానికి ఎలాంటి అభిప్రాయం కలుగుతుందో పాలకులు ఆలోచించాలి. ఒక ప్రధాన విజయం సాధించాలంటే అధికారంలో ఉన్నవారు చిన్న చిన్న అపజయాలకు సిద్ధపడక తప్పదు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో నీట్ పేపర్ లీకేజీ అంకానికి తెరపడింది. ఇప్పుడు ప్రభుత్వానికి రోజురోజుకూ భారంగా, దుర్భరంగా మారుతున్న జ్ఞానేశ్ కుమార్‌పై ఏ చర్య తీసుకున్నా ఆచితూచి తీసుకోవాలి. లేకపోతే అది ముందు నుయ్యి, వెనుక గొయ్యిలా మారే ప్రమాదం లేకపోలేదు. ❑ **(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)**

యూరప్‌లో ప్రజా ఉద్యమాల వెల్లువ!



ఆర్. లక్ష్మయ్య



గ్రీస్ నుంచి ఫ్రాన్స్ వరకు కార్మికులు, రైతులు, సామాన్య ప్రజల నిరసనోద్యమాలు జరుగుతున్నాయి. కమ్యూనిస్ట్ మానిఫెస్టోలో యూరప్‌ను నేడు ఒక భూతం ఆవరించిందని చెప్పినట్లు, నేడు యూరప్ ఉద్యమాల సుడిగుండంలో ఉందని తాజా పరిణామాలు తెలియజేస్తున్నాయి. యూరప్‌ను సాధార ణంగా అభివృద్ధి చెందిన దేశాల ఖండంగా, ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు, సామాజిక భద్రత, ఆరోగ్య సదుపాయాలు, నిరుద్యోగ భృతి, కార్మిక హక్కులు ఉన్న ప్రాంతంగా పరిగణి స్తాం. అయితే, అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలు ఉన్నంత మాత్రాన అక్కడి ప్రజలందరూ సుఖంగా ఉన్నారని, ఉన్నత జీవన ప్రమాణాలు కలిగి ఉన్నారని అనుకుంటే పొరపాటు.

ఫ్రాన్స్ - విద్యార్థి ఉద్యమం

ఫ్రాన్స్‌లో ప్రారంభమైన విద్యార్థి ఉద్యమం క్రమంగా ఫ్రాన్స్ సాధారణ ప్రజల ఉద్యమంగా మారింది. ఉధృతమవుతున్న ఆందోళనలు, ప్రభుత్వ నిర్బంధంతో అట్టుడికిపోతున్నది. ఉపా ధ్యాయ ఖాళీలను భర్తీ చేస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ ఉద్యమాన్ని ఆపలేకపోయింది. ఇప్పుడు కార్మికులు, ఉపాధ్యా యులు తదితర తరగతుల వారు ప్రత్యక్షంగా రోడ్లపైకి వచ్చారు. నవంబర్ 5వ తేదీన కార్మిక సంఘాల పిలుపు మేరకు ఫ్రాన్స్ దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మె జరిగింది. ఈ సమ్మెలో, ప్రదర్శనలలో లక్షలాది మంది పాల్గొన్నారు. ప్రజా ఆందోళనలు గ్రీస్, స్పెయిన్, ఇటలీ, బెల్జియం, పోర్చుగీస్, డెన్మార్క్, అల్బేని యా దేశాలకు దావానలంలా పాకాయి. ప్రజా ఆందోళనలు, సమ్మెలు, రైతుల నిరసనలు, ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రదర్శనలు జరుగుతున్న వార్తలు గత కొద్ది రోజులుగా వస్తున్నాయి. యూరప్‌లోని సామాన్య ప్రజలు దేనికోసం పోరాడుతున్నారు? యూరప్‌లోని వివిధ దేశాల ప్రజల సమస్యలు ఒకే రకమైనవా? లేక ప్రతి దేశంలో పరిస్థితులు వేర్వేరుగా ఉన్నాయా? అనే సందేహం వస్తుంది. ఉపాధ్యాయుల కొరత, తరగతి గదుల శుభ్రత, సంఖ్యకు మించి తరగతి గదిలో విద్యార్థులు, ధరల పెరుగుదల, స్వంత ఇంటి కల నెరవేర కపోవడం, భరించలేని ఇంటి అద్దెలు, కొనుగోలు శక్తి పడిపో వడం, తాత్కాలిక ఉద్యోగాలు, తగిన వేతనాలు లేకపోవడం, ఉద్యోగ భద్రత, పెన్షన్లు, ఉపాధి, కార్మిక హక్కులు, వ్యవసాయ సంక్షోభం ప్రధాన సమస్యలుగా ముందుకొచ్చాయి. ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఆర్థిక విధానాలే ఈ సమస్యలకు మూలం.

యూరప్‌లో ప్రస్తుత ఆందోళనల స్వరూపం

యూరప్‌లో జీవన వ్యయం, గృహాల అద్దెలు, విద్య, ప్రభుత్వ సేవలు, వేతనాలు, అవినీతి వంటి అంశాలపై నిరసనలు విస్తరించినట్లు 2026 అక్టోబర్ 19 నుంచి 24 మధ్య వెలువడిన అంతర్జాతీయ వార్తలు తెలియజేస్తున్నాయి.

ఫ్రాన్స్ - విద్య, జీవన వ్యయం, ప్రభుత్వ సేవలు

ఫ్రాన్స్‌లో 2026 సెప్టెంబరులో పాఠశాలల్లో అధిక విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల కొరత, విద్యా వనరుల సమస్యలపై విద్యార్థుల ఆందోళనలు మొదలైనాయి. ఆ తర్వాత జీవన వ్యయం, ఇంధన ధరలు, ప్రజా సేవలపై అసంతృప్తి కూడా తోడై దేశవ్యాపిత ప్రజా ఉద్యమంగా మారింది. ఇది ఒక రోజు, ఒక సంవత్సరంలో వచ్చినది కాదు. గత 10 సంవత్సరాలుగా విద్యకు (తరగతి గదులు, మరుగుదొడ్లు, వేడి/చలిని తట్టుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు వంటి) మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయుల నియామకం, తదితర అంశాలను ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఆర్థిక పరిమితుల ముసుగులో ప్రభుత్వం విద్య, సంక్షేమ సేవలను తగ్గిస్తే దాని భారం మొత్తం ప్రజానీకంపై పడింది. కార్మికులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలు కలిసి పెద్ద ప్రజా ఉద్యమంగా మారింది. ఈ సందర్భంగా ఘర్షణలు, విధ్వంసం, అరెస్టులు జరిగాయి.

స్పెయిన్ - గృహ సంక్షోభం, అధిక అద్దెలు, తక్కువ వేతనాలు

స్పెయిన్‌లో యువత ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో అద్దె

ఇళ్ల కొరత, అధిక గృహ ఖర్చులు, తాత్కాలిక ఉపాధి, తక్కువ వేతనాలు ఉన్నాయి. కొన్ని దశాబ్దాలుగా ప్రభుత్వం ఉత్పాదక రంగాన్ని (మాన్యుఫాక్చరింగ్) నిర్వీర్యం చేసి టూరిజంపై పూర్తిగా కేంద్రీకరించింది. ఈ రంగంలో భారీ వ్యాపార సంస్థలు వచ్చి ఇళ్ల కొరతను అనూహ్యంగా పెంచాయి. పర్యాటకం, సేవల రంగాల్లో ఉద్యోగాలు ఉన్నప్పటికీ, అవి తాత్కాలికమైనవి లేదా తక్కువ వేతనంతో కూడినవి. ఉద్యోగం ఉన్నా స్వతంత్రంగా ఇల్లు అద్దెకు తీసుకుని జీవించడం యువతకు కష్టంగా మారింది. ఉద్యోగం సంపాదించిన యువకుడు తన కొద్దిపాటి ఆదాయంతో ఇల్లు, ఆహారం, రవాణా ఖర్చులను భరించడం దుర్లభంగా మారింది. గృహ నిర్మాణం, సరసమైన అద్దె ఇళ్లు, వేతనాల పెంపు, ఉపాధి స్థిరత్వం స్పెయిన్‌లో ప్రధాన సమస్యలుగా ముందుకొచ్చాయి. ఇంటి సమస్య పరిష్కారం నెపంతో ప్రభుత్వం రెండు బిల్లులను పార్లమెంటులో ప్రవేశపెట్టింది. అవకాశం కోసం ఎదురుచూస్తున్న ఎక్స్ట్రీమ్ రైట్ వింగ్ శక్తులు ఆ బిల్లులను ఓడించాయి. దాంతో ముందస్తు ఎన్నికలకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య అనుబంధ యూనియన్, ప్రభుత్వ వర్గాలు, ఎక్స్ట్రీమ్ రైట్ వింగ్ శక్తులు ఆడుతున్న నాటకాలను ప్రజల ముందు ఎండగట్టింది. ప్రజా సమస్యల పరిష్కారాన్ని డిమాండ్ చేస్తూ సిసిఓఓ, యుజిటి యూనియన్లు నవంబర్ 11వ తేదీన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయి.

ఇటలీ - వేతనాలు, ఆరోగ్యం, విద్య, ఉపాధి

ఇటలీలో జీవన వ్యయం, కొనుగోలు శక్తి, ఆరోగ్య సేవలు, విద్య, ఉపాధి, గృహ వసతి వంటి సమస్యలపై ఆందోళనలు జరిగాయి. ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య అనుబంధ సంఘమైన యుఎస్‌బి అక్టోబర్ 30న దేశవ్యాపిత సమ్మెకు పిలుపునిచ్చింది. అన్ని తరగతుల ప్రజలు పెద్ద ఎత్తున సమ్మెకు మద్దతు తెలియజేశారు. దేశంలోని అన్ని నగరాలలో వేలాది మంది ప్రదర్శనలలో పాల్గొన్నారు. ఇటలీ వాస్తవ వేతనాల పెరుగుదల నామమాత్రంగా ఉంది. ధరల మార్పును పరిగణనలోకి తీసుకున్న తర్వాత సగటు పూర్తి-కాల వేతనం 2000-2025 మధ్య దాదాపు 5 శాతం తగ్గిందని అల్ జజీరా వార్తా సంస్థ 2026 అక్టోబర్ 19న ప్రచురించింది. ప్రజలు కోరుతున్నది కేవలం ఉద్యోగాలు కాదు. జీవన ఖర్చులను భరించగల వేతనాలు, అందుబాటులో ఉండే వైద్యం, నాణ్యమైన విద్య కూడా.

బెల్జియం - విద్యా ఖర్చులు, జీవన వ్యయం, కార్మికుల అసంతృప్తి

బెల్జియంలో విద్యార్థుల నిరసనలు, జీవన వ్యయంపై ఆందోళనలు చెలరేగాయి. దేశ రాజధాని బ్రస్సెల్స్, లీజ్ వంటి నగరాల్లో జరిగిన ఆందోళనల సందర్భంగా పోలీసులతో ఘర్షణలు, రహదారుల దిగ్బంధాలు, అరెస్టులు జరిగాయి. విద్యకు అయ్యే ఖర్చు, కుటుంబాలపై పెరుగుతున్న రోజువారీ వ్యయం, కొనుగోలు శక్తి, ప్రభుత్వ సేవల నాణ్యత లోపం వంటి సమస్యలు ఆందోళనలకు కారణమయ్యాయి.

గ్రీస్ - ఆర్థిక సంక్షోభం, జీవన వ్యయం, ప్రజా సేవలు

గ్రీస్ దేశాన్ని గత దశాబ్ద కాలంగా రుణ సంక్షోభం వెంటాడుతున్నది. పొదుపు చర్యలు, వేతనాలు, పెన్షన్లపై ఒత్తిడి వంటి అంశాలు ప్రధానంగా ముందుకొచ్చాయి. ఫలితంగా గ్రీస్‌లోనూ యువత విద్య, జీవన వ్యయ సమస్యలపై ఆందోళనలకు దిగారు. గత సంక్షోభాల నుంచి ఆర్థిక వ్యవస్థ కోలుకున్నట్లు ప్రభుత్వం ప్రచారం చేస్తున్నా, ఆ అభివృద్ధి సామాన్య కుటుంబాల ఆదాయాల్లో లేదు.

అల్బేనియా - అవినీతి, పాలనపై అసంతృప్తి, జీవన వ్యయం

అల్బేనియాలోని తిరానా సహా ప్రాంతాల్లో ప్రభుత్వ పాలన, అవినీతి ఆరోపణలు, ప్రజా ప్రయోజనాలలో కోతలు, ప్రభుత్వ నిర్ణయాలు పారదర్శకంగా లేకపోవడం, అభివృద్ధి ప్రాజెక్టుల ప్రయోజనాలు ప్రజలకు అందకపోవడం వంటి అంశాలపై ప్రజలలో ఆగ్రహ జ్వాలలు వెల్లువెత్తాయి.

సెర్బియా

సెర్బియా ఆగ్నేయ ఐరోపాలోని బాల్కన్ ప్రాంత దేశం. ఒకప్పటి యుగోస్లావియాలో భాగం. యుగోస్లావియా విచ్ఛిన్నం తర్వాత అనేక రాజకీయ పరిణామాలు జరిగాయి. 2024 నవంబర్‌లో నోవిసాద్ నగరంలోని రైల్వే స్టేషన్ పైకప్పు కూలి 16 మంది మరణించారు. దానికి వ్యతిరేకంగా ప్రారంభమైన ఉద్యమం ప్రభుత్వ అవినీతి, అధిక ధరలు, నిరుద్యోగం, విద్యా వసతులు, ప్రజాస్వామ్య హక్కులు తోడై దేశవ్యాపిత ప్రజా ఉద్యమంగా మారింది. యువకులు ముందు పీఠిన ఉన్నారు. అన్ని తరగతుల ప్రజలు పెద్ద ఎత్తున వీధుల్లోకి వచ్చారు. చివరకు 2026 అక్టోబర్ 25న ముందస్తు ఎన్నికలు జరిగాయి. 14 సంవత్సరాలుగా అధికారంలో ఉన్న అధ్యక్షుడు అలెగ్జాండర్ వుచిచ్ కూటమిని కొత్తగా ఏర్పడిన "స్టూడెంట్ లిస్ట్" చిత్తుగా ఓడించింది. 250 స్థానాలున్న పార్లమెంట్‌లో 140 స్థానాలలో విజయ ధంకా మోగించింది.

ఈ దేశాలన్నింటిలో వ్యక్తమైన సమస్యలు

మొత్తంగా యూరప్‌లో ప్రజా ఉద్యమాలకు ధరల పెరుగుదల, కొనుగోలు శక్తి, గృహ ఖర్చులు, తరుగుతున్న ప్రజా సేవలు, ఆదాయాలు – ఖర్చుల మధ్య పెరుగుతున్న అంతరం ప్రధాన కారణాలు. 2026 అక్టోబర్ 19న అల్ జజీరా ప్రచురించిన గణాంక విశ్లేషణలో 2000 నుంచి ధరల మార్పులను పోల్చారు. యూరోస్టాట్ వినియోగదారుల ధరల సూచీ ఆధారంగా ఆహారం, ఇంధనం, రవాణా, సేవల ధరలు స్పెయిన్‌లో 78%,

పోర్చుగల్‌లో 71%, ఇటలీలో 68%, ఫ్రాన్స్‌లో 59% పెరిగాయి.

ఈ గణాంకాలు ఏమి తెలియజేస్తున్నాయి?

ధరలు 60–80 శాతం పెరిగితే సాధారణ వ్యక్తి ఆదాయం అదేస్థాయిలో పెరగలేదు. తప్పుడు లెక్కలతో ద్రవ్యోల్బణం తగ్గిందని ప్రభుత్వం ప్రచారం చేస్తున్నా, పెరిగిన ధరలు మళ్లీ పాత స్థాయికి తగ్గలేదు. ధరలు విపరీతంగా పెరుగుతుంటే వేతనాలు నామమాత్రంగా పెరిగితే, ఉద్యోగం చేస్తున్న వ్యక్తి కూడా గతంతో పోలిస్తే తక్కువ సరుకులనే కొంటాడు. ఇంటి అద్దె, విద్య, ఆరోగ్యం వంటి ఖర్చులు ఎక్కువైతే మిగులు లేక పోగా అప్పులు చేయాల్సి వస్తున్నది. అందువల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య ధరలు పెరగడం, గౌరవప్రదంగా జీవించడానికి సరిపడే ఆదాయాలు లేకపోవడం అన్ని దేశాలలో ప్రధాన సమస్యగా ఉంది.

సైనిక వ్యయం పెరుగుదల

2025లో యూరప్ మొత్తం సైనిక వ్యయం సుమారు 864 బిలియన్ అమెరికన్ డాలర్లకు చేరింది. 2025లో సైనిక వ్యయ పరిమాణం ప్రకారం ప్రధాన దేశాలైన జర్మనీ, యునైటెడ్ కింగ్ డమ్, ఫ్రాన్స్, ఇటలీ దేశాలు అగ్రస్థానంలో ఉన్నాయి. స్టాక్ హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (SIPRI) డేటా ఆధారంగా దేశాలవారీగా జర్మనీ, ఫ్రాన్స్, యునైటెడ్ కింగ్‌డమ్‌ల సైనిక వ్యయం పదుల బిలియన్ల డాలర్ల స్థాయిలో ఉంది.

కార్పొరేట్‌లకు రాయితీలు

మొత్తం పెట్టుబడిదారీ దేశాలన్నిటిలో పన్నుల తగ్గింపు తదితర రూపాలలో ప్రభుత్వాలు కార్పొరేట్‌లకు భారీగా రాయితీలు ఇస్తున్నాయి. ఒక వైపున కార్పొరేట్‌లకు రాయితీలు ఇస్తూ, మరొక వైపున సైనిక వ్యయం విపరీతంగా పెంచుతున్నారు. ప్రజా ప్రయోజనాలకు మాత్రం నిధుల కొరత పేర కోతలు పెడుతున్నారు.

యువత వీధుల్లోకి వస్తోంది?

యూరప్‌లోని తాజా నిరసనల్లో యువత పాత్ర కీలకంగా ఉంది. దీనికి నాలుగు ముఖ్యమైన కారణాలు కనిపిస్తున్నాయి. 1) ఉపాధి లేకపోవడం, ఉన్నా ఆర్థిక స్వతంత్రత లేకపోవడం. తాత్కాలిక ఉద్యోగాలు, తక్కువ వేతనాలు, స్థిరమైన కెరీర్ అవకాశాల కొరత యువత భవిష్యత్తుపై ఆందోళన పెంచుతు న్నాయి. 2) ఇళ్ల అద్దెల భారం. ప్రధాన నగరాల్లో అద్దె చెల్లించిన తర్వాత ఆహారం, రవాణా, ఇతర అవసరాలకు తగిన డబ్బు మిగలకపోవడం యువతకు తీవ్రమైన సమస్యగా మారింది. 3) విద్యా వ్యవస్థపై అసంతృప్తి. తరగతి గదుల్లో రద్దీ, ఉపాధ్యా యుల కొరత, విద్యా వసతుల లోపం, ఉన్నత విద్యకు అయ్యే ఖర్చులు పెరగడం. 4) భవిష్యత్తుపై నమ్మకం తగ్గడం. తమ తల్లిదండ్రుల తరం కంటే మెరుగైన జీవితం పొందుతామనే ఆశ యువతలో నీరుగారుతున్నట్లు తాజా వార్తలు సూచిస్తున్నాయి.

ప్రభుత్వాలు, పోలీసుల స్పందన - ప్రజాస్వామ్య హక్కులు

యూరప్‌లో జరిగిన నిరసనల సందర్భంగా కొన్ని చోట్ల పోలీసులతో ఘర్షణలు, అరెస్టులు, దుకాణాలు, ఆస్తుల ధ్వంసం జరిగినట్లు వార్తలు వచ్చాయి. ముఖ్యంగా ఫ్రాన్స్‌లో అక్టోబర్ 17న జరిగిన ఆందోళనల తర్వాత భద్రతా చర్యలు పెంచినట్లు రాయిటర్స్ నివేదిక పేర్కొంది. శాంతియుత నిరసన, సమ్మె, ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించడం ప్రజాస్వామ్యంలో ముఖ్యమైన హక్కులు. అయితే హింస, దహనం, దోపిడీ, వ్యక్తులపై దాడులు వంటి చర్యలు శాంతియుత నిరసన హక్కు కాదు. అదే సమయంలో, కొందరు వ్యక్తులు హింసాత్మక చర్యల కు పాల్పడ్డారనే కారణంతో మొత్తం ఉద్యమాన్ని హింసాత్మకంగా ముద్ర వేయడం తప్పు. నిరసనకారుల డిమాండ్లు, జరిగిన సంఘటనలు, పోలీసుల చర్యలు ప్రతి అంశాన్ని విడిగా పరిశీలించాలి. నిరసనకారులను అప్రతిష్ఠ పాలు చేయడానికి ప్రభుత్వమే పోలీసుల దుస్తుల్లో సంఘ విద్రోహ శక్తులను ఉసిగొల్పి హింసాత్మక ఘటనలకు ప్రేరేపించిందనే ఆరోపణలు కూడా వచ్చాయి; అయితే అవి ఇంకా నిర్ధారణ కాలేదు.

భారతదేశ పరిస్థితులు

యూరప్ ప్రజల సమస్యలు, భారతదేశంలో కార్మికులు, రైతు లు, యువత, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలు ఒకే విధంగా ఉన్నాయి. రెండు ప్రాంతాల ఆర్థిక వ్యవస్థలు, సంక్షేమ పథకాలు, వేతన స్థాయిలు, ప్రభుత్వ నిర్మాణాలు వేర్వేరుగా ఉన్నాయి. అయితే ఈ అన్నిచోట్ల ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు ధరల పెరుగుదల, నిరుద్యోగం, భద్రత, సరైన వేత నాలు లేని తాత్కాలిక ఉపాధి, స్వంత ఇంటి కల, ఇంటి అద్దె ధర లు, విద్య, వైద్యం, పెన్షన్లు, ప్రజాస్వామ్య హక్కులు వంటి సమ స్యలు ప్రజలలో తీవ్ర అసంతృప్తి, ఆందోళనలకు దారి తీస్తున్నాయి.

అభివృద్ధి అంటే ప్రజల జీవితాల్లో మెరుగుదల

ఒక దేశ ఆర్థిక అభివృద్ధి ఎంత గొప్పగా ఉన్నా, ఆ దేశంలోని ప్రజలందరూ ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్నారని అర్థం కాదు అని వివిధ దేశాలలో జరుగుతున్న ఆందోళనలు రుజువు చేస్తున్నాయి. ఒకవైపు ఆధునిక పరిశ్రమలు, సాంకేతిక అభివృద్ధి, అధిక ఉత్పాదకత, అంతర్జాతీయ వాణిజ్యం ఉంటే, సంపద కొద్ది మంది చేతిలో కేంద్రీకరించడం, మరోవైపు యువతకు అందుబాటులో లేని ఇళ్లు, న్యాయబద్ధమైన వేతనాలు లేని ఉద్యోగాలు, విద్యా వసతుల కొరత, ప్రజా సేవల నిధుల కోత

ఉన్నాయని అనుభవం రుజువు చేస్తున్నది.

ప్రజల జీవితాలను మెరుగుపరచని ఆర్థిక అభివృద్ధి, సామాజిక అసంతృప్తిని ఎంతోకాలం అణచి పెట్టలేదు. యూరప్‌లోని ఆందోళనలు ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణలు. ప్రభుత్వాలు ఆర్థిక వృద్ధితోపాటు న్యాయమైన వేతనాలు, ఉద్యోగ భద్రత, సరసమైన గృహ వసతి, నాణ్యమైన విద్య, వైద్యం, సామాజిక భద్రతకు ప్రాధాన్యం ఇవ్వగలిగితేనే అభివృద్ధి ఫలితాలు విస్తృత ప్రజానీకానికి అందుతాయి.

యూరప్ దేశాల ఎన్నికలు - ప్రజల తీర్పు

ప్రజా సమస్యలను ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడంతో ప్రజలలో నెలకొన్న అసంతృప్తి గత ఐదు సంవత్సరాల్లో యూరప్‌లోని అనేక దేశాల్లో అధికార మార్పులు, కొత్త పార్టీల ఎదుగుదల, పాలక పార్టీల బలం తగ్గడం, సంప్రదాయ పార్టీలకు సవాళ్లు ఎదురయ్యాయి. కొన్ని దేశాల్లో వలస విధానాలు, జాతీయ గుర్తింపు, భద్రత, జీవన వ్యయం వంటి అంశాలను ముందుకు తెచ్చిన ఎక్స్ట్రీమ్ రైట్ వింగ్ పార్టీల బలం పెరిగింది. ఇంకొన్ని దేశాల్లో వామపక్ష కూటములు లేదా కొత్త రాజకీయ శక్తులు బలం పుంజుకున్నాయి.

జర్మనీ

ఫెడరల్ పార్లమెంటు ఎన్నికలు ఫిబ్రవరిలో జరిగాయి. వివిధ పార్టీలకు వచ్చిన ఓట్ల వివరాలు – సిడియు / సిఎస్‌యు: 28.5%, ఎస్‌పిడి: 16.4% (ఈ మూడు పార్టీలు అధికార కూటమి), ఏఎఫ్‌డి (ఎక్స్ట్రీమ్ రైట్ వింగ్ పార్టీ, స్వయంగా ఎలాన్ మస్క్ మద్దతు ఇచ్చిన పార్టీ) 20.8%, గ్రీన్స్: 11.6%, డీ లింకే(వామపక్ష పార్టీ): 8.8%. 2021లో ఏఎఫ్‌డికి 10.4% ఓట్లు రాగా, 2025లో 20.8% వచ్చాయి. ఎస్‌పిడి ఓట్ల శాతం 25.7% నుంచి 16.4%కు తగ్గింది. ఓటింగ్‌లో పాల్గొన్న వారి శాతం 82.5%కు చేరింది.

యునైటెడ్ కింగ్‌డమ్

హౌస్ ఆఫ్ కామన్స్ ఎన్నికలు జూలై 2024లో జరిగాయి. లేబర్ పార్టీ 411 సీట్లు, కన్జర్వేటివ్ పార్టీ 121 సీట్లు, లిబరల్ డెమోక్రాట్లు 72 సీట్లు, రిఫార్మ్ యుకె 5 సీట్లు (ఇది కూడా ఎలాన్ మస్క్ మద్దతునిచ్చిన ఎక్స్ట్రీమ్ రైట్ వింగ్ పార్టీ) గెలుచుకున్నాయి. లేబర్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. కన్జర్వేటివ్ పార్టీ 2019లో గెలుచుకున్న 365 సీట్ల నుంచి 121కు పడిపోయింది. జీవన వ్యయం, ఆర్థిక వ్యవస్థ, వలసలు, పన్నులు, ప్రభుత్వ ఆరోగ్య సేవలపై అసంతృప్తి ఎన్నికల్లో ముఖ్య పాత్ర పోషించాయి. భారత మూలాలున్న ఋషి సునాక్ బ్రిటిష్ ప్రధాని అయ్యాడని మొత్తం భారతీయ మీడియా ఊదరగొట్టిన కన్జర్వేటివ్ పార్టీ ఘోర పరాభవం పొందింది. ఇటీవలి స్థానిక ఎన్నికల్లో రిఫార్మ్ యుకె (ఎలాన్ మస్క్ మద్దతునిచ్చిన ఎక్స్ట్రీమ్ రైట్ వింగ్ పార్టీ) భారీ విజయాలను సాధించింది.

ఫ్రాన్స్

ఫ్రాన్స్ పార్లమెంట్‌కు 2024 జూన్, జూలై నెలలలో ముందస్తు ఎన్నికలు జరిగాయి. జీవన వ్యయం, పెన్షన్లు, కనీస వేతనాలు, వలస విధానాలు ఈ ఎన్నికలలో ప్రధాన అంశాలుగా ముందుకొచ్చాయి. వామపక్ష న్యూ పాపులర్ ఫ్రంట్ సుమారు 180 సీట్లు గెలుచుకొని ప్రథమ స్థానంలో నిలిచింది. అధ్యక్షుడు మాక్రాన్ పార్టీ కూటమి సుమారు 160 సీట్లలో గెలిచింది. నేషనల్ ర్యాలీ (ఎక్స్ట్రీమ్ రైట్ వింగ్ పార్టీ) ఒక్కటే 125 సీట్లు గెలుచుకుంది. ఈ ఎన్నికల్లో ఏ కూటమికీ స్పష్టమైన మెజారిటీ రాలేదు. నేషనల్ ర్యాలీ యూరోపియన్ పార్లమెంటు ఎన్నికల్లో ముందంజలో నిలిచిన తర్వాత అధ్యక్షుడు మాక్రాన్ ముందస్తు ఎన్నికలు ప్రకటించారు. యూరోపియన్ యూనియన్ పార్లమెంటు ఎన్నికల్లో ఎక్స్ట్రీమ్ రైట్ వింగ్ పార్టీ బాగా పుంజుకోవడంతో ఫ్రాన్స్‌లో వామపక్షాలన్నీ ఒకే వేదికగా ఎన్నికల్లో పాల్గొని ఎక్స్ట్రీమ్ రైట్ వింగ్ పార్టీ దూకుడుకు కళ్ళెం వేశాయి. వామపక్షాలు, మధ్యేవాదులు, రైట్ వింగ్ పార్టీ మధ్య విభజన స్పష్టంగా కనిపించింది. వామపక్ష కూటమి అతిపెద్ద కూటమిగా అవతరించినప్పటికీ అధ్యక్షుడు ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం ఇవ్వలేదు.

ఇటలీ

పార్లమెంటు ఎన్నికలు సెప్టెంబర్ 2022లో జరిగాయి. జార్జియా మెలోని(నియంత ముస్సోలినీ వారసురాలు) నేతృత్వంలోని సెంటర్ రైట్ వింగ్ కూటమి రెండు పార్లమెంటు సభల్లో మెజారిటీ సాధించింది. ప్రతినిధుల సభలో కూటమికి 237 సీట్లు లభించాయి. కోవిడ్ అనంతర ఆర్థిక పరిస్థితులు, ఇంధన సంక్షోభం, జీవన వ్యయం, యూరోపియన్ యూనియన్ నిధుల వినియోగం వంటి అంశాలు ఎన్నికల్లో ప్రాధాన్యం పొందాయి. ఈ ఫలితం ఇటలీలో సంప్రదాయ ఎక్స్ట్రీమ్ రైట్ వింగ్ పార్టీ రాజకీయ శక్తుల ఎదుగుదలను సూచించింది.

స్పెయిన్

ప్రతినిధుల సభ ఎన్నికలు జూలై 2023న జరిగాయి. పీపుల్స్ పార్టీ (పిపి) 137 సీట్లు, సోషలిస్ట్ పార్టీ (పిఎస్‌ఓఇ) 121 సీట్లు, వాక్స్ 33 సీట్లు, సుమార్ 31 సీట్లు సాధించాయి. ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాలేదు. తర్వాత సోషలిస్ట్ పార్టీ నేత పెడ్రో సాంచెజ్ ప్రభుత్వం ఏర్పాటు చేశారు. ప్రధాన ప్రతిపక్ష పార్టీ అత్యధిక సీట్లు గెలిచినా, దానికి ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి అవసరమైన మెజారిటీ రాలేదు. సంకీర్ణాలు, ప్రాంతీయ పార్టీల మద్దతు ప్రాముఖ్యతను ఈ ఎన్నిక చూపించింది. మరలా ఇప్పుడు మధ్యంతర ఎన్నికలు జరగనున్నాయి.

పోలాండ్

పార్లమెంటు ఎన్నికలు అక్టోబర్ 2023లో జరిగాయి. పాలక లా అండ్ జస్టిస్ పార్టీ (పిఐఎస్) అత్యధిక ఓట్లు పొందినప్పటికీ, పార్లమెంటులో మెజారిటీని నిలబెట్టుకోలేకపోయింది. సివిక్ కూటమి, థర్డ్ వే, లెఫ్ట్ పార్టీల సహకారంతో డొనాల్డ్ టస్క్ ప్రభుత్వం ఏర్పడింది. ప్రభుత్వ మార్పు కోసం విభిన్న ప్రతిపక్ష పార్టీలు కలిసి కట్టుగా పనిచేసిన ఉదాహరణ ఇది. న్యాయ వ్యవస్థ, యూరోపియన్ యూనియన్‌తో సంబంధాలు, సామాజిక విధానాలు కూడా ఎన్నికల చర్చల్లో భాగమయ్యాయి.

అల్బేనియా

పార్లమెంటు ఎన్నికలు మే 2025లో జరిగాయి. ఎడి రామా నేతృత్వంలోని సోషలిస్ట్ పార్టీ 140 స్థానాల పార్లమెంటులో 83 సీట్లు గెలుచుకుని వరుసగా నాలుగోసారి అధికారంలోకి వచ్చిం ది. ప్రధాన ప్రతిపక్ష డెమొక్రటిక్ పార్టీ కూటమికి 50 సీట్లు వచ్చాయి. జీవన ప్రమాణాలు, అవినీతి ఆరోపణలు, యూరోపి యన్ యూనియన్ సభ్యత్వ లక్ష్యం ఎన్నికల్లో ముఖ్యమైన అంశా లు. ఎన్నికల ఫలితాలపై ప్రతిపక్షం సందేహాలు వ్యక్తం చేసింది. ఎన్నికల అక్రమాల ఆరోపణలను విచారించాలని ఇయు కోరింది.

హంగరీ

2022 ఏప్రిల్ 3న జరిగిన ఎన్నికల్లో విక్టర్ ఓర్బాన్ నాయ కత్వంలోని ఫిడెజ్ (ఫిడెస్), క్రిస్టియన్ డెమోక్రటిక్ పీపుల్స్ పార్టీ (కెడిఎన్‌పి) కూటమి మొత్తం 199 స్థానాల్లో 135 స్థానాలు గెలు చుకొని పార్లమెంటులో మూడింట రెండొంతుల మెజారిటీని సాధించింది. 2026 ఏప్రిల్ 12న జరిగిన ఎన్నికల్లో 199 స్థానాలున్న పార్లమెంటులో టిసా పార్టీ 141 స్థానాలు సాధిం చింది. అప్పటివరకు అధికారంలో ఉన్న ఫిడెజ్ – కెడిఎన్‌పి కూటమి ఘోర పరాజయం పొందింది. 135 స్థానాల నుండి 52 స్థానాలకు పడిపోయింది. టిసా పార్టీ నాయకుడు పీటర్ మాగ్యార్ మే 9, 2026న ప్రధాని అయ్యాడు. 16 సంవత్సరాలు ప్రధానిగా ఉన్న విక్టర్ ఓర్బాన్ జాతీయవాదం, వలస వ్యతిరేక విధానాలు, సంప్రదాయ సామాజిక విలువలకు ప్రాధాన్యం ఇచ్చాడు. న్యాయవ్యవస్థ, మీడియా, ప్రజాస్వామ్య సంస్థలను నిర్వీర్యం చేశాడు. పెద్ద నియంతలా వ్యవహరించాడు.

ఆయన పనితీరుపై దేశీయ ప్రతిపక్షాలు, అంతర్జాతీయ సంస్థ లు విమర్శలు చేశాయి. ఫలితంగా ప్రజా ఆగ్రహానికి గుర య్యాడు. రికార్డు స్థాయిలో దాదాపు 80 శాతం ఓట్లు పోల్ అవడం ఈ ఎన్నికల్లో ప్రజల ఆసక్తి, ప్రభుత్వ మార్పు పట్ల ఉన్న ఆకాంక్షకు నిదర్శనం. అదే సమయంలో, కొత్త ప్రభుత్వం ముందు అనేక సవాళ్ళు ఉన్నాయి. ముఖ్యంగా అవినీతిని అరికట్టడం, న్యాయవ్యవస్థ స్వతంత్రత, మీడియా స్వేచ్ఛలను పునరుద్ధరించడం, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల ప్రధాన అంశాలు అయినాయి.

జర్మనీ - రాష్ట్ర ఎన్నికలు

2026 సెప్టెంబర్‌లో జర్మనీలో కొన్ని రాష్ట్ర శాసనసభల ఎన్నికలు జరిగాయి. వీటిలో రెండు రాష్ట్రాలలో ఎక్స్ట్రీమ్ రైట్ వింగ్ పార్టీ అయిన ఏఎఫ్‌డి మంచి ఫలితాలను సంపాదించింది. బెర్లిన్ రాష్ట్రంలో వామపక్షాలు ప్రథమ స్థానంలో నిలిచాయి.

యూరోపియన్ యూనియన్ ఎన్నికలు

2024 జూన్‌లో జరిగిన యూరోపియన్ పార్లమెంటు ఎన్నికలు యూరప్ ప్రజాభిప్రాయాన్ని అంచనా వేయడానికి మరో ముఖ్యమైన ఆధారం. యూరోపియన్ పార్లమెంటు అధి కారిక ఫలితాల ప్రకారం, మొత్తం 720 స్థానాల్లో మధ్య-కుడి పక్ష క్రైస్తవ ప్రజాస్వామ్యవాదులు (ఇపిపి) 188 స్థానాలు (26.1% సీట్లు), సామాజిక ప్రజాస్వామ్యవాదులు (ఎస్ & డి) 136 స్థానాలు (18.9% సీట్లు), పేట్రియాట్స్ ఫర్ యూరప్ 84 స్థానాలు (11.7% సీట్లు), సంప్రదాయవాదులు (ఇసిఆర్) 78 స్థానాలు (10.8% సీట్లు), మధ్యేవాదులు (రిప్యూ యూరప్) 77 స్థానాలు (10.7% సీట్లు), పర్యావరణవాదులు (గ్రీన్స్ / ఇఎఫ్ఎ) 53 స్థానాలు (7.4% సీట్లు), వామపక్ష కూటమి (ది లెఫ్ట్) 46 స్థానాలు (6.4% సీట్లు) గెలుచుకున్నాయి. మూలం: యూరోపియన్ పార్లమెంటు, 2024-2029 అధికారిక లెక్కలు. ఈ ఫలితాలు మూడు అంశాలు తెలియజేస్తున్నాయి. 1) సంప్ర దాయ సెంటర్ రైట్ వింగ్ కూటమి ఇపిపి పార్లమెంటులో అతి పెద్ద గ్రూప్‌గా నిలిచింది. 2) కొన్ని దేశాల్లో రైట్ వింగ్, జాతీయ వాద పార్టీల బలం పెరిగింది. ముఖ్యంగా ఫ్రాన్స్, జర్మనీ, ఆస్ట్రియా దేశాల్లో ఈ ధోరణి ఎక్కువగా ఉంది. 3) గ్రీన్స్, మధ్యే వాద రిప్యూ యూరప్ వంటి గ్రూప్‌లు కొన్ని దేశాల్లో స్థానాలు కోల్పోయాయి. అయితే అన్ని దేశాల్లోనూ పర్యావరణ వాద లేదా వామపక్ష పార్టీల మద్దతు తగ్గిందని చెప్పలేం. ఈ ఎన్నికల్లో మొత్తం ఇయు ఓటింగ్ శాతం సుమారు 51%. అయితే దేశాల మధ్య భారీ వ్యత్యాసాలు ఉన్నాయి.

విశ్లేషణ

సైనిక వ్యయం, ఎన్నికలు, ప్రజా ఉద్యమాలు ఒకదానితో ఒకటి ముడిపడి ఉంటాయి. యూరప్‌లో 2022 తర్వాత రక్షణ వ్యయం వేగంగా పెరిగింది. అదే సమయంలో ఆయా దేశాల్లో జీవన వ్యయం, వేతనాలు, గృహ వసతి, ప్రజా సేవలపై అసంతృప్తి, కార్మిక సంఘాల సమ్మెలు, విద్యార్థుల నిరసనలు, రైతుల ఉద్యమాల ప్రభావం ఎన్నికల్లో వ్యక్తమైంది. కొన్ని దేశాల్లో

అధికార పార్టీలు ఘోరంగా దెబ్బతిన్నాయి. మొత్తంగా పెట్టుబడిదారీ విధానం, కార్పొరేట్ అనుకూల, ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరించిన అన్ని దేశాలలో అధిక ధరలు, నిరుద్యోగం, ప్రజల జీవన ప్రమాణాలు పడిపోవడంతో అధికార పార్టీలు/కూటములపై ప్రజలలో ఆగ్రహ జ్వాలలు వెల్లువెత్తాయి. రైట్ వింగ్ పార్టీలు ఆకర్షణీయ నినాదాలు, మోసపూరిత వాగ్దానాలతో కొన్ని దేశాలలో రాజకీయంగా లబ్ధి పొందాయి. ఫ్రాన్స్, బెర్లిన్‌లలో వామపక్షాలు మంచి ఫలితాలు సాధించాయి.

అర్జెంటీనా ఎన్నికల (2021-2025) అనుభవం

దక్షిణ అమెరికా దేశమైన అర్జెంటీనాలో 2021 నవంబరులో పార్లమెంటుకు మధ్యంతర ఎన్నికలు జరిగాయి. అప్పటి అధ్యక్షుడు ఆల్బెర్టో ఫెర్నాండెజ్‌కు చెందిన పెరోనిస్ట్ కూటమి అనేక ప్రాంతాల్లో మద్దతు కోల్పోయింది. ప్రతిపక్ష కూటమి జుంటోస్ పోర్ ఎల్ కాంబియో బలపడింది. ఆర్థిక పరిస్థితులు, ద్రవ్యోల్బణం, పేదరికం, కోవిడ్ అనంతర సమస్యలపై ప్రజల ఆగ్రహానికి ఈ ఎన్నికలు నిదర్శనం. ఈ ఫలితాలు అధికార కూటమిపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతున్నదని రుజువు చేస్తున్నాయి.

2023 ఎన్నికలు అర్జెంటీనా రాజకీయాల్లో పెద్ద మలుపు. మొదటి విడతలో మాస్సా ముందంజలో ఉన్నప్పటికీ, నవంబర్ 19న జరిగిన రెండో విడతలో మిలే 55.7% ఓట్లతో గెలిచారు. డిసెంబర్ 10, 2023న అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. ఈయన ఇటలీ జార్జియా మెలోని లాగే ఎక్స్ట్రీమ్ రైట్ వింగ్ నేత. గత ప్రభుత్వ కాలంలో ఉన్న అధిక ద్రవ్యోల్బణం, పెసో కరెన్సీ విలువపై ఒత్తిడి, పేదరికం, కుటుంబాల కొనుగోలు శక్తి తగ్గడం, సంప్రదాయ రాజకీయ పార్టీలపై అసంతృప్తి మిలే విజయానికి కారణాలు. దీన్ని రాజకీయ ప్రయోజనం కోసం మిలే వినియోగించుకున్నాడు. ప్రభుత్వ వ్యయాన్ని భారీగా తగ్గిస్తానని, ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ పాత్రను పరిమితం చేస్తానని మిలే హామీ ఇచ్చాడు.

తనను సంప్రదాయ రాజకీయ వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా ప్రచారం చేసుకున్నారు. ఆయన ఆర్థిక విధానాల్లో ప్రభుత్వ వ్యయాల కోత, నియంత్రణల సడ లింపు, మార్కెట్ ఆధారిత సంస్కరణలకు ప్రాధాన్యం ఇచ్చాడు. మిలే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ బడ్జెట్ లోటును తగ్గించడం, ప్రభుత్వ వ్యయాలను నియంత్రించడం, ఆర్థిక నియంత్రణలను సడలించడం వంటి చర్యలు చేపట్టింది. ఫలితంగా ప్రజలలో అసంతృప్తి మొదలైంది. ఇప్పటికే ఈయన పాలనలో కార్మికవర్గంపై పెద్దఎత్తున దాడులు జరుగుతున్నాయి.

బ్రెజిల్

ఇటీవల బ్రెజిల్ అధ్యక్ష స్థానానికి జరిగిన ఎన్నికలలో వామపక్ష అభ్యర్థి లూలా, అమెరికా బలపరిచిన ఎక్స్ట్రీమ్ రైట్ వింగ్ పార్టీ నేత జైర్ బోల్సనారోల మధ్య హోరాహోరీ పోటీ జరిగింది. బోల్సనారోను గెలిపించడానికి అమెరికా నానా అగచాట్లు పడింది. అయినా చివరికి వామపక్ష అభ్యర్థి లూలా నాలుగోసారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. ఓడిపోయిన బోల్స నారో కుటుంబంతో కలిసి అమెరికాలోని మయామికి వెళ్లిపో యారు. తాను పారిపోలేదని ఆయన చెప్పగా, ఆయన నిష్క్రమణ రహస్యంగా జరిగిందని లూలా విమర్శించారు. తాజాగా జరిగిన ఎన్నికలలో ఇజ్రాయిల్‌లో బెంజమిన్ నెతన్యాహు, అమెరికాలో డోనాల్డ్ ట్రంప్‌లకు ప్రజలు భారీ షాక్ ఇచ్చారు.

సోవియట్ యూనియన్ పతనం - ప్రపంచ దేశాలపై ప్రభావం

1989-91 మధ్య తూర్పు యూరప్‌లోని సోషలిస్ట్ వ్యవస్థలు పతనం కావడం, 1991 డిసెంబర్‌లో సోవియెట్ యూనియన్ రద్దు కావడంతో అమెరికా ఏకఛత్రాధిపత్యం నెలకొంది. ప్రపంచంలో పలు దేశాలు అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ, ప్రపంచబ్యాంక్ వంటి సంస్థల రుణాలపై ఆధారపడ్డాయి. ఆయా దేశాల ప్రభుత్వాలు ఈ సంస్థలు విధించిన షరతులు అమలు జరిపి ప్రజా సంక్షేమాన్ని విస్మరించి ప్రజలపై భారాలు మోపాయి. నిరుద్యోగం, ధరల పెరుగుదల, పేదరికం, నిలకడ లేని, ఎలాంటి హక్కులు లేని తాత్కాలిక ఉపాధి సమస్యల విష వలయంలో ప్రజలు చిక్కుకున్నారు. ఆర్థిక సంక్షోభాలు ఒకదాని తర్వాత ఒకటి దేశాలను వెంటాడాయి. సముద్రంలో అలలు ఎంత సహజమో పెట్టుబడిదారీ వ్యవస్థలో సంక్షోభాలు, నిరుద్యోగం అంతే సహజం. వీటి నుండి బయటపడే పేరుతో ప్రభుత్వాలు రకరకాల చిట్కాలను ఉపయోగించి కాలం నెట్టుకొచ్చాయి. ఇప్పుడు అలాంటి చిట్కాలు పనిచేసే కాలం దాటిపోయింది. ప్రజా ఉద్యమాలు ముఖ్యంగా యువత పెద్ద ఎత్తున వీధుల్లోకి వస్తున్నది. ప్రభుత్వాలు ఆఖరి ఆయుధంగా ప్రజల నోళ్లు నొక్కి తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నాయి. అమెరికా, భారతదేశం, ఫ్రాన్స్‌లలో నేడు జరుగుతున్నది అదే.

పరిష్కారం

అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ, ప్రపంచ బ్యాంక్ వంటి సంస్థల ఆదేశిత ప్రజా వ్యతిరేక విధానాలకు ప్రత్యామ్నాయంగా ప్రజానుకూల విధానాల ఆధారంగా వామపక్ష, ప్రజాతంత్ర శక్తులు ఐక్యం కావాలి. ప్రజలలో విశ్వాసాన్ని, నమ్మకాన్ని నెలకొల్పాలి. ఐక్యరాజ్యసమితి ప్రపంచవ్యాప్తంగా సామాజిక అభివృద్ధి సూచికలను నిర్ణయించి వాటిని 2030లోగా అమలు చేయాలని సూచించింది. అందులో అందరికీ నాణ్యమైన ఉచిత విద్య, సార్వత్రిక ఆరోగ్య వ్యవస్థ, అందరికీ ఉపాధి, సామాజిక సంక్షేమం, వృద్ధుల సంక్షేమం ఉన్నాయి. ఆ లక్ష్యాల సాధనకు ప్రత్యామ్నాయ విధానాలే సరైన, అసలైన పరిష్కారం. ❑

బ్రెజిల్ అధ్యక్ష ఎన్నికలు లూలా తిరిగి విజయం!

2026 అక్టోబర్ 25న బ్రెజిల్‌లో అధ్యక్ష ఎన్నికల రెండో విడత పోలింగ్ జరిగింది. ఇందులో ప్రస్తుత అధ్యక్షుడు లూలా డా సిల్వా గెలిచినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. లూలా డా సిల్వాకు 51.8% ఓట్లు వచ్చాయి. ప్రత్యర్థి బోల్సొనారోకు 48.2% ఓట్లు వచ్చాయి. లూలా తిరిగి 2027 జనవరి 5న అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేస్తారు. ఈ ఫలితానికి ఒక ప్రత్యేకత ఉంది. అక్టోబర్ 4న జరిగిన మొదటి విడతలో లూలా కంటే బోల్సొనారో ఎక్కువ ఓట్లు సాధించారు. అయితే ఎవరికీ అవసరమైన 50% రాకపోవడంతో రెండో విడత పోలింగ్ నిర్వహించారు. అందులో లూలా తన వెనుక బాటును అధిగమించి విజయం సాధించారు. ఈ ఎన్నికను కేవలం ఇద్దరు వ్యక్తుల మధ్య పోటీగా మాత్రమే చూడకూడదు. ఇందులో కార్మికుల జీవన పరిస్థితులు, ఆర్థిక విధానాలు, నేరాల నియంత్రణ, సామాజిక సంక్షేమం, ప్రజాస్వామ్య సంస్థల పాత్ర, అమెరికాతో సంబంధాలు వంటి అంశాలు చర్చకు వచ్చాయి.

లూలా: కార్మిక ఉద్యమం నుంచి అధ్యక్ష పదవి వరకు..

లూలా 1945 అక్టోబర్ 27న బ్రెజిల్‌లోని పెర్నాంబుకో రాష్ట్రంలో జన్మించారు. పేద కుటుంబంలో పెరిగిన ఆయన, విద్య పూర్తి చేసిన తరువాత లోహ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేశారు. అనంతరం కార్మిక సంఘాల నాయకుడిగా ఎదిగారు. 1970ల చివర్లో సావో పాలో పరిసరాల్లో జరిగిన కార్మిక సమ్మెల ద్వారా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారు.

1980లో బ్రెజిల్ వర్కర్స్ పార్టీ (PT) స్థాపనలో లూలా కీలక పాత్ర పోషించారు. కార్మిక హక్కులు, వేతనాలు, సామాజిక అసమానతల తగ్గింపు, పేదరిక నిర్మూలన వంటి అంశాలను తన రాజకీయ కార్యక్రమంలో ప్రధానంగా ముందుకు తెచ్చారు.

2002లో తొలిసారిగా అధ్యక్షుడిగా ఎన్నికై 2003–2010 మధ్య రెండు దఫాలు అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. ఆ తరువాత డిల్మా రూసెఫ్ అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. 2018 ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న సమయంలో లూలాపై అక్రమంగా అవినీతి ఆరోపణలు చేసి జైలుకు పంపారు. సుమారు 580 రోజులు జైలులో ఉన్నారు. తరువాత బ్రెజిల్ సుప్రీంకోర్టు ఆయనపై విధించిన శిక్షలను రద్దు చేసింది. 2022లో జరిగిన ఎన్నికల్లో అప్పటి అధ్యక్షుడు జైర్ బోల్సొనారోను ఓడించి మళ్లీ అధికారంలోకి వచ్చారు. లూలా



రాజకీయ ప్రయాణంలో కార్మిక ఉద్యమం, సంక్షేమ కార్యక్రమాలు, ఎన్నికల ద్వారా అధికార మార్పిడి, న్యాయ వ్యవస్థతో ఘర్షణలు అన్నీ భాగంగా ఉన్నాయి.

జైర్ బోల్సొనారో నుంచి ఫ్లావియో బోల్సొనారో వరకు

జైర్ బోల్సొనారో 2019 నుంచి 2022 వరకు బ్రెజిల్ అధ్యక్షుడిగా పనిచేశారు. ఆయన రాజకీయ వైఖరిలో సంప్రదాయవాదం, కఠినమైన నేర నియంత్రణ, సైనిక పాలన కాలంపై అనుకూల వ్యాఖ్యలు, పరిమిత ప్రభుత్వ జోక్యం వంటి అంశాలు ప్రధానంగా కనిపించాయి. లూలా రాజకీయంగా ఆయనకు ప్రధాన ప్రత్యర్థి. 2022 అధ్యక్ష ఎన్నికల్లో జైర్ బోల్సొనారో ఓడిపోయారు. అనంతరం ఎన్నికల ఫలితాలను అంగీకరించడంపై వివాదాలు ఏర్పడ్డాయి. ఆయన మద్దతుదారులు 2023 జనవరిలో ప్రభుత్వ భవనాలపై దాడిచేశారు. 2025 సెప్టెంబరులో బ్రెజిల్ సుప్రీంకోర్టు జైర్ బోల్సొనారోపై తిరుగుబాటు కుట్రకు సంబంధించి 27 ఏళ్ల జైలు శిక్ష విధించింది. ఆ తరువాత ఆయన కుమారుడు ఫ్లావియో బోల్సొనారో అధ్యక్ష ఎన్నికల బరిలోకి వచ్చారు. ఆయన ఎక్స్ట్రీమ్ రైట్ వింగ్ రాజకీయాలకు ప్రాతినిధ్యం వహిస్తూ నేర నియంత్రణ, ఆర్థిక విధానాలు, అమెరికాతో సన్నిహిత సంబంధాల వంటి అంశాలను ప్రచారంలో ముందుకు తెచ్చారు. అందువల్ల 2026 ఎన్నికల్లో పోటీ లూలా వర్సెస్ ఫ్లావియోగా కనిపించినప్పటికీ, దాని వెనుక గత ఎన్నికల వివాదాలు, జైర్ బోల్సొనారోపై న్యాయచర్యలు, దేశ భవిష్యత్తు రాజకీయ దిశ వంటి అంశాలు ఉన్నాయి.

లూలాను ఓడించడానికి అమెరికా ట్రంప్ ప్రభుత్వం?

ఇందుకు సంబంధించి అత్యంత ప్రాధాన్యమైన సమాచారం 2026 అక్టోబర్ 24న రాయిటర్స్ ప్రచురించిన పరిశోధనాత్మక వార్తలో ఉంది. రాయిటర్స్ కథనం ప్రకారం, అమెరికా విదేశాంగ శాఖలోని ఇద్దరు రాజకీయ నియామక అధికారులు డారెన్ బీటీ, రికార్డో పిటా బోల్సొనారో కుటుంబం తిరిగి బ్రెజిల్ అధికారంలోకి రావడానికి అనుకూలంగా చర్యలు చేపట్టారని, లూలా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే చర్యలను ప్రోత్సహించారని పది మంది ప్రస్తుత, మాజీ అమెరికా అధికారుల సమాచారంతో వార్తా సంస్థ వెల్లడించింది. అమెరికా ప్రభుత్వం బోల్సొనారో కుటుంబానికి అనుకూలంగా వ్యవహ రించిందని విశ్వసనీయ ఆధారం ఉంది.

బ్రెజిల్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిపై ఆంక్షలు:

జైర్ బోల్సొనారోపై విచారణలకు నాయకత్వం వహించిన సుప్రీంకోర్టు న్యాయమూర్తి అలెగ్జాండ్రె డి మొరాయిస్‌పై 2025 జూలైలో అమెరికా మాగ్నిట్స్కీ చట్టం కింద ఆంక్షలు విధించింది. అమెరికా ప్రభుత్వం దీనికి భావప్రకటనా స్వేచ్ఛకు సంబంధించిన కారణాలను పేర్కొంది. రాయిటర్స్ ప్రకారం, ఈ ఆంక్షలు విధించేందుకు అమెరికా విదేశాంగ శాఖ అధికారులు ప్రయత్నాలు చేశారు. డిసెంబర్ 2025లో మొరాయిస్‌ను ఆంక్షల జాబితా నుంచి అమెరికా తొలగించింది.

బ్రెజిల్ వస్తువులపై 50 శాతం సుంకాలు:

2025 జూలైలో అమెరికా బ్రెజిల్ నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై 50 శాతం సుంకాలను ప్రకటించింది. జైర్ బోల్సొనారోపై జరుగుతున్న చర్యలను అమెరికా వ్యతిరేకిస్తూ ఆంక్షలు విధించింది. ఈ చర్య వల్ల బ్రెజిల్ ఎగుమతిదారులు, రెండు దేశాల మధ్య వాణిజ్యంపై ఒత్తిడి ఏర్పడింది. తరువాత కొన్ని సుంకాలను అమెరికా సడలించింది. ఈ సుంకాలు లూలా ప్రభుత్వాన్ని బలహీనపరిచే ప్రభావం చూపాలని ఉద్దేశించినవని కొందరు విశ్లేషకులు అభిప్రాయ పడ్డారని రాయిటర్స్ తెలిపింది.

బ్రెజిల్ నేర ముఠాలను ఉగ్రవాద సంస్థలుగా ప్రకటించడం:

బ్రెజిల్‌లోని PCC, Comando Vermelho అనే పెద్ద నేర ముఠాలను విదేశీ ఉగ్రవాద సంస్థలుగా గుర్తించాలనే ప్రయ త్నాన్ని బోల్సొనారో కుటుంబం ప్రోత్సహించిందని రాయిటర్స్ నివేదించింది. 2026 మేలో ఫ్లావియో బోల్సొనారో అమెరికా అధికారులతో ఈ అంశంపై సమావేశమయ్యారు. మరుసటి రోజు అమెరికా విదేశాంగ శాఖ ఆ సంస్థలను ఉగ్రవాద సంస్థలుగా ప్రకటించింది. ఈ చర్య బ్రెజిల్‌లో నేర నియంత్రణ అంశాన్ని రాజకీయ చర్చలో మరింత ముందుకు తెచ్చింది.

బోల్సొనారో కుటుంబంతో అమెరికా అధికారుల సంబంధాలు

రాయిటర్స్ కథనం ప్రకారం, అమెరికా అధికారులు మొదట మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సొనారో తిరిగి అధికారంలోకి రావాలనే లక్ష్యానికి అనుకూలంగా పనిచేశారని, ఆయనకు శిక్ష విధించబడిన తరువాత ఫ్లావియో బోల్సొనారో అభ్యర్థిత్వానికి మద్దతుగా తమ వైఖరిని మార్చారని సమాచారం ఇచ్చిన వ్యక్తులు తెలిపారు. ఇతర రైట్ వింగ్ అభ్యర్థులతో సంబంధాలు పెట్టుకోవద్దని అమెరికా దౌత్య సిబ్బందికి బోల్సొనారో సూచించినట్లు కూడా ఆ కథనం పేర్కొంది.

ఆంక్షలు లూలాకు వ్యతిరేకంగా పనిచేశాయా?

రాయిటర్స్ కథనంలో ప్రస్తావించిన బ్రెజిల్ రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, అమెరికా చర్యలు ఆశించిన ఫలితానికి విరుద్ధంగా ఉన్నాయి. ముఖ్యంగా న్యాయమూర్తిపై ఆంక్షలు విధించినప్పటికీ, జైర్ బోల్సొనారోపై విచారణ ఆగలేదు. అమెరికా సుంకాలు బ్రెజిల్ ఎగుమతిదారులపై ఆర్థిక ఒత్తిడిని పెంచాయి. ఈ సుంకాలు బ్రెజిల్‌లో జాతీయ ప్రయో జనాలు, సార్వభౌమాధికారం అంశాలను రాజకీయ చర్చలోకి తెచ్చాయి. బ్రెజిల్, అమెరికాలోని వాణిజ్య సంస్థలు కూడా సుం కాల ప్రభావంపై అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. ఈ పరిణా మాల వల్ల లూలా ప్రభుత్వానికి రాజకీయంగా లాభం కలిగిం దని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. ఎన్నికల ఫలితాన్ని ప్రభా వితం చేసిన ఇతర అంశాలూ ఉన్నాయి. జీవన వ్యయం, ఆహార ధరలు, నేర నియంత్రణ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సామాజిక మాధ్యమాల ప్రచారం, యువ ఓటర్ల భాగస్వామ్యం, ప్రజా ఉద్యమాలు వంటి అంశాలు కూడా కీలకంగా నిలిచాయి.

లూలా విజయానికి దోహదపడిన అంశాలు:

మొదటి విడతలో వెనుకబడిన తరువాత లూలా ప్రచారాన్ని పునర్వ్యవస్థీకరించారు. యువతను ఆకర్షించేందుకు ప్రయత్నిం చారు. ప్రజాస్వామ్య విలువలు, గత ప్రభుత్వ రికార్డు, సంక్షేమ కార్యక్రమాలను ప్రచారంలో ముందుకు తెచ్చారు. బ్రెజిల్ ప్రభుత్వ వార్తా సంస్థ Agncia Brasil ప్రకారం, లూలా ప్రచారం లో సామాజిక మాధ్యమాల వినియోగం పెరిగింది. ఆన్‌లైన్ ప్రచార బృందాలు, వీధి ప్రదర్శనలు, విద్యార్థులు, సామాజిక ఉద్యమాల కార్యక్రమాలు ఆయన ప్రచారానికి ఊపునిచ్చాయి.

వేతనాలు, సంక్షేమం, జీవన వ్యయం:

లూలా ఎన్నికల ప్రణాళికలో ద్రవ్యోల్బణం కంటే ఎక్కువగా కనీస వేతనాన్ని పెంచడం, విద్యా ప్రోత్సాహక కార్యక్రమాలను విస్తరించడం, ఆరోగ్య సంరక్షణలో పెట్టుబడులు పెంచడం వంటి హామీలు ఉన్నాయి.

నేర నియంత్రణ, ప్రజా భద్రత:

బ్రెజిల్‌లో నేరాల నియంత్రణ ప్రధాన ఎన్నికల అంశంగా నిలిచింది. ఫ్లావియో బోల్సొనారో కఠినమైన నేర నియంత్రణ విధానాలను ప్రచారం చేయగా, లూలా కూడా ప్రజా భద్రత విషయంలో కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యాన్ని పెంచే ప్రతిపాదనల ను ముందుకు తెచ్చారు. అందువల్ల ఈ ఎన్నికను కేవలం ఎడమపక్షం, కుడిపక్షం మధ్య పోటీగా కాకుండా ఆర్థిక భద్రత, సామాజిక సంక్షేమం, ప్రజా భద్రతపై వేర్వేరు విధానాల మధ్య పోటీగా చూడాలి.

బ్రెజిల్‌కు అమెరికాతో సంబంధాలు ఎందుకు కీలకం?

బ్రెజిల్ లాటిన్ అమెరికాలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. వ్యవసాయ ఉత్పత్తులు, సోయాబీన్స్, మాంసం, ఇనుప ఖనిజం, పారిశ్రామిక ఉత్పత్తులు వంటి రంగాల్లో అంతర్జాతీయ వాణిజ్యంలో కీలక పాత్ర పోషిస్తుంది. అమెరికా బ్రెజిల్‌కు ముఖ్యమైన వాణిజ్య భాగస్వామి. అందువల్ల రెండు దేశాల మధ్య సుంకాలు, ఆంక్షలు, పెట్టుబడులు, సాంకేతిక సహకారం వంటి అంశాలు బ్రెజిల్ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపగలవు. లూలా ప్రభుత్వ విదేశాంగ విధానం సాధారణంగా అమెరికాతో సంబం ధాలను కొనసాగిస్తూనే చైనా, బ్రిక్స్ దేశాలు, ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలతో సహకారాన్ని విస్తరించడంపై దృష్టి పెట్టింది. అమెరికా ప్రభుత్వంతో విభేదాలు ఉన్నప్పటికీ వాణిజ్య సంబంధాలను కొనసాగించడం, బ్రెజిల్ ప్రయోజనాలను కాపాడుకోవడం లూలా ముందున్న ముఖ్యమైన సవాలు.

ఎన్నికల ఫలితం-అంతర్జాతీయ రాజకీయాలపై ప్రభావం:

లూలా విజయం 3 ప్రధాన అంశాలను చర్చలోకి తెచ్చింది.

మొదటిది దేశీయ ఓటర్ల నిర్ణయం: అంతర్జాతీయంగా ఎంత ఒత్తిడి ఉన్నా, చివరికి ఎన్నికల ఫలితాన్ని నిర్ణయించేది ఆ దేశ ఓటర్లే.

రెండోది విదేశీ ఆర్థిక ఒత్తిడుల పరిమితులు: సుంకాలు, ఆంక్షలు వంటి చర్యలు ప్రభుత్వాలపై ఒత్తిడి సృష్టించగలవు. అయితే వాటి రాజకీయ ఫలితం ముందుగా ఊహించిన విధంగా ఉండాల్సిన అవసరం లేదు. బ్రెజిల్ విషయంలో ఈ చర్యలు జాతీయ సార్వభౌమాధికారం గురించి చర్చను మరింత పెంచినట్లు విశ్లేషకులు పేర్కొన్నారు.

ప్రజాస్వామ్య సంస్థల ప్రాధాన్యం: ఎన్నికల ఫలితాలను అంగీక రించడం, న్యాయస్థానాల స్వతంత్రత, ఎన్నికల నిర్వహణలో పారదర్శకత వంటి అంశాలు ప్రజాస్వామ్య స్థిరత్వానికి కీలకం. ఎన్నికల తరువాత ఫ్లావియో బోల్సొనారో ఓటమిని అంగీకరించ కుండా, పోలింగ్ సమయాన్ని పొడిగించిన నిర్ణయంపై అభ్యంతరం వ్యక్తం చేసి ఫలితాలను రద్దు చేయాలని కోరినట్లు కొన్ని వార్తా సంస్థలు పేర్కొన్నాయి. అయితే పోలింగ్ సమయం పొడిగించడం ఫలితాన్ని ప్రభావితం చేయలేదనీ ఎన్నికల అధికారులు తెలియజేశారు. ఎన్నికలను రద్దు చేయడానికి సరిపడా న్యాయపరమైన ఆధారాలు ఉన్నాయా అనేది వేరుగా పరిశీలించాల్సిన అంశం.

భారతదేశం, కార్మిక ఉద్యమాలు:

బ్రెజిల్ ఎన్నికల పరిణామాలు భారతదేశంతో సహా ఇతర ప్రజాస్వామ్య దేశాలకూ కొన్ని ముఖ్యమైన ప్రశ్నలను ముందుకు తెస్తున్నాయి.

కార్మికుల సమస్యలు: వేతనాలు, ఉద్యోగ భద్రత, సామాజిక సంక్షేమం ఎన్నికల చర్చలో ఎంత ముఖ్యమైన పాత్ర పోషిస్తాయో గమనించాలి.

విదేశాంగ స్వతంత్రత: పెద్ద దేశాలతో వాణిజ్యం, పెట్టుబడులు అవసరమే అయినా, దేశీయ విధానాలపై స్వతంత్ర నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం కూడా ముఖ్యం.

ఆర్థిక ఆంక్షల ప్రభావం: అమెరికా ఆంక్షలు కేవలం ప్రభుత్వానికే కాకుండా కార్మికులు, రైతులు, పరిశ్రమలు, ఎగుమతి దారులపైనా ప్రభావం చూపవచ్చు.

ప్రజాస్వామ్యంపై నమ్మకం: ఓటర్ల తీర్పు, ఎన్నికల సంఘాల విశ్వసనీయత, న్యాయవ్యవస్థ స్వతంత్రత ప్రజాస్వామ్యానికి పునాది.

ముగింపు: 2026 బ్రెజిల్ అధ్యక్ష ఎన్నికల్లో లూలా డా సిల్వా తిరిగి ఎన్నిక కావడం ఒక ముఖ్యమైన రాజకీయ పరిణామం. మొదటి విడతలో వెనుకబడిన ఆయన రెండో విడతలో విజయం సాధించారు. ఈ ఫలితంలో దేశీయ రాజకీయాలు, సామాజిక సంక్షేమం, ప్రజా భద్రత, ప్రచార వ్యూహాలు, అంతర్జాతీయ సంబంధాలు అన్నీ పాత్ర పోషించాయి. ట్రంప్ ప్రభుత్వంలోని కొందరు అధికారులు బోల్సొనారో కుటుంబానికి అనుకూలంగా పనిచేసి, లూలా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే చర్యలను ప్రోత్సహిం చారని రాయిటర్స్ నివేదించింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తిపై ఆంక్షలు, బ్రెజిల్ వస్తువులపై సుంకాలు, నేర ముఠాలను ఉగ్ర వాద సంస్థలుగా గుర్తించే చర్యలు ఈ వివాదంలో ప్రధాన అంశాలుగా నిలిచాయి.


ఈ ఎన్నికల నుంచి తీసుకోవాల్సిన ప్రధాన పాఠం ఏమిటంటే, ప్రజాస్వామ్యంలో దేశ భవిష్యత్తును నిర్ణయించే హక్కు ఆ దేశ ప్రజలకే చెందుతుంది. విదేశీ ప్రభుత్వాల ఆర్థిక, దౌత్య ఒత్తిళ్లు రాజకీయ పరిణామాలను ప్రభావితం చేయగలిగినా, అవి తప్పనిసరిగా ఆశించిన ఫలితాన్ని ఇవ్వవు. అదే సమయంలో ఎన్నికల ఫలితాన్ని ఒక్క కారణంతో వివరించడం కూడా సరి కాదు. ప్రజల ఆర్థిక పరిస్థితులు, ప్రభుత్వ విధానాలు, రాజకీయ విశ్వాసాలు, ప్రజాస్వామ్య సంస్థలపై నమ్మకం – ఇవన్నీ కలిసే ఎన్నికల తీర్పును నిర్మిస్తాయి. ❑ **(ది వైర్ సౌజన్యంతో)**

మహాత్మునితో ఆత్మకథ రాయించినదెవరు?



- డా. నాగసూరి వేణుగోపాల్

గాంధీజీ స్వీయ చరిత్రకు ఇప్పుడు శతవార్షికం నడు స్తోంది. 1925 నవంబర్ 26న తన ఆత్మకథకు నాంది వచనా లు వంటి ఉపోద్ఘాతాన్ని మహాత్ముడు నమోదు చేశాడు. తొలుత 'నవజీవన్' పత్రికలో ఒక ధారావాహికగా మొదలైన ఈ కథనం పుస్తక రూపంలో తొలి భాగం 1927, రెండవ భాగం 1929లో ప్రచురింపబడింది. 50 వేల కాపీలు ప్రచురింపబడిన తర్వాత 1940లో ఒకే పుస్తకంగా రావడం మొదలైంది. ఈ వందేళ్లలో కోటికి మించిన సంఖ్యలో ప్రతులు అమ్ముడుపోయిన పుస్తకంగా గాంధీజీ స్వీయచరిత్ర 'సత్యశోధన' నిలుస్తోంది. భాషా పరంగా చూస్తే కేవలం ఇంగ్లీషు ప్రతి మాత్రమే 65.09 లక్షలు అమ్ముడు పోయినట్టు గుజరాతి 14, మలయాళం 9.1, హిందీ 7, తమిళం 7.7, కన్నడ 2.3, తెలుగు 1.7 లక్షలని కూడా తెలుస్తోంది. నేటికీ ఈ పుస్తకానికి వన్నె తగ్గకుండా ఆదరణ పెరుగుతున్నది. మరి ఇలాంటి పుస్తకాన్ని గాంధీజీ రాయడానికి కారణం ఎవరు?



స్వీయ చరిత్ర రాయమని తన మిత్రులు, సహాశ్రామికులు చేసిన విన్నపాన్ని గాంధీజీ నాలుగైదేళ్ల క్రితం అంగీకరించారు. ఒక పేజీ ఆయన రాశారో లేదో గాని అంతలో బొంబాయిలో అల్లర్లు మొదలు కావడంతో ఆ పని అంతటితో ఆగిపోయింది. కానీ జరిగిన సంఘటనలు మాత్రం ఆయనను ఎర్రవాడ కారాగార వాసానికి పంపించాయి. మిగతా పనులన్నీ పక్కనపెట్టి స్వేచ్ఛ చరిత్ర రాయమని జైలులో తోటి ఖైదీగా ఉన్న జైరాం దాస్ దౌలత్రామ్ గాంధీజీని కోరారు. తర్వాతి కాలంలో తొలి కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రిగా, తొలినాళ్ల రాజ్యసభ సభ్యులు, అస్సాం, బీహార్ రాష్ట్రాల గవర్నర్‌గా జై రాం దాస్ దౌలత్రామ్ మనకు తెలుసు. ఆ సమయంలో ఏమేమి చదవాలో నిర్ణయించుకున్నారు. కనుక, అవి పూర్తి అయితే స్వీయ చరిత్ర రచన చేపడతానని గాంధీజీ చెప్పారు. అయితే ఆ జైలు వాసం మధ్యలోనే ముగియకపోతే, ఆ ఎర్రవాడ జైలు వాసంలోనే స్వీయ చరిత్ర రచన పూర్తయి ఉండేదని కూడా గాంధీజీ పేర్కొన్నారు.

జైలు నుంచి తిరిగి రాగానే స్వామి ఆనంద్ ఇదే ప్రతిపాదనను గాంధీజీ ముందు మళ్లీ ఉంచారు. ఎందుకంటే అప్పటికి **సత్యాగ్రహ ఇన్ సౌత్ ఆఫ్రికా** రచన పూర్తయింది కనుక. వారం వారం సాగే ధారావాహిక కాకుండా, నేరుగా పుస్తకంగా రాయమని గాంధీజీని స్వామి ఆనంద్ కోరారు. అలా విడిగా రాయడానికి సమయం లేదు కనుక, సీరియల్ గానే రాస్తానని గాంధీజీ ప్రతిపాదించినప్పుడు స్వామి ఆనంద్ అంగీకరించారు. అయితే ఎవరీ స్వామి ఆనంద్? మహావిష్ణువు సంబంధించి మన పురాణాలలో చాలా రకాల పాత్రలు సకాలంలో రావడం, ఏవో చాలా కీలకమైన పనులు నిర్వహించడం తారసపడుతూ ఉంటుంది. అలాంటి ఆశ్చర్యకరమైన రీతిలో ఎంతోమంది వ్యక్తులు గాంధీజీకి సంబంధించి ఎన్నో రకాల బాధ్యతలను అవలీలగా పూర్తిచేశారు. దక్షిణాఫ్రికా నుంచి గాంధీజీ భారత

దేశం తిరిగి వచ్చిన తర్వాత రెండవ రోజే కలిసిన వ్యక్తి స్వామి ఆనంద్. నిజానికి ఆ పేరు స్వామి ఆనందానంద్ అనే పేరుకు కుదించిన రూపం. కానీ ఈయన అసలు పేరు హిమ్మత్ లాల్ రామచంద్ర దవే.

నిజానికి స్వామి ఆనంద్ మూడు రకాలుగా గుర్తుండిపోయే వ్యక్తి. గాంధీజీ అనుచరుడుగా, స్వాతంత్ర్య సమరయోధుడిగా కొనసాగడం ఒక పార్శ్వం. సామాజిక బాధ్యతను ఎరిగిన, గుర్తు చేసిన కీలకమైన గుజరాతీ సాహితీవేత్తగా చేసిన సృజన ఇంకొక అంశం. యోగిగా తన జీవితాన్ని మార్చుకొని, దానికి రాజకీయ పోరాటాన్ని మేళవింపచేసిన ఆధునిక యోధుడు కూడా ఆయనే. 1887 సెప్టెంబరు 8న గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు సుమారు 70 మైళ్ల దూరంలో ఉండే సౌరాష్ట్ర ప్రాంతం, షియాని గ్రామంలో రామచంద్ర దవే ద్వివేది, పార్వతి దంపతులకు హిమ్మత్ లాల్ జన్మించారు. ఉపాధ్యాయుడైన తండ్రికి కలిగిన ఏడుగురు సంతానంలో ఈయన ఒకరు. బాల్యం, తొలి చదువు బొంబాయిలో సాగాయి.

వివాహాన్ని తను వ్యతిరేకిస్తున్న సమయంలో ఒక సన్యాసి దేవుణ్ణి చూపిస్తానంటే ఇల్లు వదిలి వెళ్లిపోయాడు. అలా వేర్వేరు చోట్ల, వేర్వేరు సన్యాసులతో మూడేళ్లపాటు తిరిగి రామకృష్ణ మిషన్‌లో చేరారు. ఆ సమయంలోనే తన పేరు మార్చుకున్నారు. అద్వైతాశ్రమంలో చదువుకుంటూ కొంతకాలం గడిపారు.

1905లో జరిగిన బెంగాల్ విభజన ఆయనను స్వాతంత్రోద్యమం వైపు నడిపింది. క్రమంగా తీవ్రవాదం వైపు ఆకర్షితులై 1907లో బాలగంగాధర్ తిలక్ నడిపిన **కేసరి** మరాఠీ పత్రికలో కొంత కాలం పనిచేశారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో స్వాతంత్రోద్యమ కార్యకలాపాల్లో పాల్గొనేవారు. ఃరాష్ట్రమత్ఃు మరాఠీ పత్రిక వారి గుజరాతి ఎడిషన్‌కు సంపాదకుడిగా పనిచేశారు. 1909లో ఈ పత్రికను మూసి వేసినప్పుడు హిమాలయాలకు వెళ్లారు. 1912లో ఆల్మోరాలో అనీబిసెంట్ ప్రారంభించిన హిల్ బాయ్స్ స్కూల్‌లో బోధించించారు.

దక్షిణాఫ్రికా నుంచి గాంధీజీ భారతదేశానికి తిరిగి వచ్చిన మరుసటి రోజే, 1915 జనవరి 10 స్వామి ఆనంద్ బొంబాయి లో కలిశారు. అహ్మదాబాద్ నుంచి 1919 సెప్టెంబర్‌లో **నవ జీవన్** పత్రికను ప్రారంభించినప్పుడు గాంధీజీ బాధ్యతలు పంచుకోవడానికి స్వామి ఆనంద్‌ను ప్రచురణల మేనేజర్‌గా ఆహ్వానించారు. మేనేజర్‌గా, ఎడిటర్‌గా చక్కగా రాణించిన వ్యక్తి స్వామి ఆనంద్. **నవజీవన్**కు అనుబంధంగా **యంగ్ ఇండియా** ప్రారంభించడంలోనూ, ప్రచురణాలయాన్ని పెద్ద ప్రాంగణంలోకి మార్చడంలోనూ స్వామి ఆనంద్ కీలకపాత్ర వహించారు.

యంగ్ ఇండియాలో ఒక వ్యాసం ప్రచురించిన కారణంగా స్వామి ఆనంద్ 1922 మార్చి 18న జైలు పాలై, ఒకటిన్నర సంవత్సరం శిక్ష అనుభవించారు.

గాంధీజీ ఆత్మకథ రాయాలని, అది కూడా నేరుగా పుస్తకంగా మొదట రావాలని స్వామి ఆనంద్ వాంఛించారు. కానీ అలా కాకుండా నవజీవన్‌లో, యంగ్ ఇండియాలో, సీరియల్‌గా 1925లో మొదలైంది. 1926లో గాంధీజీ సత్యాగ్రహ ఆశ్రమంలో భగవద్గీత సంబంధించి కొన్ని ప్రసంగాలు చేశారు. వీటి ఆధారంగా **భగవద్గీత అకార్డింగ్ టు గాంధీ** అనే రచన రావడం లో కూడా స్వామి ఆనంద్ పాత్ర చాలా ఉంది.

వల్లభాయ్ పటేల్ బార్డోలీలో సత్యాగ్రహం ప్రారంభించినప్పుడు ఆయనకు కార్యదర్శిగా సేవలందించారు. 1930లో బొంబాయి లోని విలే పర్లేలో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్న కారణంగా మూడేళ్లపాటు జైలు శిక్ష అనుభవించారు. విడుదలైన తర్వాత ఆదివాసుల కోసం, అవకాశాలు కోల్పోయిన వారి కోసం బోర్డీ లోను, అలాగే థానే, కౌసని, కోస్వాడ్‌లలో ఆశ్రమాలు ప్రారం భించారు. 1934లో బీహార్ భూకంపం సంభవించినప్పుడు పునరావాస కార్యక్రమాలలో పాల్గొన్నారు. అలాగే 1942 క్విట్ ఇండియా ఉద్యమంలో చురుగ్గా ఉన్నారు.

1947లో దేశ విభజన జరిగినప్పుడు సియాల్కోట, హరిద్వార్ లలో కాందిశీకులకు సహాయక చర్యలు చేపట్టారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత వ్యవసాయం, రైతుల సమస్యలు, పంటల దిగు బడి, ఆదాయం, గ్రామీణ వాసుల దైనందిన బతుకు సంబం ధించి ఎంతో కృషిచేశారు. 1957 నుంచి చివరి దాకా అంటే 1976 జనవరి 25న కనుమూసే దాకా బొంబాయి సమీపంలో దహనులోని కొస్బాగ్ అగ్రికల్చర్ ఇన్స్టిట్యూట్ ఆయన నివాసం అయింది.

గుజరాతి, మరాఠీ, సంస్కృతం, హిందీ, ఉర్దూ, ఇంగ్లీష్ భాషల లో నిష్ణాతులైన స్వామి ఆనంద్ మొదటి మూడు భాషల్లోని సాం ప్రదాయ, జనపద రీతులను విశేషంగా అధ్యయనం చేశారు. వీరి మీద ఎమర్సన్, మాక్సిముల్లర్, వాల్ట్ విట్మన్, అరవిందుడు, వివేకానంద గార్ల ప్రభావం విశేషంగా ఉంది. సైన్సు, మతం, సమాజం సంబంధించి పలు దృక్కోణాలలో జ్ఞాపకాలు, జీవిత చరిత్రలు, యాత్రా రచనలు, అనువాదాలు చేసిన స్వామి ఆనంద్ రచయితగా సాహిత్యలోకంలో విశేషమైన గౌరవం కలిగి ఉన్నారు. జార్జ్ వాషింగ్టన్ కేవర్, రాబర్ట్ ఓవెన్ జీవిత చరిత్రల ను రాసిన స్వామి ఆనంద్ స్వీయచరిత్రను అసంపూర్తిగా మిగి ల్చారు.

1969లో సాహిత్య అకాడమీ అవార్డు ప్రకటిస్తే తను రచనల కారణంగా ఆర్థిక లాభం పొందకూడదని తిరస్కరించిన అపురూప రచయిత స్వామి ఆనంద్. ఆధ్యాత్మికం, అతివాదం నుంచి గాంధీజీ ప్రభావంతో నిండుగా జీవితాన్ని పండించుకు న్న సంపూర్ణ వ్యక్తి స్వామి ఆనంద్. మహాత్ముని ఆత్మకథ ఉన్నంత కాలమూ స్వామి ఆనంద్ పేరు నినదిస్తూనే ఉంటుంది! ❑

ప్రజాస్వామిక, లౌకికవాది మహాత్మాగాంధీ



- వి.రాంభూపాల్



భారత స్వాతంత్ర్య సంగ్రామంలో మహాత్మాగాంధీ గొప్ప ప్రజానాయకుడు. ఆచరణాత్మక పిలుపుల ద్వారా జాతీయోద్యమంలోకి అసంఖ్యాక ప్రజలను ఆయన కదిలించగలిగారు. ప్రజాస్వామిక వాదిగా, గొప్ప లౌకికవాదిగా ఆయన జీవితాన్ని కొనసాగించి 'మహాత్మా'గా ప్రజలచేత కీర్తినందుకున్నారు. ఆయన తొలిరోజుల్లో 'హిందూ స్వరాజ్' గ్రంథంలో చెప్పిన విషయాలకు, స్వాతంత్రోద్యమ ఉధృతి రోజు ల్లో 'హరిజన్' పత్రికలో రాసిన వ్యాసాలకు చాలా వైరుధ్యాలు కనబడుతాయి. వీటిని వ్యక్తిలో చూడడంకంటే జాతియోద్యమం లో ప్రజల ఆకాంక్షలకు, దానికి నాయకత్వం వహిస్తున్న భూస్వామ్య వ్యవస్థ తో ముడిపడిన బూర్జువా ప్రయోజనాలకు మధ్యన ఏర్పడిన కీలక వైరుధ్యాల నుండే చూడాలి. అయితే నేటి దేశ పాలకులు గాంధీలోని తొలినాటి భావాలను తమ సంకుచిత ప్రయోజనాల కోసం అసందర్భంగా ఊటంకిస్తూ ఆయన కృషిని, ఆలోచనలను గందరగోళానికి గురిచేస్తున్నారు.

గాంధీజీ ప్రతిపాదించిన సామ్రాజ్యవాద వ్యతిరేకత, ప్రజాస్వామ్యం, లౌకిక వాదం, సామాజిక న్యాయంతోపాటు, భారత రాజ్యాంగం, తాజాగా ఎన్నికల వ్యవస్థ కేంద్ర పాలకుల వల్ల తీవ్ర దాడికి గురవుతున్నాయి. ఈ నేపథ్యంలో గాంధీ అనుసరించిన ప్రజాస్వామిక, లౌకికవాద దృక్పథాన్ని ఆయన జయంతి రోజున స్మరించుకోవడం సందర్భోచితం.

గాంధీతో పనిచేసిన దాదాపు ప్రతి ప్రముఖ నాయకుడితో ఏదో ఒక దశలో ఆయనకు తీవ్రమైన విభేదాలు వచ్చాయి. ఆధునికత, జాతీయవాదం వంటి అంశాల్లో రవీంద్రనాథ్ ఠాగూర్‌తో; పారిశ్రామికీకరణ, సామ్యవాదం, ఆధునిక విజ్ఞానంపై జవహర్‌లాల్ నెహ్రూతో; స్వాతంత్ర్య సాధన పద్ధతులు, కాంగ్రెస్ నాయకత్వంపై సుభాష్ చంద్రబోస్‌తో; కులవ్యవస్థ, దళితుల రాజకీయ హక్కులపై డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌తో గాంధీకి తీవ్రమైన విభేదాలు నడిచాయి. అయినప్పటికీ అవి వ్యక్తిగత శత్రుత్వాలు గా మారకుండా, దేశ భవిష్యత్తు కోసం సాగే చర్చలుగా గాంధీ వాటిని కొనసాగించారు. నేటి పాలకులు తమను అంగీకరించిన వారంత దేశద్రోహులుగా చిత్రీకరిస్తున్న పాలకులకు ఇది గిట్టదు. గాంధీలోని లౌకిక భావన కూడా చాలా లోతైనది. "మతం జాతీయతకు పరీక్ష కాదు, ఒక వ్యక్తి ఏ మతాన్ని అనుసరించినా, అతడు ముందు భారతీయుడే, చివరికి కూడా భారతీయుడిగానే మిగులుతాడు" అని బోధించారు. "ప్రపంచంలో ఏ భూభాగంలోనూ ఒకే జాతి, ఒకే దేశం అన్న అర్థం ఎక్కడ ఉనికిలో లేదు" అని హింద్ స్వరాజ్ గ్రంథంలో పేర్కొన్నాడు. గాంధీ ఆశయాలు, ఆలోచనలకు వ్యతిరేకంగా బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు వ్యవహరిస్తూ కార్పొరేట్ సంస్థలకు దేశ సంపదను, వనరులను దోచిపెడుతున్నాయి.

ఠాగూర్‌తో విభేదం

రవీంద్రనాథ్ ఠాగూర్, గాంధీల గురించి జవహర్‌లాల్ నెహ్రూ తన 'డిస్కవరీ ఆఫ్ ఇండియా'లో 'వారు ఇద్దరూ నిస్సందేహంగా 20వ శతాబ్దంలో ఇండియాలో జీవించిన గొప్ప వ్యక్తులు, వారు వ్యక్తం చేసిన భిన్నాభిప్రాయాలు మనకు ఆదేశప్రాయమైనవి" అన్నాడు. వారిద్దరు గొప్ప దేశభక్తులు. అయితే వారి ఆలోచనా ప్రపంచాలు భిన్నమైనవి. ఠాగూర్‌కు మానవతావాదం, విశ్వ మానవ దృక్పథం అత్యంత ముఖ్యమైనవి. గాంధీ ప్రజల రాజకీయ చైతన్యానికి, స్వదేశీకి, సహాయ నిరాకరణకు ప్రాధాన్యం ఇచ్చారు. 1920-21 ప్రాంతంలో గాంధీ ప్రారంభించిన సహాయ నిరాకరణ ఉద్యమం, విదేశీ వస్తువుల బహిష్కరణ వంటి కార్యక్రమాలపై ఠాగూర్ తన వ్యతిరేకతను ప్రకటించాడు.

అనేక సందేహాలు వ్యక్తం చేశాడు. విద్యాసంస్థలను బహిష్కరించడం, జాతీయతను అతిగా ముందుకు తేవడం వంటి చర్యలు యువతను సంకుచిత జాతీయవాదం వైపు నడిపించవచ్చని ఆయన భావించారు. గాంధీ మాత్రం ఠాగూర్ విమర్శలను శత్రుత్వంగా చూడలేదు. ఆయనతో వ్యక్తిగతంగా అంతకంటే ఎక్కువగా ఉత్తరాల రూపంలో సందేహాలను నివృతి చేయడానికి ప్రయత్నించాడు. ఈ క్రమంలో ఠాగూర్ ఆలోచనల్లోని ఆధునిక తను గాంధీ స్వీకరించాడు. తనను అంతగా విమర్శించిన ఠాగూర్‌ను "గురుదేవ్"డిగా గాంధీ గౌరవించారు. ఠాగూర్ కూడా "మహాత్మా"గా గాంధీని సంబోధించారు. ఇద్దరూ ఒకరినొకరు గౌరవిస్తూనే తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసుకున్నారు.

నెహ్రూతో విభేదాలు

జవహర్‌లాల్ నెహ్రూ, గాంధీకి అత్యంత సన్నిహిత సహచరుల్లో ఒకరు. వారిద్దరు జాతీయోద్యమంలో కీలక వ్యక్తులు. కానీ ఇద్దరి మధ్య ఆలోచనల్లో చాలా భేదాలు ఉన్నాయి. నెహ్రూ ఆధునిక విజ్ఞానం, సాంకేతికత, భారీ పరిశ్రమలు, శాస్త్రీయ దృక్పథం, సామ్యవాద ప్రభావిత ఆర్థిక విధానాలవైపు మొగ్గు చూపారు. గాంధీ మాత్రం గ్రామ స్వరాజ్యం, చిన్న తరహా ఉత్పత్తి, ఖాదీ, నైతిక ఆర్థిక వ్యవస్థలకు ప్రాధాన్యం ఇచ్చారు. సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని నెహ్రూ, బ్రిటీష్ ప్రభుత్వానికి గడువు ఇచ్చి ప్రస్తుతం డొమినియన్ స్టేటస్ (అదినివేశ ప్రతిపత్తి)ను సాధించుకుందామని గాంధీ అభిప్రాయపడ్డారు. దీనిపై వారిద్దరి మధ్య 1928లో కలకత్తా కాంగ్రెసులో తీవ్రమైన విభేదాలు వచ్చాయి. స్వాతంత్ర్యానంతరం ఎలాంటి దేశంగా నిర్మించాలి అన్న విషయంలో కూడా వారి దృక్పథాలు భిన్నంగా ఉన్నాయి. ఈ చర్చల క్రమం నుండే పారిశ్రామిక రంగం ప్రభుత్వరంగంలోనే ఉండాలనే నిర్ధారణకు గాంధీ వచ్చారు. నెహ్రూ ఆలోచనలను అణచివేయాలని, ఆయన నుంచి దూరం జరగాలని గాంధీ ప్రయత్నించలేదు. నెహ్రూ కూడా గాంధీతో చర్చిస్తూనే జాతీయోద్యమానికి కేంద్ర బిందువుగా గౌరవించారు. అనాటి కమ్యూనిస్టు నాయకుడు యం.యన్. రాయ్ విశ్వసించిన బొల్షివిజాన్ని వ్యతిరేకించిన గాంధీ తన 'యంగ్ ఇండియా' పత్రికలో మాత్రం ఆయనతో వ్యాసాలు రాయించుకున్నారు. విభేదం అనేది విరోధం కాదు; భిన్నమైన అభిప్రాయాలతో ఒకే లక్ష్యం కోసం కలిసి పని చేయవచ్చు అని ఈ ఘటనలు చాటి చెబుతున్నాయి.

సుభాష్ చంద్రబోస్‌తో ఘర్షణ

బ్రిటిష్ పాలనను ఎదుర్కొనే విషయంలో అంతర్జాతీయ పరిణామాలను ఉపయోగించుకోవాలని సుభాష్ భావించారు. 1938లో హరిపుర కాంగ్రెస్‌లో సుభాష్ అధ్యక్షుడయ్యారు. 1939లో తిరిగి అధ్యక్ష పదవికి పోటీ చేసినప్పుడు గాంధీ మద్దతు ఇచ్చిన అభ్యర్థి పట్టాభి సీతారామయ్య ఓడిపోయారు. సుభాష్ విజయం సాధించినప్పటికీ, కాంగ్రెస్‌లోని విభేదాలు తీవ్రం కావడంతో సుభాష్ అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. సుభాష్ వ్యక్తిగతంగా గాంధీని ఏనాడు అగౌరపరచలేదు. గాంధీ కూడా సుభాష్ దేశభక్తిని, త్యాగాన్ని కొనియాడాడు.

అంబేద్కర్‌తో విభేదం

గాంధీ-అంబేద్కర్ మధ్య కులవ్యవస్థపై తీవ్రమైన విభేదాలు వచ్చాయి. అంబేద్కర్ కులవ్యవస్థ నిర్మూలనను సామాజిక ప్రజాస్వామ్యానికి ప్రాథమిక అవసరం అన్నారు. అణగారిన వర్గాలకు స్వతంత్ర రాజకీయ ప్రతినిత్యం, ప్రత్యేక ఎన్నికల హక్కులు వంటి అంశాలను ఆయన బలంగా సమర్థించారు. 1932లో కమ్యూనల్ అవార్డు ద్వారా "డిప్రెస్డ్ క్లాసెస్"కు ప్రత్యేక ఎన్నికల ప్రతిపాదన వచ్చినప్పుడు గాంధీ దానికి వ్యతిరేకంగా నిరాహార దీక్ష చేపట్టారు. అంబేద్కర్ దీనిని రాజకీయంగా తీవ్రంగా వ్యతిరేకించారు. చివరకు వీరిద్దరి మధ్య పూనా ఒప్పందం కుదిరినా, గాంధీ తీవ్ర విమర్శలకు గురయ్యాడు. ఆ తర్వాత కూడా గాంధీ, అంబేద్కర్ అనేక అంశాల్లో కలిసి పనిచేశారు. ఒకరినొకరు గౌరవించుకున్నారు.

గాంధీ - మతం

గాంధీ 'మతం' అనే పదాన్ని రెండు అర్థాలలో వాడినట్లు ఆయన జీవిత ఆచరణ తెలుపుతుంది. ఒకటి, పైకి కనిపించే హిందూ మతం, ముస్లిం మతం, క్రిష్టియన్ మతం ఇలా అనేక మతాల ఆచారాలు. రెండు, మతం అంటే దైవంలో, సత్యంలో, ధర్మంలో విశ్వాసం కలిగివుండటం. ఈ రెండో అర్థంలో మతమనేది ఏ ఒక్క మతానికి పరిమితమైంది కాదు, సర్వమతాల సారం. అంటే మనిషి జీవిత నైతిక నియమావాళి. ఈ నైతిక విలువలు అన్ని మతాలలోనూ ఒకే విధంగా వున్నాయని ఆయన చెప్పారు. దేశవ్యాప్తంగా పర్యటించే క్రమంలో, భారత ప్రజల మధ్య వున్న మతాతీత సంబంధాన్ని గమనించడం పెరిగే కొద్దీ మతం పట్ల తన అభిప్రాయాలను మరింత లౌకికంగా మలచుకున్నాడు. మొదట్లో ఆయన చెప్పిన 'దైవమే సత్యం' అనే అభిప్రాయాన్ని 'సత్యమే దైవం' అని మార్చుకున్నారు. "నిజమైన మతం మరియు నిజమైన నైతికత ఒకదానితో ఒకటి విడదీయరాని విధంగా ముడిపడివున్నాయి. నేలలో నాటిన విత్తనానికి నీరు ఎంత అవసరమో మతానికి నైతికత అంత అవసరం" అన్నారు. "అసత్యం, క్రూరత్వం, విద్వేషం, ఆపుకోలేని ఉద్రేకం వున్నవాడు నైతికత కోల్పోయిన వాడవుతాడు, వాడికి మతం గురించి ఉచ్చరించే హక్కు లేదు" అని రవీంద్రనాథ్ ఠాగూర్ కు రాసిన లేఖలో పేర్కొన్నాడు. "మత కారణాంగా మనుషులను వేరుచేయడం పూర్తిగా తప్పు.. తేడా అంతా మతాన్ని అవలంబిం

చడంలో, ఆచారాలలో ఉంటుంది. వాటితో లౌకిక రాజ్యానికి సంబంధమే లేదు" అనే ఆయన ఆలోచనే నేడు తీవ్ర ప్రమాదాన్ని ఎదుర్కొంటుంది. "నేనే గనుక నియంతనయితే మతం మరియు రాజ్యం వేరుగా ఉంచుతాను. నేను నా మతంపై ప్రమాణం చేస్తున్నాను. నేను దాని కోసం చనిపోతాను. అయితే అది నా వ్యక్తిగత వ్యవహారం. రాజ్యానికి(ప్రభుత్వానికి) దానికి సంబంధం లేదు" "నాకే కనుక అధికారం ఉంటే, మతతత్వాన్ని ప్రోత్సహించే ఎత్తుగడతో రాసిన రచనలన్నిటినీ నిషేధిస్తా" అని హెచ్చరించారు. 'మతతత్వం దేశ వ్యతిరేకమే కాదు, అది హిందూ మతతత్వమైతే హిందూ మత వ్యతిరేకం, ముస్లిం మతతత్వమైతే ముస్లిం మత వ్యతిరేకం అని' ఆయన నిరంతరం ఘోషించాడు. అందువల్ల గాంధీ ప్రజాస్వామ్య దృక్పథాన్ని ఆయన బలాలతో పాటు పరిమితులతో కూడా అర్థం చేసుకోవాలి.

ప్రజాస్వామ్యం అంటే ఎన్నికలు మాత్రమే కాదు

గాంధీకి ప్రజాస్వామ్యం కేవలం ఓటు హక్కు లేదా ఎన్నికల ప్రక్రియ కాదు. ప్రజలు తమ జీవితాలపై తాము నిర్ణయం తీసుకునే సామర్థ్యం కలిగి ఉండాలి. గ్రామస్థాయిలో అధికార వికేంద్రీకరణ, స్వయం పాలన, సామాజిక బాధ్యత, అహింస, సంభాషణ వంటి విలువలకు ఆయన ప్రాధాన్యం ఇచ్చారు. ఆయన రాజకీయ పద్ధతుల్లో కూడా ప్రత్యర్థిని నాశనం చేయడం కంటే అతని మనస్సును మార్చే ప్రయత్నం కనిపిస్తుంది. సత్యాగ్రహం వెనుక ఉన్న భావన ఇదే–ప్రత్యర్థిని శత్రువుగా కాకుండా, తప్పు చేస్తున్న మనిషిగా చూడటం. ఈ దృక్పథం రాజకీయ ప్రత్యర్థుల విషయంలో మాత్రమే కాదు, తన అనుచరుల విషయంలోనూ వర్తించింది.

గాంధీ నుంచి నేటి ప్రజాస్వామ్యానికి నేర్చుకోవాల్సింది

నేటి ప్రజాస్వామ్య రాజకీయాల్లో భిన్నాభిప్రాయాలు తరచుగా వ్యక్తిగత శత్రుత్వాలుగా మారుతున్నాయి. రాజకీయ ప్రత్యర్థిని ఓడించడం మాత్రమే కాకుండా, అతని ఉనికినే తిరస్కరించే ధోరణి పెరుగుతోంది. ఇలాంటి సమయంలో గాంధీ–ఠాగూర్, గాంధీ–నెహ్రూ, గాంధీ–బోస్, గాంధీ–అంబేద్కర్ సంబంధాలు ఒక ముఖ్యమైన పాఠాన్ని అందిస్తాయి. ఒకే లక్ష్యం కోసం పనిచేసే వ్యక్తుల మధ్య తీవ్రమైన అభిప్రాయభేదాలు ఉండవచ్చు. విభేదించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదం కాదు; విభేదించే హక్కును నిరాకరించడమే ప్రమాదం. గాంధీని అర్థం చేసుకోవడం అంటే ఆయనతో ఏకీభవించడం మాత్రమే కాదు. ఆయనను ప్రశ్నించిన ఠాగూర్‌ను, ఆయనతో భవిష్యత్ భారత దేశంపై వాదించిన నెహ్రూను, ఆయన నాయకత్వాన్ని సవాలు చేసిన బోస్‌ను, కులవ్యవస్థపై ఆయనను కఠినంగా ప్రశ్నించిన అంబేద్కర్‌ను కలిపి చూడాలి. అప్పుడు మాత్రమే గాంధీ ప్రజాస్వామ్య దృక్పథం యొక్క అసలు సంక్లిష్టత మనకు అర్థమవుతుంది.

ముగింపు

గాంధీ గొప్పతనం ఆయన ఎప్పుడూ తప్పులేని నాయకుడు కావడంలో లేదు. ఆయనతో విభేదించగల వ్యక్తులకు భారత జాతీయోద్యమంలో స్థానం ఉండటం, ఆయనను ప్రశ్నించిన వారితోను సంభాషణ కొనసాగడం, రాజకీయ లక్ష్యాల కోసం భిన్న మార్గాలను అనుసరించిన వారితో సంబంధాలను పూర్తిగా తెంచుకోకపోవడం ఆయన రాజకీయ జీవితంలోని ముఖ్యమైన లక్షణాలు. ఠాగూర్‌తో ఆలోచనా సంభాషణ, నెహ్రూతో భవిష్యత్ భారతదేశంపై వాదన, బోస్‌తో నాయకత్వ–వ్యూహ విభేదం, అంబేద్కర్‌తో సామాజిక న్యాయంపై తీవ్రమైన పోరాటం–ఈ నాలుగు అధ్యాయాలు కలిసి గాంధీ ప్రజాస్వామ్య దృక్పథాన్ని మరింత స్పష్టంగా చూపిస్తాయి. విభేదం ఉన్నచోట సంభాషణకు అవకాశం కల్పించడం, ప్రత్యర్థి వ్యక్తిత్వాన్ని గౌరవించడం, తన అభిప్రాయాలను ప్రశ్నించడానికి అవకాశం ఇవ్వడం, ప్రజలను రాజకీయ ప్రక్రియలో భాగస్వాములను చేయడం–ఇవే గాంధీ ప్రజాస్వామ్య ఆలోచనలోని ప్రధాన అంశాలు. గాంధీని విమర్శలకతీతంగా చూడటం ప్రజాస్వామ్య దృక్పథం కాదు. ఆయనను అంబేద్కర్ ప్రశ్నించినట్లే, ఆయన ఆలోచనలను నేటి సమాజం ప్రశ్నించాలి. అదే గాంధీతో నిజమైన ప్రజాస్వామ్య సంభాషణకు అర్థం.

భిన్న దృక్పథాల మధ్య గాంధీ రాజకీయ కృషి

భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రను పరిశీలిస్తే మహాత్మా గాంధీ ప్రత్యేకంగా కనిపించే అంశం ఆయనకు ఉన్న రాజకీయ ప్రభావం మాత్రమే కాదు; తనతో విభేదించే భిన్న రాజకీయ, సామాజిక, ఆర్థిక దృక్పథాలతో ఉన్న నాయకులతోనూ సంభాషిస్తూ, అవసరమైన సందర్భాల్లో కలిసి పనిచేసిన తీరు కూడా. గాంధీ రాజకీయాలను ఒకే సిద్ధాంతాన్ని అందరూ అంగీకరించేలా చేయడం కన్నా, భిన్నాభిప్రాయాల మధ్య ఒక ఉమ్మడి కార్యాచరణను నిర్మించే ప్రయత్నంగా చూడవచ్చు.

విభేదాల మధ్య సహకారం

మనం ప్రారంభంలో పేర్కొన్నట్లుగా, గాంధీజీ ప్రతిపాదించిన నాలుగు విలువలు మన రాజ్యాంగానికి మూలస్తంభాలుగా పొందుపరచబడ్డాయి, కానీ వాటిపై దాడి తీవ్రమవుతూనే ఉంది. ఈ నేపథ్యంలో, హిందుత్వ జాతీయవాదం భారత జాతీయతకు విసురుతున్న ఈ సవాలును ఎదుర్కొని, ఓడించాలంటే గాంధీజీని, ఆయన ప్రతిపాదించిన ఆదర్శాలను స్మరించుకోవడం అత్యంత ఆవశ్యకం. ఈ 150వ జయంతి ఉత్సవాల సందర్భంగా జరిపే కార్యక్రమాలు, ఫాసిస్టు ఆర్ఎస్ఎస్/బీజేపీ అజెండా వల్ల మన లౌకిక ప్రజాస్వామ్య గణతంత్రం నాశనం కాకుండా కాపాడాలనే సంకల్పాన్ని రెట్టింపు చేయడమే లక్ష్యంగా ఉండాలి. ❑

గాంధీజీ ముఖ్య ఉద్యమాలు - కాలక్రమం

-

- **1. చంపారన్ సత్యాగ్రహం (1917):** బీహార్‌లో నీలిమందు సాగు చేయాలని రైతులను బలవంతం చేస్తున్న బ్రిటిష్ తోటల యజమానుల దోపిడీకి వ్యతిరేకంగా గాంధీజీ పోరాడారు.
- **2. అహ్మదాబాద్ కార్మికుల ఉద్యమం (1918):** వస్త్ర మిల్లుల కార్మికులకు న్యాయమైన వేతనాలు కల్పించాలని నిరాహార దీక్ష, సత్యాగ్రహం ద్వారా పోరాడారు.
- **3. ఖేడా సత్యాగ్రహం (1918):** పంటలు పండక రైతులు నష్టపోయిన పరిస్థితుల్లో భూమిశిస్తు వసూలు చేయవద్దని ఉద్యమించారు.
- **4. రౌలట్ సత్యాగ్రహం (1919):** పౌరుల హక్కులను హరించే రౌలట్ చట్టానికి వ్యతిరేకంగా దేశవ్యాప్త నిరసనకు పిలుపునిచ్చారు.
- **5. సహాయ నిరాకరణ ఉద్యమం (1920-22):** ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, న్యాయస్థానాలు, విదేశీ వస్తువుల ను బహిష్కరించి బ్రిటిష్ పాలనకు సహకరించవద్దని పిలుపునిచ్చారు. చౌరీచౌరా హింసాత్మక ఘటన తరువాత ఉద్యమాన్ని నిలిపివేశారు.
- **6. శాసనోల్లంఘన ఉద్యమం (1930):** బ్రిటిష్ ప్రభుత్వం రూపొందించిన అన్యాయ చట్టాలను ఉల్లంఘించి స్వాతంత్ర్యం కోసం ప్రజలను సమీకరించారు.
- **7. దండి యాత్ర (1930):** సబర్మతి ఆశ్రమం నుంచి దండి వరకు పాదయాత్ర చేసి ఉప్పు చట్టాన్ని ఉల్లంఘించారు. ఇది శాసనోల్లంఘన ఉద్యమానికి నాంది పలికింది.
- **8. వ్యక్తిగత సత్యాగ్రహం (1940-41):** భారత ప్రజల అభిప్రాయం తీసుకోకుండా రెండో ప్రపంచ యుద్ధంలో బ్రిటన్ భారతదేశాన్ని భాగస్వామిగా చేయడాన్ని వ్యతిరేకిస్తూ వ్యక్తిగత సత్యాగ్రహానికి పిలుపునిచ్చారు.
- **9. క్విట్ ఇండియా ఉద్యమం (1942):** బ్రిటిష్ పాలన అంతం కావాలని, తక్షణమే భారతదేశాన్ని విడిచి వెళ్లాలని డిమాండ్ చేస్తూ 'చేయండి లేదా చావండి' (ణశీ శీతీ ణఱవ) అనే నినాదాన్ని ఇచ్చారు

భారత జాతీయ ఉద్యమంలో ముఖ్యమైన ఘట్టాలు

- **1857 ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం:** బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా సిపాయిలు, ప్రజల తిరుగుబాటు
- **1885 భారత జాతీయ కాంగ్రెస్ స్థాపన:** జాతీయ రాజకీయ ఉద్యమానికి సంస్థాగత రూపం
- **1905 బెంగాల్ విభజన:** స్వదేశీ, విదేశీ వస్తు బహిష్కరణ ఉద్యమాలు
- 1906 ముస్లిం లీగ్ స్థాపన, ముస్లింల రాజకీయ ప్రాతినిధ్యానికి సంస్థ ఏర్పాటు
- 1907 సూరత్ కాంగ్రెస్ విభజన, మితవాదులు, అతివాదుల మధ్య విభేదాలు
- 1916 లక్నో ఒప్పందం,కాంగ్రెస్, ముస్లిం లీగ్ మధ్య అవగాహన
- 1916 హోంరూల్ ఉద్యమం స్వపరిపాలన కోసం ఉద్యమం
- 1917 చంపారన్ సత్యాగ్రహం, గాంధీజీ భారతదేశంలో ప్రారంభించిన తొలి ప్రధాన సత్యాగ్రహం
- 1919 రౌలట్ చట్టం, పౌర హక్కులపై ఆంక్షలకు వ్యతిరేకంగా ఉద్యమం
- 1919 జలియన్ వాలాబాగ్ మారణకాండ, బ్రిటిష్ సైన్యం నిరాయుధ ప్రజలపై కాల్పులు
- 1920-22 సహాయ నిరాకరణ ఉద్యమం, బ్రిటిష్ పాలనకు సహకరించకూడదనే పిలుపు
- 1922 చౌరీచౌరా ఘటన హింసాత్మక ఘటనతో సహాయ నిరాకరణ ఉద్యమం నిలిపివేత
- 1927 సైమన్ కమిషన్ నియామకం, భారతీయుల ప్రాతినిధ్యం లేకపోవడంతో వ్యతిరేకత
- 1928 సైమన్ గో బ్యాక్ ఉద్యమం, దేశవ్యాప్త నిరసనలు
- 1928 బార్డోలీ సత్యాగ్రహం, రైతుల పన్నుల వ్యతిరేక పోరాటం
- 1929 లాహోర్ కాంగ్రెస్ సమావేశం, సంపూర్ణ స్వరాజ్యం లక్ష్యంగా ప్రకటన
- 1930 దండి యాత్ర, ఉప్పు చట్టానికి వ్యతిరేకంగా శాసనోల్లంఘన
- 1931 గాంధీ-ఇర్విన్ ఒప్పందం, బ్రిటిష్ ప్రభుత్వంతో రాజకీయ చర్చలు
- 1932 పూనా ఒప్పందం, అణగారిన వర్గాల రాజకీయ ప్రాతినిధ్యంపై ఒప్పందం **(మిగతా 23వ పేజీలో)**

పెరుగుతున్న అసమానతలు పెట్టుబడి దోపిడీకి సంకేతం

- ఎ.నర్సింహారెడ్డి



ఆదాయం, సంపద పంపిణీలో అసమానతలు అనూహ్యంగా తీవ్రమవుతున్నాయి. ఆధిపత్య ధోరణులు బలపడుతున్నాయి. లింగ వివక్ష, జాత్యహంకారం, కుల వివక్ష, మైనారిటీల మీద దాడులు వికృతంగా పెరుగుతున్నాయి. అమానవీయత, పెత్తనం, క్రూరత్వం, హింస, నేటి వ్యవస్థ సహజ లక్షణాలైనాయి. ఇవన్నీ అత్యధిక ప్రజల జీవితాలను విధ్వంసం చేస్తున్నాయి. కొవిడ్ విలయంతో ఈ సంక్షోభం మరింత జటిలం అయ్యింది. గత మూడు దశాబ్దాలుగా చేపట్టిన సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఆర్థిక విధానాల వినాశకర క్రమం గురించి చర్చించటాన్ని అభావం చేయడంతోపాటు సంపద సృజన, కేంద్రీకరణ, కుబేరుల సంఖ్య, సంపదలో పెరుగుదలే ముఖ్యం అన్న భావజాలాన్ని బలంగా ప్రచారం చేస్తున్నారు. ప్రస్తుతం ఉనికిలో ఉన్న ఆర్థిక నిర్మాణాలే, వాటిని పెంచి పోషించిన ధోరణులే ఈ స్థాయిలో అసమానతలు తీవ్రం కావడానికి కారణం అన్నది అందరికీ తెలిసిందే.



మన దేశ స్వాతంత్రోద్యమం బ్రిటన్‌లో వలే భూస్వామ్య శక్తులకు వ్యతిరేకంగా ప్రభవించిన ఉద్యమం వంటిది కాదు. వలస పాలనపై పోరుతో 1947 ఆగష్టు 15న దళారీ బడా బూర్జువా, బడా భూస్వామ్య వర్ణాలకు అధికార బదిలీ జరిగింది. భారత్‌లో ప్రజాతంత్ర విప్లవం జరుగలేదు కనుకనే భూ సంస్కరణలు అమలు కాలేదు. విదేశీ ఆస్తులు జాతీయం కాలేదు సరికదా, బ్రిటిష్ సామ్రాజ్యవాద పెట్టుబడులకు తోడు వివిధ సామ్రాజ్యవాద దేశాల పెట్టుబడులు దేశంలోకి చొరబడ్డాయి. సామ్రాజ్యవాద పెట్టుబడి దేశీయ స్వతంత్ర పెట్టుబడిని ఎదుగనివ్వదు. దేశీయ పెట్టుబడిని తనకు తొత్తుగా మార్చుకుంటుంది. అందువల్లనే ఏడున్నర దశాబ్దాలు గడిచినా భూస్వామ్య మత విలువలు, విదేశీ పెట్టుబడి దోపిడీ అంతం కాలేదు. అది మరింత పెరిగింది. ఫలితంగా ప్రజాస్వామ్యం పేరుతో ధనస్వామ్యం అధికారం చెలాయిస్తోంది. 1947 ఆగస్టు 15న నెహ్రూ ప్రసంగంలో పేదరికాన్ని, అజ్ఞానాన్ని, అవకాశాలలో అసమానతలను రూపుమాపడమే దేశం ముందున్న కర్తవ్యమని ఉద్ఘాటించారు. మన ప్రభుత్వాలు అమలు చేసిన ప్రణాళికబద్ధ అభివృద్ధి బడా బూర్జువా, బడా భూస్వామ్య వర్గాల పురోగతికి తోడ్పడింది తప్ప ప్రజల మౌలిక సమస్యల పరిష్కారానికి ఉపయోగపడలేదన్నది ఏడు దశాబ్దాల అనుభవం రుజువు చేస్తోంది.

1990వ దశకం నుంచి సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఆర్థిక విధానాల అమలు పేరుతో సాగుతున్న విధ్వంసం దేశ ఆర్థిక వ్యవస్థను అల్లకల్లోలం చేస్తున్నది. పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద ధోరణులు జొరబడి మౌలిక రంగాలపై గుత్తాధిపత్యాన్ని చెలాయిస్తున్నాయి. ఇప్పుడు సామ్రాజ్యవాద దేశాలన్ని భారత్‌వైపే చూస్తున్నాయి. ఇక్కడి మార్కెట్‌ను, సహజ వనరులను కొల్లగొట్టడానికి భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. అంతకు కొన్ని వందల రెట్లు లాభాలను ఆర్జిస్తున్నాయి. దేశ సంపదను పరోక్షంగా దోచుకుంటున్నాయి. ఇవాళ ప్రపంచ బహుళజాతి సంస్థలు, ద్రవ్యసంస్థలు భారత ప్రభుత్వంతో పలు ఒప్పందాలు

చేసుకుంటున్నాయి. ప్రపంచీకరణ వల్ల కార్పొరేట్ దిగ్గజాలకు తప్ప సామాన్యుడికి ఒరుగుతున్న లాభం ఏమీ లేదు. శ్రమ దోపిడీ, పర్యావరణ విధ్వంసం మరింతగా పెరిగిపోతున్నది. దేశం అనుసరిస్తున్న విధానాలు ఈ శక్తులను పెంచి పోషించేవిగా ఉండడం దురదృష్టకరం.

ఏడు దశాబ్దాల పైగా దేశీయ పాలనలో దేశం ఎంతో పురోగమించిందని దోపిడీ పాలకులు తొణక్కుండా ప్రకటిస్తున్నారు. కానీ నానాటికీ దిగజారుతున్న జీవన ప్రమాణాలతో శ్రామిక ప్రజానీకం దిక్కుతోచకున్నారు. నిజానికి కరోనా సృష్టించిన సంక్షోభం కంటే మన పాలకులు, ముఖ్యంగా ఎనిమిదేళ్లుగా మోడీ ప్రభుత్వం అమలు చేస్తోన్న రాజకీయార్థిక విధానాలతో ప్రజాజీవనం కకావికలౌతున్నది. కరోనా ఆంక్షల నడుమ ప్రజా ప్రతిఘటన ఇబ్బందిని ఎదుర్కొనకుండానే ప్రజా వ్యతిరేక విధానాలను నల్లేరు మీద నడకలా అమలు చేస్తూ పోతున్న నేపథ్యమిది. మోడీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలైన జిఎస్‌టి, పెద్దనోట్ల రద్దు, కార్మిక చట్టాల సవరణ వంటి విధానాలన్నీ సామ్రాజ్యవాద, బడా కార్పొరేట్లకే తోడ్పడ్డాయి.

చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, చిన్న వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారు. చిల్లర వర్తకంలోకి 100 శాతం విదేశీ పెట్టుబడికి అనుమతించడం, దేశానికి స్వావలంబనకు వెన్నెముకలాంటి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం వంటి విధానాలతో పాటు ప్రజా ఉద్యమాలపై, మేధావులపై, జర్నలిస్టులపై, కళా కారులపై, ప్రజాసంఘాలపై దేశద్రోహ చట్టాన్ని, ఉపా చట్టాన్ని విచ్చలవిడిగా ప్రయోగిస్తున్నారు. దేశంలో భావ వ్యక్తీకరతణ స్వేచ్ఛ తీవ్ర సంక్షోభంలో ఉంది. మీడియా, ముఖ్యంగా స్వతంత్ర జర్నలిస్టులపై అప్రకటిత ఎమర్జెన్సీని దేశంలోని నేటి పరిస్థితులు రుజువు చేస్తున్నాయి. భిన్నాభిప్రాయాలను నేరంగా పరిగణించి, విద్యార్థులు, సామాజిక కార్యకర్తలు, జర్నలిస్టులపై క్రిమినల్, టెర్రరిస్టు వ్యతిరేక చట్టాల కింద నేరాలు ఆరోపించి కేసులు నమోదు చేస్తున్నది.

పెట్టుబడిదారీ ఆర్థిక సంక్షోభం 2008 నుంచి ప్రపంచాన్ని చుట్టుముట్టింది. అన్ని ఖండాల్లోని పెట్టుబడిదారీ దేశాలన్నిటా ఆకలి కేకలు వినిపిస్తున్నాయి. నిరుద్యోగం ప్రబలింది. ఆర్థిక అసమానతలు పెరిగాయి. భారతదేశ పరిస్థితి దీనికి భిన్నంగా ఏమీ లేదు. ఆర్థిక సంక్షోభానికి తోడు కరోనా మహమ్మారి కాలంలో పెట్టుబడిదారీ సానుకూల ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రపంచీకరణ విధానాలు శ్రామిక ప్రజల జీవనాన్ని మరింత దుర్భరం చేస్తున్నాయి. 1980వ దశకంలో అట్టహాసంగా ప్రకటించిన ప్రపంచీకరణ ఆర్థిక విధానాలు పెట్టుబడిదారీ వ్యవస్థలోని అన్ని సమస్యలకూ సర్వరోగనివారిణిగా ప్రచారం చేసుకున్నారు. కానీ మూడు దశాబ్దాలు గడిచేసరికి ఆ విధానాల డొల్లతనం ప్రస్తుత ఆర్థిక సంక్షోభ రూపంలో వ్యక్తమవుతోంది. భారత దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల ప్రపంచీకరణ విధానాల వల్ల దేశం కరోనాకు ముందే మాంద్యంలోకి జారుకున్నది.

కరోనా వైరస్‌ను అరికట్టడంలో మోడీ ప్రభుత్వ అసమర్థత వల్ల పరిస్థితి మరింత దిగజారింది. ఒక వైపున ఆర్థిక సంక్షోభం, ఉపాధి కోల్పోవడంతోపాటు, అన్ని నిత్యావసర సరుకుల, ప్రత్యేకించి పెట్రోలియం ఉత్పత్తుల ధరలు దారుణంగా పెరగడం ప్రజలనుభవిస్తున్న దుర్భర పరిస్థితిని మరింత తీవ్రతరం చేస్తున్నది. మోడీ ప్రభుత్వ హయాంలో తారాస్థాయికి చేరిన ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం ప్రజల వద్ద ఏమీ మిగల్చలేదు. భూములు, గనులు, అడవులు, అంతరిక్షంలోని టెలికాం స్పెక్ట్రమ్‌లు అన్నింటినీ కార్పొరేట్లకు అర్పించేస్తున్నారు. అందుకు చట్టాలు ఆటంకంగా ఉంటే ఆ చట్టాలనే మార్చేస్తున్నారు. రాజ్యాంగాన్ని బేఖాతరు చేస్తున్నారు. ఈ విధానాలు సామాజిక న్యాయాన్ని దారుణంగా దెబ్బతీస్తున్నాయి. ప్రజాధనంతో నిర్మించిన లక్షల కోట్ల విలువ చేసే ప్రభుత్వ రంగ సంస్థలను గుండుగుత్తగా అమ్మేస్తున్నారు.

ఇవాళ దేశంలో పాలకవర్గ పార్టీలన్నీ తమ కండబలం, ధనబలంతోపాటు వివిధ ప్రజాకర్షక పథకాలపై ఆధారపడుతూ ప్రజలను పరాధీనులుగా చేస్తున్నారు. దేశంలో ప్రపంచీకరణ విధానాల దుష్ఫలితాలు నేడు స్పష్టంగా కనిపిస్తున్నాయి. శత కోటీశ్వరులు సహస్ర కోటీశ్వరులుగా పైపైకి పోవడం, సామాన్యులు మరింత అధోగతికి దిగజారడం చూస్తునే ఉన్నాం. ప్రభుత్వరంగ సంస్థలను తెగనమ్మడం, దేశ విదేశీ ప్రైవేటు సంస్థలకు ఎర్ర తివాచీ పరవడం యథేచ్ఛగా కొనసాగుతున్నది. మరోవైపున రైతుల, కార్మికుల ఇతర శ్రమ జీవుల హక్కులు హరించబడుతున్నాయి. మొత్తంగా ప్రజాతంత్ర, పౌరహక్కులే ప్రమాదంలో పడిపోయాయి. ప్రభుత్వం నుండి ఏక కాలంలో తీవ్రతరమైన ఈ దాడులు దేశంలోని కార్మిక, రైతాంగ ఇతర శ్రామిక వర్గాలన్నీ ఏకమై ఎదిరించాల్సిన అనివార్య పరిస్థితులను కూడా కల్పిస్తున్నాయి. రైతులు, వివిధ సెక్షన్ల కార్మికులు, ఉద్యోగులు దేశవ్యాపిత పోరాటాల్లోకి వస్తున్నారు.

మానవ జాతి చరిత్రలో ఎన్నడూ లేనంత ఎక్కువ స్థాయిలో ప్రస్తుత ఆర్థిక అసమానతలు ఉన్నాయని మంత్లీ రివ్యూ తాజా పత్రిక పేర్కొంది. విపరీతంగా పెరిగిపోతున్న ఆర్థిక అసమానతల గురించి ఈ మధ్య కథనాలు చాలా వచ్చాయి. "చంపుతున్న అసమానతలు" అన్న పేరుతో ఇటీవలే ఆక్స్ ఫామ్ ఒక నివేదికను విడుదల చేసింది. ఆ నివేదిక ప్రకారం 2021లో 84 శాతం కుటుంబాల ఆదాయం పడిపోయింది. అయితే అదే సంవత్సరంలో బిలియనీర్ల సంఖ్య 102 నుంచి 142కి పెరిగింది. దేశంలో 100 మంది కుబేరుల సంపద అదే సంవత్సరంలో 57.3 లక్షల కోట్లకు పెరిగింది. దిగువ 50

శాతం కుటుంబాల సంపద జాతీయ ఆదాయంలో ఆరు శాతం మాత్రమే కలిగి ఉన్నారు. 1 శాతం కుటుంబాల వద్ద జిడిపిలో 33 శాతం సంపద పోగుపడింది. 10 శాతం కుటుంబాల వద్ద జిడిపిలో 73 శాతం సంపద ఉంది. ధనవంతులైన 100 కుటుంబాల సంపదలో ఐదవ వంతు పెరుగుదలకు ఒకే వ్యక్తి మరియు వ్యాపార సంస్థ అయిన అదానీల సంపద పెరుగుదల కారణమని ఆక్స్ ఫామ్ ఎత్తి చూపింది.

భారత్ అభివృద్ధి చెందుతున్న దేశం. ఆర్థిక వ్యవస్థ పెరుగుతోంది. అదే సమయంలో నిరుద్యోగం, పేదరికం పెరుగుతోంది. మన ఆర్థిక వ్యవస్థ ఉపాధి రహిత వృద్ధికి తోడ్బడుతుంది. మోడీ ప్రభుత్వం కార్మికులు, రైతాంగం, గిరిజనులు, యువకులు, మహిళలు, దళితులు, మైనారిటీలు ఎదుర్కొంటున్న ఏ ఒక్క సమస్యను పరిష్కరించడం లేదు. మరోవైపు దేశ ప్రజల ప్రయోజనాలను సామ్రాజ్యవాదులకు అమ్మివేస్తున్న, ప్రజాస్వామిక హక్కులను, విలువలను, సాంప్రదాయాలను ధ్వంసంచేస్తున్న, దేశాన్ని మతపరంగా, సాంస్కృతికంగా చీల్చడానికి ప్రయత్నిస్తున్న నేటి పాలకులకు వ్యతిరేకంగా శక్తివంతమైన, నిశ్చయాత్మకమైన ఐక్యపోరాటం సాగించాలన్నది దేశంలో బలంగా వ్యక్తమవుతున్న ఆకాంక్ష.

రాష్ట్రంలో, కేంద్రంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారం కావడం అసాధ్యమని గత ఏడున్నర దశాబ్దాల పైగా సాగిన పాలన అనుభవం రుజువు చేస్తోంది. అందువల్ల భారత పాలక వర్గాల ప్రజావ్యతిరేక భూస్వామ్య, స్వదేశీ, విదేశీ పెట్టుబడి అనుకూల విధానాలకు, హిందూత్వ ఫాసిస్టు పాలనకు వ్యతిరేకంగా ప్రజలు సంఘటిత కావాలి. దోపిడీ, పీడన, సామ్రాజ్యవాద ఆధిపత్యాలకు వ్యతిరేకంగా పోరాడటం తప్ప మరో మార్గం లేదు. బడా బూర్జువా, భూస్వామ్య పార్లమెంటరీ రాజకీయాలను నమ్మడం ఇకపై సాధ్యం కాదు. భారతదేశ ప్రజలందరికి స్వాతంత్ర్యం నూతన పొందికతో ఆవిర్భవించాలి. ప్రజాతంత్ర ప్రత్యామ్నాయంగా కార్యక్రమం రూపొందించుకోవాలి. అది ప్రజల రాజకీయ, ఆర్థిక, సామాజిక విముక్తి లక్ష్యాలను కలిగి ఉండాలి. ఆ కార్యక్రమం, కార్మిక, కర్షక, యువత సంఘటిత ప్రతిఘటన ప్రజా ఉద్యమాల ద్వారానే ప్రత్యామ్నాయం ఆవిర్భవిస్తుంది. ప్రజాస్వామ్య, లౌకిక, అభ్యుదయ శ్రేణులు ప్రజా ఉద్యమానికి దన్నుగా నిలువాలి. ❑ **(ప్రజాశక్తి సౌజన్యంతో)**

భారత జాతీయ ఉద్యమంలో ముఖ్యమైన ఘట్టాలు

(20వ పేజీ తరువాయి)

- 1935 భారత ప్రభుత్వ చట్టం, పరిమిత ప్రాదేశిక స్వపరిపాలనకు అవకాశం
- 1937 ప్రాదేశిక ఎన్నికలు, కాంగ్రెస్ మంత్రివర్గాల ఏర్పాటు
- 1940 వ్యక్తిగత సత్యాగ్రహం, యుద్ధంలో భారత ప్రజల సమ్మతి లేకుండా పాల్గొనడాన్ని వ్యతిరేకించడం
- 1942 క్రిప్స్ రాయబారం భారత రాజ్యాంగ భవిష్యత్తుపై బ్రిటిష్ ప్రతిపాదనలు
- 1942 క్విట్ ఇండియా ఉద్యమం బ్రిటిష్ వారు భారతదేశాన్ని విడిచి వెళ్లాలని డిమాండ్
- 1943 ఆజాద్ హింద్ ప్రభుత్వం, సుభాష్ చంద్రబోస్ నేతృత్వంలో స్వతంత్ర భారత ప్రభుత్వ ప్రకటన
- 1946 నౌకాదళ తిరుగుబాటు, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా నౌకాదళ సిబ్బంది తిరుగుబాటు
- 1946 క్యాబినెట్ మిషన్ అధికార బదిలీ, రాజ్యాంగ నిర్మాణంపై చర్చలు
- 1947 భారత స్వాతంత్ర్యం, ఆగస్టు 15న బ్రిటిష్ పాలన అంతం; దేశ విభజనతో భారత్, పాకిస్థాన్ ఏర్పాట్లు. ❑



WE THE PEOPLE OF INDIA

ఏలూరులో వర్క్‌షాప్



ఏలూరు, అక్టోబర్ 11 : జాతీయోద్యమ ఆదర్శాల ఆధారంగా రూపొందిన లౌకిక, ప్రజాస్వామ్య, సామ్యవాద రాజ్యాంగం మాత్రమే భారతీయ సమాజపు బహుళత్వాన్ని, వైవిధ్యాన్ని, సమగ్రతను సంరక్షించగలదని ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ జాతీయ సెక్రెటరీ జనరల్ డి. సోమసుందర్ స్పష్టం చేశారు. రాజ్యాంగ రచనా నేపథ్యం నుండి రాజ్యాంగ విలువలు రూపొందాయని అన్నారు. "వుయ్ ది పీపుల్ ఆఫ్ ఇండియా" సంస్థ ఏలూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో "భారత రాజ్యాంగ లక్ష్యాలు-ప్రజాస్వామ్య విలువలు-ప్రస్తుత పరిస్థితి" అంశంపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో సోమసుందర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

ఏలూరు సాహిత్య మండలి హాలులో ఆదివారం జరిగిన ఈ వర్క్ షాప్‌కు విశ్రాంత జిల్లా జడ్జి అడబాల లక్ష్మీ అధ్యక్షత వహించారు. సంస్థ కన్వీనర్ పి.పి. శాస్త్రి స్వాగతం పలికారు. సోమసుందర్ మాట్లాడుతూ 1858 నాటి గవర్నమెంట్ ఆఫ్ ఇండియా చట్టం నుంచి 1947 నాటి భారత స్వాతంత్ర్య చట్టం వరకూ దాదాపు తొమ్మిది దశాబ్దాలపాటు భారత రాజ్యాంగం రూపొందే క్రమం కొనసాగిందని తెలిపారు. 563 స్వదేశీ సంస్థానాలతో చెల్లాచెదురుగా ఉన్న నాటి అసమగ్ర భారత దేశంలో ఒక ఆధునిక లౌకిక, ప్రజాస్వామ్య, ఆదర్శ నాగరిక సమాజం ఏర్పాటు లక్ష్యంగా జాతీయోద్యమం పోరాడిందన్నారు. రాజ్యాంగాన్ని కాలానుగుణంగా పరివర్తన చెందే ఒక పరిణామ శీల పత్రంగా వారు రూపొందించారని వివరించారు. తొలి నుంచి భారత రాజ్యాంగాన్ని వ్యతిరేకించిన వారే ప్రస్తుతం అధికారంలో ఉన్నారని, వారు రాజ్యాంగాన్ని మార్చి దేశంలో నిరంకుశ, అనాగరిక రాజ్యాన్ని స్థాపించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. మనుస్మృతిని మన రాజ్యాంగంగా వారు ప్రకటించారని సోమసుందర్ గుర్తుచేశారు.

"వుయ్ ది పీపుల్ ఆఫ్ ఇండియా" సంస్థ రాష్ట్ర కన్వీనర్ డి.వి.వి.ఎస్. వర్మ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రశ్నించగలిగే బలమైన పౌరసమాజ ఉద్యమాన్ని నిర్మించేందుకు "వుయ్ ది పీపుల్ ఆఫ్ ఇండియా" సంస్థ ఏర్పడిందన్నారు. పౌరులందరికీ, ముఖ్యంగా జెన్ జీ యువతరానికి రాజ్యాంగ మౌలిక లక్షణాలను, విలువలను, ఆదర్శాలను పరిచయం చేయడానికి రాష్ట్రవ్యాప్తంగా కృషి **(మిగతా 28వ పేజీలో)**



మానవ సమాజం + పురాతన సమాజం




- రాహుల్ సాంకృత్యాయన్

మానవ సమాజం

- రాహుల్ సాంకృత్యాయన్

'మానవ సమాజం'-వైజ్ఞానిక భౌతికవాద గ్రంథాల వరుసలో రెండవ పుస్తకం.(మోర్గన్ రాసిన 'పురాతన సమాజం' మొదటిది). మానవ సమాజాన్ని గురించి నాకు లభ్యమైన శాస్త్రీయ పరిశోధనలను దీనిలో పొందుపరుస్తున్నాను. ఇంకా పూర్తి వివరాలకు ఎన్నో పుస్తకాలను పరిశీలించవలసి ఉంది. 'డేవిలీ' క్యాంపు జైలులో నేను ఉన్నప్పుడు ఈ పుస్తకాన్ని రాశాను. ఆ పరిస్థితుల్లో దొరికిన పుస్తకాలతోనే నేను సరిపెట్టుకోవలసి వచ్చింది. అంతిమ సత్యమనేది లేదు. భావితరం ఒక మెట్టు పైకి చేరేందుకు ఈ పుస్తకం ఉపయోగపడితే నాకు అది చాలు. అందుకు ఈ పుస్తకం ఖాయంగా ఉపయోగపడుతుంది. ఒకే అభిప్రాయం గల పలువురు రచయితలు కలిసి ఇటువంటి గ్రంథాలను రాస్తే వాటి ఉపయోగం చాలా ఎక్కువగా ఉంటుందని నాకు తెలుసు. కానీ హిందీ రచయితల్లో అటువంటి అభిప్రాయం గలవారు చాలా తక్కువ. ప్రతి రచయిత తన పొయ్యిని, తన వంటకే వాడతాడు.

ఈ పుస్తకంలోని అంశాలలో కొన్నింటిని బి.ఎ.ఎల్. వేది శ్రద్ధగా విన్నారు. అందులో కొన్ని ఆయనకు బాధను కలిగించాయి. అందుకని నా రచనను పూర్తిగా ఆయన వినలేదు. ఆయన పూర్తిగా విని ఉంటే బాగుండేది. తర్వాత నా రచనలకు నేను వారి సూచనలను దృష్టిలో పెట్టుకొన్నాను. 'మానవ సమాజం' రాత ప్రతిని కామ్రేడ్ డాంగే ఓపికతో చదివి, వారి అమూల్యమైన సలహాలను నాకు ఇచ్చారు. అవి నాకు చాలా ఉపయోగపడ్డాయి. ఒకరు రచన చేసేటప్పుడు ఎలాంటి భాషను వాడాలి అనే విషయాన్ని గురించి డా. భగవాన్ దాస్ (కాశీ) ఇలా అన్నారు: "రచనలో వాడే భాష ఇల్లాలికి అర్థం



మానవ సమాజం + పురాతన సమాజం

రాహుల్ సాంకృత్యాయన్

ధర - 350 + 300 =650/-

పుస్తకాల కోసం: 094900 98654ను సంప్రదించండి

కావాలి. అంటే 'సులభ శైలి'లో ఉండాలి". ఈ మాట నా మదిలో ఎప్పుడూ మెదులుతూనే ఉంది. ఆంగ్ల భాష ఏమాత్రం తెలియని హిందీ శ్రోత ఈ పుస్తకంలోని అధ్యాయాలను విన్నప్పుడు, అతనికి కఠినంగా ఉన్న పదాన్ని తొలగించి, దాని స్థానే తేలిక పదాన్ని వాడాలనేది నా అభిప్రాయం. కానీ నాకు జైలులో అటువంటి వ్యక్తి లభించలేదు. తర్వాత నేను హజారీ బాగ్ జైలుకు మారిన తర్వాత కామ్రేడ్ నాగేశ్వరసేన్ దీనిని క్షుణ్ణంగా చదివాడు. కానీ ఏ సలహానూ నాకు ఇవ్వలేదు. వారు ఇచ్చి ఉంటే దానిని సంతోషంగా అంగీకరించి ఉండేవాణ్ణి.

ఒకటి మాత్రం నిజం. నేను సులభశైలికే అంకితమయ్యాను. 'విశ్వ కి రూప్ రేఖా', 'మానవ సమాజ్', 'దర్శన్ దిగ్దర్శన్', 'వైజ్ఞానిక భౌతికవాద్' అనేవి నేను రాసిన నాలుగు పుస్తకాలు. ఇవి మానవ జాతి నేటి వరకు ఆర్జించుకున్న జ్ఞానాన్ని క్లుప్తంగా అందించగలుగుతున్నాయి. అవి ఇచ్చే జ్ఞానం, జ్ఞానం కొరకు మాత్రమే కాదు, ఆ జ్ఞానంతో ప్రపంచాన్ని మార్చటానికి ప్రయత్నం జరగాలి.

రాహుల్ సాంకృత్యాయన్

హజారీబాగ్ 3.4.1942

పురాతన సమాజం

(లూయీ హెన్రీ మోర్గన్ రాసిన పుస్తకంపై చిరు పరిచయం)

- వి.విజయకుమార్



జీవకోటినంతా బొమ్మల్లా తయారు చేసి, దేవుడనే వాడు ప్రాణం ఊదాడనుకుని సంతృప్తి చెందే వారికి భిన్నంగా, కొందరు ఆలోచించడం మొదలు పెట్టినప్పుడు, చాలా పెద్ద ప్రశ్నే తలెత్తింది. ఎన్ని రకాలుగా ఆలోచించినా, మతం ఒకానొక చారిత్రక అజ్ఞానపు దశలో, అపౌరుషేయాలు అంటూ ప్రచారంలోకి తెచ్చి, అవన్నీ నిజాలే అని బింకంగా నమ్మించి, బుకాయింపు ప్రయత్నం యుగాలుగా చేస్తున్నప్పటికీ, ఆలోచించే ప్రతి ఒక్క వ్యక్తికీ, సత్యం వేరుగా ఉందన్న విషయం బాగానే అర్థమవుతూ వస్తూనే ఉంది. మనిషనేవాడికి సహజాతంగానే ఒక గుణం అలవడింది. అదేమిటంటే సత్యాన్వేషణ. మతాలు మానవ సమాజపు శాసనకర్తలుగా తీవ్రమైన ప్రభావం చూపుతున్నా, సత్యం కోసం మరోవైపు నిరంతరాయంగా ప్రయత్నాలు జరుగుతూనే వచ్చాయి.

డార్విన్ జీవపరిణామ సిద్ధాంతం, మతం అమాయకంగా అల్లుకున్న కల్పితగాథల మానవ జన్మ రహస్యాల్ని, సాధికారికంగా త్రోసిరాజంది. అదే సమయంలో లూయీ హెన్రీ మోర్గన్ రాసిన 'పురాతన సమాజం' సమాజ సామాజిక నిర్మితి ఎలా జరిగిందో వివరించే ప్రయత్నం చేసింది. ఈ అమెరికన్ ఆంత్రోపాలజిస్టు జీవిత సగ భాగం వెచ్చించి రాసిన ఈ గ్రంథం 1877లో అందుబాటులోకి వచ్చింది.

1891లో దీనికి ముందుమాట రాస్తూ ఎంగెల్స్, డార్విన్ 'జీవ పరిణామ సిద్ధాంతమూ', మార్క్స్ 'అదనపు విలువ సిద్ధాంతమూ' ఎంత విలువైనవో, పితృస్వామ్య వ్యవస్థకు ముందు, మాతృస్వామ్య గణాల ఉనికి విషయమై మోర్గన్ పరిశోధనలు అంత విలువైనవిగా పేర్కొన్నాడు. అంతేకాకుండా, మోర్గన్ పుస్తకంపై మార్క్స్ రాసుకున్న రాత ప్రతుల్ని, మార్క్స్ మరణం తర్వాత, 1884లో "కుటుంబమూ, వ్యక్తిగత ఆస్తీ, రాజ్యమూ పుట్టుక" అనే గ్రంథంగా వెలుగులోకి తెచ్చే సందర్భంలో, మోర్గన్ పేర్కొన్న అనేక అంశాలపై ఎంగెల్స్ చాలా విస్తృతంగా చర్చించాడు. లిఖిత చరిత్ర ముందరి దశలకు మోర్గన్ వేసిన బాటల వల్ల ఉత్తర అమెరికా తెగల్లో ఆయన కనుగొన్న కీలకమైన విషయాలు ఇప్పటివరకు ప్రాచీన గ్రీకు, రోమన్, జర్మన్ చరిత్రలకు సంబంధించిన అనేక పరిష్కారాలు దొరకని చిక్కుముళ్లకు సమాధానాలు చెప్పడంలో బాగా సహకరించాయని అంటాడు ఎంగెల్స్.

మానవ సమాజం ప్రస్తుతమున్న స్థాయికి చేరుకొనే క్రమంలో, ఎన్ని ఆటుపోట్లను అధిగమించుకుంటూ వచ్చిందో చూడటానికి ముందు, లిఖిత చారిత్రక ఆధారాలు లేని, అతి ప్రాచీన ఆదిమ మానవుడి తొలి అడుగులు ఎలా పడ్డాయో తెలుసుకోవడమే మోర్గన్ చేసిన కృషి అంతా. ఆటవిక యుగం ముందు దశ నుండి మొదలుకొని అనాగరిక యుగం ఎగువ దశ వరకూ మానవ వికాసం ఎలా జరిగిందన్నది శోధించడమే మోర్గన్ లక్ష్యంగా పెట్టుకున్నారు. లక్షల సంవత్సరాల పరిణామం తర్వాత, మానవజాతి ఇతర ప్రాణికోటి నుంచి ఒక స్పష్టమైన అస్తిత్వాన్ని ప్రకటించుకున్నాక, నడిచిన అడుగుల జాడల అన్వేషణే మోర్గన్ చేసిన విశేష కృషి.

దీనికి ఆయనొక అద్భుతమైన మార్గాన్ని ఎంచుకున్నారు. మనిషి అతి ప్రాథమిక ఆహార అన్వేషణ ఎలా మొదలైంది, అది జీవనోపాధి దిశగా ఎలా విస్తరిస్తూ పోయిందని ప్రారంభించి, బీజప్రాయ దశలో ఆటవిక సమాజంలోనే ఒక గుంపును నియంత్రించేందుకు ఏర్పరచుకున్న పాలన తాలూకూ భావనల్ని తరచి చూడటమూ, ఆ తర్వాత భాషా మూలాల్ని పట్టుకోవడమూ, మోటు ధ్వనుల నుంచి ఏకాక్షర ధ్వనులూ, ఆ పైన పదాల రూపకల్పనా, వాగ్రూప భాషాభివృద్ధి ఎలా జరిగిందో చూడటమూ, రక్త సంబంధాల ఆధారంగా, వివాహ నియమాల ఆధారంగా, కుటుంబం ఎలా అస్తిత్వంలోకి వచ్చిందో అన్నదీ, ఆ తర్వాత మత భావాల వికృతమైన, విద్రూపమైన భ్రమల గురించీ, ఆవాసాల నిర్మాణానికి అవసరమైన నేపథ్యం గురించీ, చివరిగా ఆస్తిని సొంతం చేసుకోవాలన్న భావనల గురించీ ఒక ప్రణాళికాబద్ధంగా సేకరించిన విషయాల్ని గుదికూర్చారు మోర్గన్ ఈ మహా గ్రంథంలో.

మొత్తం గ్రంథాన్ని నాలుగు భాగాలుగా విడగొట్టి, ఒక్కో భాగంలో కొన్ని ఉప ప్రకరణాలుగా చేర్చారు.

మొదటి భాగం: మానవ మేధో వికాసం

ఒకటో భాగంలో, మానవ మేధో వికాసం ఎలా జరిగిందో మూడు ప్రకరణాల్లో చెప్పారు. మానవ దశల్ని ఎంపిక చేసుకొని, వారి జీవన నైపుణ్యాల క్రమాన్ని వివరిస్తూ, పురోగతికి పునాదులెలా పడ్డాయో ఈ భాగంలో వివరించారు. మొదటి ప్రకరణంలో మోర్గన్, మానవ దశల్ని ఆటవిక యుగం, అనాగరిక యుగం, నాగరిక దశలుగా విడగొట్టి, మళ్లీ ఆటవిక మరియు అనాగరిక యుగంలోని దిగువ, మధ్యస్థ, ఎగువ దశల్ని చర్చించారు.

మానవ దశల్ని నిర్ధారణ చేయడం వల్ల ఏయే తెగలు, జాతులు, తమ అస్తిత్వాన్ని ఇతర జాతుల సంపర్కం ద్వారా ఎలా మార్చుకున్నాయో, లేదా అలానే స్వచ్ఛంగా ఎలా ఉండిపోయాయో కూడా తెలుసుకోగలుగుతాం. ఆఫ్రికాలోని

ఆటవిక దశలోని తెగలు, అనాగరిక జాతులతో కలగలిసి గందరగోళంగా ఉండగా, ఆస్ట్రేలియా, పొలినీషియాలలో అవి, పర సంపర్కం లేకుండా ఆటవిక దశలోని ఆనాటి అలవాట్లనూ, నియమాలనూ కల్తీ లేకుండా ఉంచుకోవడం చూస్తాం. అమెరికా లోని ఇండియన్ తెగలు, మూడు మానవ దశలకు ప్రతీకలుగా, సంకరం కాని రీతిలో, స్వచ్ఛంగా ఉండిపోయారు. కారణం, దాని భౌగోళిక అస్తిత్వపు ఎడబాటే! ఏ ఖండంలో ఉన్నా, ఒకే దశలో ఉన్న మానవ నైపుణ్యాలు, నైతిక నియమాలు, జీవిత పద్ధతులు ఒకే విధంగా ఉంటాయి అంటారు మోర్గన్. మానవ జాతిలో ప్రధాన నైతిక నియమాలకు బీజరూపం ఒక్కటేననీ, ఉదాహరణకు, ప్రాచీన గ్రీక్, రోమన్ నైతిక నియమాల్ని, అమెరికన్ ఆదిమ తెగల్ని పరిశీలించడం ద్వారా కూడా తెలుసుకోగలం అని నిరూపించారు మోర్గన్ ఈ గ్రంథంలో.

రెండో భాగం: సామాజిక నిర్మితి మూలాలు

రెండో భాగంలో పదిహేను ప్రకరణాలున్నాయి. మోర్గన్ అసాధారణ పరిశోధనా కృషి అంతా ఈ ప్రకరణాల్లో చూస్తాం. పాలక వ్యవస్థ తాలూకూ బీజాలు అతి ప్రాథమిక తెగ, గణ, ఫ్రాట్రీల దశల్లో ఎక్కడ మొదలై ఎలా అభివృద్ధి అవుతూ వచ్చాయో చూపించడానికి ఆయన అతి ప్రధానమైన గణాల మూలాల్ని సంవత్సరాల తరబడి పరిశోధించడం చూస్తాం. అతి ప్రాచీన ఆదిమ దశల్లో స్త్రీ, పురుష భేదం ప్రాతిపదికన సామాజిక నిర్మితిని చూడటం కోసం మోర్గన్, ఇరాక్యూ, గనోవానియన్, అజ్టెక్, గ్రీకు, రోమన్ తెగల మూలాల్ని గాఢంగా పరిశీలించారిందులో.

మూడో భాగం: కుటుంబ వ్యవస్థ ఆవిర్భావం

మూడో భాగంలో ఆరు ప్రకరణాలున్నాయి. మానవ జీవితంలో అతిప్రాథమిక సాంఘిక భావన పునాది కుటుంబం గురించి మోర్గన్ ఇందులో చర్చించారు. పురాతన కుటుంబం, రక్తసంబంధీకుల, పితృస్వామ్యక, దంపతీ కుటుంబాల మూలాల్ని ఆయా తెగల్లో ఎలా రూపొందాయో పరిశీలించి ఆధారాలు చూపారు.

నాలుగో భాగం: ఆస్తి భావన, వారసత్వం

నాలుగో భాగంలో రెండే ప్రకరణాలున్నాయి. అయినప్పటికీ సమస్త మానవ విషాదాలకు మూలమైన అతికీలకమైన ఆస్తి భావన మూలాల్ని లాగి వారసత్వ నియమాలు ఎలా పుట్టుకొచ్చాయో గ్రీకు, రోమన్, హీబ్రూ తెగల అధ్యయనం ద్వారా వివరించే ప్రయత్నం చేశారు మోర్గన్.

నాగరికత ఆవిర్భావం - నైపుణ్యాల వికాసం

పురాతన సమాజం లక్ష ఏళ్ళనాటి మానవజాతి మూలాల్ని స్పృశించినా, అరవై వేల ఏళ్ళు ఆటవిక యుగానికి పోగా, ఇరవై వేల ఏళ్ళు అనాగరిక దిగువ దశకూ, పదిహేను వేల ఏళ్ళు అనాగరిక మధ్య, ఎగువ దశల పరిశీలనకు పోగా, ఇంక మిగిలిన ఐదు వేల సంవత్సరాలు నాగరిక దశని స్థాలీ పులాకంగా చూస్తుంది.

ఈ ఐదు వేల సంవత్సరాల నాగరిక దశకి ఆర్యన్, సెమిటిక్ జాతులు ప్రారంభకులుగా ఉండటం పశుపోషణ వల్లో, స్థాన ప్రత్యేకత వల్లో, మంచి జీవనోపాధి వల్లో కావొచ్చు అంటారు మోర్గన్. ఆహారానికి మూలమైన పదార్థాలను ఐదింటిని గుర్తిస్తే అందులో రెండు ఆటవిక యుగం నాటివి కాగా తతిమ్మా మూడు అనాగరిక కాలం నాటివిగా గుర్తించారు మోర్గన్. సమశీతోష్ణ, ఉష్ణమండల ప్రాంతాల్లో దొరికే పళ్లు, దుంపలూ మొదటి జీవనోపాధి కాగా, రెండోది చేపల వేట. మిగిలిన మూడు నైపుణ్యాలలో, అనాగరిక యుగంలో సంపాదించిన మిగతా నైపుణ్యాలలో మూడోది, ధాన్యాల ద్వారా పిండి చేసుకోవడం. నాలుగోది, పాలు, మాంసం వాడకం, ఐదోది, వ్యవసాయంలో మడి, చెలకా వినియోగంగా విడగొట్టి చూశారు మోర్గన్.

జంతుజాలాల మచ్చిక విషయానికొస్తే, ఆదివాసులు టర్కీ కోడిని మచ్చిక చేస్తే, పశ్చిమార్ధ గోళంలో లామాని (అది తప్ప వేరేది తెలియదు!) మచ్చిక చేశారు. తొలిసారిగా వేటకు వెంట వచ్చిన కుక్క తొలి పెంపుడు జంతువు అయిఉండాలి. గ్రీకులు మేకల్ని, గొర్రెలనూ, ఆవుల్ని పెంచడం, పాలు పితికే ప్రసక్తి ఇలియడ్ కావ్యంలో ఉంది. పెరళ్ళు, తోటలు, ద్రాక్ష సాగు, పశువుల మందల విషయమై హోమర్ రాయడం చూస్తాం. ఆర్యన్ తెగలు జంతువులను మచ్చిక చేసుకున్నాకే వారు ధాన్యాలు పండించారనడానికి సాక్ష్యం వారి జంతుజాలాల పేర్లన్నీ ఇంచుమించుగా ఒకే రకంగా ఉండగా, పంటలకూ, మొక్కలకూ వేరువేరుగా ఉండటం గమనార్హం. అంటే ఆర్యన్ తెగలు వలసలుగా చెదరక మునుపే వారు జంతువులను మచ్చిక చేశారు. ఇది మనకు ఇప్పుడొక బృహద్విషయంగా కనబడకపోయినా అదొక గొప్ప ఆవిష్కరణ. అంతేకాదు, వారికి వ్యవసాయం తెలుసు అనుకోవడానికి సాక్ష్యం లేదు!

లాటిన్, గ్రీకు భాషల్లోని ధాన్యాల పేర్లకు సంస్కృతంలోని పేర్లకు సాపత్యం లేదు. యుద్ధాలు సర్వ సాధారణం. ఆటవిక యుగంలో యుద్ధంలో పట్టుబడ్డవారిని తినడం మామూలే! కరువులో స్నేహితులతో పాటూ, కుటుంబ సభ్యులను కూడా తినడం ఆచారమే. మొక్కల పెంపకం నేర్చిన తర్వాతే, ఆహారం తగినంత లభించాకే, నరమాంస భక్షణ ఆగిఉండాలి. ఇంకా నాగరిక దశలో అడుగుపెట్టక మునుపు, అనాగరిక యుగంలో వచ్చిన మరో రెండు గొప్ప విషయాలు, నిర్మాణాల్లో రాళ్లని వినియోగించడం ఒకటైతే రెండోది, ఇనుము కరిగించడం. అనాగరిక దశలో మానవుడు వాడిన అనేక పనిముట్ల ప్రస్తావన

తీసుకొచ్చి, ఇనుము కరిగించాక జరిగిన అసాధారణ ప్రగతిని చాలా గొప్పగా శ్లాఘిస్తారు మోర్గన్.

తర్వాత మోర్గన్, అతిప్రాథమిక గణ నిర్మితిలో, ఆచార వ్యవహారాల పరిశీలన ద్వారా, నాయకత్వ విధానం, వివాహాలూ, లైంగిక సంబంధాలూ, సోదరీసోదరుల సంబంధాలు, రక్త సంబంధాలు, దత్తత, కుటుంబ యాజమాన్యం, రక్షణ, ప్రతీకారం, వలసపోవడం, ప్రాంతాల పేర్లు, భాష, గణాలకూ గణాలకూ మధ్య సంబంధాల విశ్లేషణా, తెగలూ, సమాఖ్యలూ, వాటి నిర్మాణాల్లో వైరుధ్యాలనూ, సాపత్యాలను ఎత్తిచూపడానికి మోర్గన్, విడిగా అస్తిత్వంలో ఉన్న ఆస్ట్రేలియన్ మరియు అమెరికన్ ఖండాల ఆదివాసీల గణ సమాజాలతో పాటూ, కలగాపులగపు ఆఫ్రికన్, గ్రీకు, రోమన్, మెక్సికన్, స్పానిష్ ఇంకా ఇతర తెగల్ని కూడా గణనలోకి తీసుకుంటారు.

కుటుంబ వ్యవస్థలు - వారసత్వ హక్కులు

మరో అతిముఖ్యమైన కుటుంబ రూపాల భావన మూలాల్ని వెలికితీయడానికి ఆయన విస్తృతంగా శ్రమించారు. ఐదు రకాల కుటుంబ వ్యవస్థల్ని స్థూలంగా విశ్లేషించే ప్రయత్నం చేశారు. రక్త సంబంధీకుల కుటుంబం(సహోదర గుంపుల మధ్య వివాహాలు), మగవాళ్ల గుంపు ఆడవాళ్ల గుంపుతో పెళ్లిళ్లతో ఏర్పడే కుటుంబం, ఆడ జంట, మగ జంట కుటుంబం, బహు భార్యా కుటుంబం, చివరిది దంపతీ కుటుంబం. ఇవన్నీ ఆయా గ్రీకు, ఆర్యన్, సెమిటిక్, రోమన్, అరబిక్, రష్యన్ తెగల్లో, గణాల్లో ఉండే అనేక విధి విధానాలనూ, అలవాట్లనూ, ఆచారాలనూ, వైవాహిక, బంధుత్వ సంబంధాల్ని లోతుల్లోకి వెళ్లి శోధించారు మోర్గన్.

చివరిగా మోర్గన్, వివిధ మానవజాతి దశల్లో ఆస్తి భావన ఎలా అభివృద్ధి పొందుతూ వచ్చిందో, యాజమాన్య హక్కులూ, వారసత్వం గురించి ఎలాంటి నిబంధనలు మనుష్యులు ఏర్పర చుకున్నారో, ఆటవిక దశలో దీని మూలాలు ఎక్కడ ఉన్నాయో, వేర్వేరు అనాగరిక దశల్లో ఇవెలా పరిణామం చెందుతూ వచ్చాయో అన్నది లోతుగా పరిశోధించారు. గ్రీకు, రోమన్ తెగలలో, వ్యక్తుల పోగుబడ్డ ఆస్తి పంపకాల నియమాల గురించీ, వారు తమ తదనంతరం ఎవరికి ఆ కూడబెట్టిన ఆస్తిని వారసత్వంగా వెళ్లేలా చూసేవారో లాంటి అనేక ఆసక్తికరమైన విషయాలను శోధించి, ప్రస్తుత నాగరిక మానవ సమాజం ఇంచుమించు ఆచరణలో ఉంచుకున్న ఆ ప్రాచీన ఆనవాళ్లను పట్టి చూపే ప్రయత్నాన్ని అత్యంత లాఘవంగా ఆవిష్కరించారు మోర్గన్.

పురాతన సమాజం మన తాత ముత్తాతల ఆనవాళ్లు వెతుక్కునే ఒక అసాధారణ అన్వేషణ. ఏం తిన్నాం, ఎక్కడ ఉన్నాం, ఏం కట్టామో తెలుసుకొనే ప్రయత్నమే పురాతన సమాజం. తోటివారిని చంపుకుతిన్నామనిగానీ, రక్త సంబంధీకులతో పెళ్ళిళ్ళు చేసుకున్నామని గానీ, సిగ్గుపడాల్సిన అవసరమేమీ లేదు! ఉనికి కోసం తోటివార్ని తెగ నరికినందుకు సిగ్గిల్లే పని అసలే లేదు!

మానవజాతి చరిత్ర ఒక అజరామర కావ్యం! తప్పొప్పుల తప్పటడుగులు ఎన్నున్నా, యావత్ ప్రాణికోటికి శిరోధార్యంగా, నిబ్బరంగా అనుగమించిన బృహత్కథ మనది! నిప్పుని, కుమ్మరి చక్రాన్ని, ఇనుమును, విల్లంబును, కుటుంబాన్ని, గణాన్ని, సున్నాన్ని, చక్రాన్ని కనిపెట్టి తొంభై ఐదువేల సంవత్సరాల అనాగరిక జీవితం నుంచి వెలికివచ్చి, జాతికి నాగరిక కిరీటం తగిలించుకున్న మనకి ఇంకా ఐదువేల ఏళ్ళ ప్రాయమే! ఇది చరిత్ర గతిలో అత్యల్పం! అయితేనేం, ఒక జాతిని వేరొక జాతీ, ఒక మనిషిని వేరొక మనిషీ పీడించని సమ సమాజం ఇంకా రానేలేదు! అప్పుడు కదా మనం నాగరికులం! అది కదా మన తుది మజిలీ! అప్పుడు కదా ఈ గమనానికి పరమార్థం! ఈ వైనాన్నంతా కళ్ళకు కట్టిన మహనీయుడు మోర్గన్‌కు కృతజ్ఞతలు చెప్పుకుందాం వినమ్రంగా. ❑

జాతీయ సమగ్రతను, బహుళత్వాన్ని రక్షించ గలిగేది లౌకిక, ప్రజాస్వామ్య, సామ్యవాద రాజ్యాంగం మాత్రమే!

(24వ పేజీ తరువాయి) ప్రారంభించామన్నారు. భారత రాజ్యాంగ సారాంశం అంతా రాజ్యాంగ పీఠికలోనే ఉందనీ, అందులోని పదజాలాన్ని అర్థం చేసుకోవడం ముఖ్యమని అన్నారు. రాజ్యాంగ చట్టాన్ని అవగాహన చేసుకోవడం ద్వారానే రాజ్యాంగానికి ఎదురవుతున్న సవాళ్లను, ప్రమాదాలను ఎదుర్కోగలమని వర్మ అన్నారు.

అనంతరం రాజ్యంగ పీఠిక, ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు, పౌరుల హక్కులు – బాధ్యతలు, ప్రజాస్వామ్య మౌలిక సూత్రాలు, రాజ్యాంగానికి ఎదురవుతున్న సవాళ్లు వంటి అంశాలపై బృంద చర్చలు జరిగాయి. వర్క్ షాప్‌లో పాల్గొన్న దాదాపు అరవై మంది ఆరు బృందాలుగా ఏర్పడి ఆయా అంశాలపై చర్చించి తమ అభిప్రాయాలను క్రోడీకరించి వర్క్ షాప్ ముందు ఉంచారు. పాల్గొన్న ప్రతీ ఒక్కరూ తమ అభిప్రాయాలు చెప్పుకోవడానికి వీలుగా బృంద చర్చలు ఉపకరించాయి. రాబోయే రోజుల్లో రాజ్యాంగ ప్రచార సభలను, రౌండ్ టేబుల్ సమావేశాలను, వర్క్ షాప్‌లను నిర్వహించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, న్యాయవాదులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు. కడలి రామాంజనేయులు వందన సమర్పణ చేశారు. ❑


ఎన్నికల్లో గెలిచిన అబ్రహం లింకన్‌కు కారల్ మార్క్స్ అభినందనలు

ఇంటర్నేషనల్ వర్కింగ్ మెన్ అసోసియేషన్ 1864 అమెరికా యునైటెడ్ స్టేట్స్ అధ్యక్షుడు అబ్రహాం లింకన్‌కు, అంతర్జాతీయ వర్కింగ్ మెన్ అసోసియేషన్ చిరునామా యుఎస్ అంబాసిడర్ చార్లెస్ ఫ్రాన్సిస్ అడామ్స్‌కు అందజేయబడింది.

1865 జనవరి 28న, కారల్ మార్క్స్ రాసినది, నవంబర్ 22 నుండి 29, 1864 మధ్య, మరియు నవంబర్ 29, 1864న జనరల్ కౌన్సిల్ మినిట్స్‌లో చేర్చబడింది. ది బీ-హైవ్ న్యూస్ పేపర్, నం. 169, జనవరి 7, 1865, మరియు జర్మన్ అనువాదంలో డెర్ సోషియల్ డెమోక్రాట్ 1864 డిసెంబర్ 30న; మొదట ప్రచురించబడింది.

మూలం: ది జనరల్ కౌన్సిల్ ఆఫ్ ది ఫస్ట్ ఇంటర్నేషనల్ 1864-1866, ప్రోగ్రెస్ పబ్లిషర్స్;

లిఖితం/మార్క్స్: జోడియాక్/బ్రియన్ బాగిన్స్; ఆన్‌లైన్ వెర్షన్ : మార్క్స్ & ఎంగెల్స్ ఇంటర్నెట్ ఆర్కైవ్ (marxists.org) 2000.



లింకన్‌కు అసోసియేషన్ లేఖ

సర్,

మీరు పెద్ద మెజారిటీతో తిరిగి ఎన్నిక కావడాన్ని అమెరికా ప్రజలకు మేము అభినందిస్తున్నాము. మీ మొదటి ఎన్నిక "బానిసల శక్తిని" చూపిస్తే, తిరిగి ఎన్నికలో మీరు సాధించిన విజయం, యుద్ధ మంత్రం "దాస్యానికి మరణం"గా చూపిస్తుంది. అమెరికా యుద్ధ ప్రారంభం నుండి యూరోపియన్ కార్మిక వర్గం వారధి మీద వారి వర్గ భవితవ్యాన్ని కలిగి ఉన్నట్టు స్ఫురించినది. భూభాగాల కోసం జరిగిన పోరాటం, ఇది దాసుడిని శిక్షించే వారి బూట్ల ద్వారా పనిలోకి ప్రేరేపించబడకుండా వలసదారుల కష్టంతో పనిలోకి వెళ్ళాలా అన్న ప్రశ్నని తీర్చాలని ఉందా?

300,000 మంది దాస్య యజమానుల ఓలిగార్కీ, ప్రపంచ చరిత్రలో తొలిసారిగా "దాస్యం" అని సాయుధ తిరుగుబాటుపై పతాకంపై ధైర్యంగా వ్రాసినప్పుడు, ప్రజా గణతంత్రానికి సంబంధించిన ఆలోచన మొదట స్ఫురించిన ప్రదేశాలలో, వంద సంవత్సరాల క్రితం, "మనిషి హక్కులపై మొదటి ప్రకటన"ని జారీ చేసిన ప్రాంతాల వద్ద, XVIII శతాబ్దపు యూరోపియన్ విప్లవానికి మొదటి పునాదిని ఇచ్చిన ప్రదేశాల వద్ద కౌంటర్ రెవల్యూషన్, వ్యవస్థాపక సూత్రంతో, "పాత రాజ్యాంగం స్థాపన సమయంలో ఉన్న ఆలోచనలను" పునశ్చరణ చేయడంపై గర్వం గా ప్రకటించగా, దాస్యాన్ని "ప్రయోజనకరమైన వ్యవస్థ" గా, కాపిటల్ మరియు శ్రమశక్తి మధ్య ఉన్న గొప్ప సమస్యకు పాత పరిష్కారంగా పేర్కొనగా, మనుష్యులలో సంపదను "కొత్త భవనానికి మూలస్థంభం"గా భావించినప్పుడు, యూరోపియన్ కార్మికవర్గం ఆ క్షణమే అర్థం చేసుకుంది. తిరుగుబాటు దాస్య యజమానుల ద్వారా జరిగినది కేవలం పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా జరుపుతున్న పోరాటానికి ఒక జాగ్రత్త గమనికగా మారింది.

తాము ఎదుర్కొంటున్న సంక్షోభం వల్ల కలిగిన కష్టాలను వారు ఓర్పుగా భరించారు. తమ మంచి కారణానికి యూరప్‌లోని వివిధ ప్రాంతాల నుండి తమ రక్తాన్ని సమర్పించారు. తమ స్వంత గణతంత్రాన్ని దాస్యం వల్ల మలినం చేసుకునే ఉత్తర అమెరికా వర్గాలపై ఆధిపత్యం ఉన్నప్పుడు, నిజమైన కార్మిక స్వేచ్ఛను పొందటానికి వారు అసమర్థులయ్యారు. కానీ ఈ పురోగతికి అడ్డంకి జాతి యుద్ధం రూపంలో తొలగించబడింది. యూరోపియన్ కార్మిక వర్గాలు

నిశ్చయంగా భావిస్తున్నాయి. అమెరికా స్వాతంత్ర్య యుద్ధం మధ్యతరగతి ఆధిపత్యానికి ఒక కొత్త యుగాన్ని ప్రారంభించినట్లే, అమెరికా దాస్య వ్యతిరేక యుద్ధం కార్మిక వర్గాల కోసం కూడా ఒక కొత్త యుగానికి దారి తీస్తుంది. నిర్బంధం నుంచి ఒక వర్గాన్ని రక్షించడంలో మరియు ఒక సామాజిక ప్రపంచాన్ని తిరిగి నిర్మించడంలో అబ్రహాం లింకన్‌కు, కార్మిక వర్గాలకు చెందిన నిజాయితీ గల వ్యక్తికి, ఈ అపూర్వమైన పోరాటంలో దేశాన్ని నడిపించడంలో శుభం కలిగినట్లుగా ఇది కొత్త యుగానికి సూచనగా ఉంటుందని. భావించాలి.

అంతర్జాతీయ వర్కింగ్ మెన్ అసోసియేషన్, సెంట్రల్ కౌన్సిల్ తరపున సంతకం చేసిన వారు:

లాంగ్ మైడ్, వార్లీ, విట్‌లాక్, ఫాక్స్, బ్లాక్‌మోర్, హార్ట్‌వెల్, పిడ్జన్, లూక్రాఫ్ట్, వెస్టన్, డెల్, నియాస్, షా, లేక్, బక్‌లీ, ఓస్బోర్న్, హోవెల్, కార్టర్, వీలర్, స్టెన్స్‌బీ, మోర్గన్, గ్రాస్మిత్, డిక్, డెనౌల్, జౌర్డైన్, మోరిస్సాట్, లెరౌక్స్, బోర్డేజ్, బోకెట్, తాలాండియర్, డుపాంట్, ఎల్. వోల్ఫ్, ఆల్ద్రోవాండి, లామా, సోలుస్ట్రీ, నస్పెర్లి, ఎక్కారియస్, వోల్ఫ్, లెస్నర్, ప్ఫాండర్, లోక్నర్, కౌబ్, బోలెటర్, రైబ్సిన్స్కి, హాన్స్‌న్, షాంట్జెన్‌బాచ్, స్మేల్స్, కార్నెలియస్, పీటర్సన్, ఒటో, బాగ్నగట్టి, సెటాకి. జార్జ్ ఒడ్జర్, కౌన్సిల్ అధ్యక్షుడు; పి.వి. లూబెజ్, ఫ్రాన్స్ కోసం కారస్పాండింగ్ సెక్రెటరీ; కార్ల్ మార్క్స్, జర్మనీ కోసం కారస్పాండింగ్ సెక్రెటరీ; జి.పీ. ఫాంటానా, ఇటలీ కోసం కారస్పాండింగ్ సెక్రెటరీ; జె.ఇ. హోల్ట్రోప్, పోలాండ్ కోసం కారస్పాండింగ్ సెక్రెటరీ; హెచ్.ఎఫ్. జంగ్, స్విట్జర్లాండ్ కోసం కారస్పాండింగ్ సెక్రెటరీ; విలియం ఆర్. క్రేమర్, గౌరవ ప్రధాన సెక్రెటరీ. 18 గ్రీక్ స్ట్రీట్, సోహో.

అంతర్జాతీయ జనరల్ కౌన్సిల్ మినిట్స్ నుండి..

నవంబర్ 19, 1864:

"డాక్టర్ మార్క్స్ ఆ సబ్ కమిటీ నివేదికను, ప్రజలకు ఒక ముసాయిదాను తీసుకొచ్చారు. దీనిని వారు తిరిగి అబ్రహాం లింకన్‌ను అధ్యక్షుడిగా ఎన్నిక చేసినందుకు అభినందనలో అందజేయాల్సి ఉంది. ఈ చిరునామా ఇలా ఉంది ఇది ఏకగ్రీవంగా ఆమోదించబడింది."

సమావేశపు మినిట్స్ కొనసాగించబడుతున్నాయి:

"చిరునామా అందజేసే పద్ధతి గురించి మరియు ప్రతినిధి బృందంతో ఒక పార్లమెంటు సభ్యుడు ఉండటం సరైనదా అనే చర్చ జరిగింది. చాలామంది సభ్యులు దీనిని గట్టిగా వ్యతిరేకించారు. అనేక సభ్యులు, కార్మికవర్గాలు తమపై ఆధారపడాలని, బాహ్య సహాయం కోసం అన్వేషించకూడదని అన్నారు. ఈ విషయాన్ని ప్రతిపాదించారు. ఏకగ్రీవంగా ఆమోదించబడింది. కౌన్సిల్ సభ్యులతో కూడిన ప్రతినిధి బృందానికి యునైటెడ్ స్టేట్స్ మంత్రిని కలవడానికి సమయం కేటాయించవలసిందిగా కార్యదర్శి పత్రం ద్వారా అడగాలని నిర్ణయించారు."

అంబాసిడర్ అడామ్స్ ప్రతిస్పందన
యునైటెడ్ స్టేట్స్ లెగేషన్
లండన్, 1865 జనవరి 28

సర్,

మీ అసోసియేషన్ సెంట్రల్ కౌన్సిల్ చిరునామా కలిగిన లెటర్ను, చట్ట ప్రకారం యునైటెడ్ స్టేట్స్ అధ్యక్షుడికి అందించబడినది. ఆయన దానిని స్వీకరించినట్లు మీకు తెలియజేయమని ఆదేశించబడినాను.

ఆ లెటర్‌లో వ్యక్తపరిచిన భావాలు వ్యక్తిగతమైనవిగా ఉంటే, ఆయన వాటిని సవినయంగా ఆసక్తిగా స్వీకరించారు. ఆయన తనతోపాటు స్నేహం మరియు పురోగతికి మద్దతు ఇచ్చిన మీరు మరియు ప్రపంచవ్యాప్తంగా ఉన్న మానవత్వం కోసం ఆలోచిస్తున్న మీ అందరికీ తను నిలబడగలనని నిరూపించుకోవడానికి, నిర్ధారించుకోవాలని ప్రయత్నిస్తున్నారని తెలియజేయడానికి సంతోషిస్తున్నారు.

యునైటెడ్ స్టేట్స్ ప్రభుత్వానికి, వారి విధానాలు ప్రతికూలం కావు అని స్పష్టంగా తెలుసు, కానీ అదే సమయంలో, వారు ఎక్కడైనా ప్రచారం చేయకుండా మరియు చట్ట విరుద్ధమైన జోక్యం చేసుకోకుండా ప్రారంభించిన మార్గానికి కట్టుబడి ఉంటారు. అన్ని రాష్ట్రాలకు మరియు అందరి వ్యక్తులకు సమాన, సరైన న్యాయం చేయాలని వారు ప్రయత్నిస్తారు. ఆ ప్రయత్నం వల్ల దేశంలో మద్దతు మరియు ప్రపంచ వ్యాప్తంగా గౌరవం మరియు మంచి మనసు వస్తాయని వారు నమ్ముతున్నారు.

దేశాలు తమ కోసం మాత్రమే ఉండవు. కానీ స్నేహపూర్వక సంబంధాలు, ఉదాహరణల ద్వారా మానవాళి సంక్షేమం, ఆనందాన్ని పెంపొందించడానికి ఉంటాయి. యునైటెడ్ స్టేట్స్, దాస్యాన్ని వ్యతిరేకించి, తిరుగుబాటును వ్యతిరేకిస్తూ తన శ్రమకు మద్దతుగా ఉన్న యుద్ధాన్ని మానవత్వం కోసం పోరాటంగా భావిస్తారు, మరియు యూరోప్‌లోని కార్మిక వర్గాలు తమ మద్దతుతో సహా వారి వివేకంతో కూడిన మద్దతును మరియు ప్రగాఢ సహానుభూతిని చూపినందుకు వారు కొత్త ప్రోత్సాహం పొందుతున్నారు.


మీ విశ్వాసపూర్వక సేవకుడు
చార్లెస్ ఫ్రాన్సిస్ అడామ్స్
ఇంటర్నేషనల్ వర్కింగ్ మెన్ అసోసియేషన్ సూచిక పత్రాలు

కాడ్వెల్ కవిత్వ తత్వం



- కేతవరపు రామకోటిశాస్త్రి

కాడ్వెల్ కవితా తత్వం అనే శీర్షికతో వరంగల్ నుండి వెలువడే 'జనధర్మ' ద్వైమాసిక పత్రికలో 1969 మార్చి నుండి 1969 సెప్టెంబర్ వరకు నాలుగు సంచికలలో ధారావాహికగా ఈ వ్యాసం వచ్చింది. దాదాపు గ్రాంథికంలో ఉన్న ఈ రచనను, విషయానికి తగినట్లుగా వ్యావహారిక వచనంలోకి 1970లోనే ఆచార్య ముదిగొండ వీరభద్రయ్య గారు రాసిపెట్టారు. రామకోటిశాస్త్రి గారు 1991లో మరణించాక, 1998 అక్టోబర్‌లో ప్రజాశక్తి బుక్ హౌస్ వారు ఈ పుస్తకాన్ని ముద్రించారు. ఫాసిస్ట్ పెనుప్రమాదం జడలు విప్పి నర్తిస్తున్న వేళ, కాడ్వెల్ దృక్పథాన్ని తెలుసుకోవడం మన ఆలోచనకు, అవగాహనకు ఉపయోగకరంగా ఉంటుందనే ఉద్దేశంతో... ఇప్పుడిలా మళ్ళీ 'కొలిమి' పత్రిక సౌజన్యంతో...



పరిచయం.. కాడ్వెల్ జీవితం

క్రిస్టోఫర్ కాడ్వెల్ 1937 ఫిబ్రవరి 12వ తేదీన స్పెయిన్‌లో మరణించాడు. రెండో ప్రపంచ యుద్ధానికి పూర్వరంగంగా నాజీ ఫాసిస్టులు సృష్టించిన అంతర్యుద్ధాన్ని స్పెయిన్ రిపబ్లికన్ ప్రభుత్వం ఎదుర్కొనవలసి వచ్చింది. ప్రభుత్వం పక్షాన అంతర్జాతీయ సైనిక విభాగంలో చేరి, ఎర్ర సైనికోత్సాహంతో విజృంభించి కాడ్వెల్ వీర మరణాన్ని పొందాడు. అప్పటికి అతని వయస్సు (1907 అక్టోబర్ 20న పుట్టాడు గనుక) సరిగ్గా 29 సంవత్సరాల మూడు నెలల పన్నెండు రోజులు.


1933 వరకు కాడ్వెల్ మార్క్సిజం దగ్గరకు పోలేదు. 1934, 35 సంవత్సరాలలో మార్క్సిస్టు ప్రపంచ జీవిత తాత్వికతను అధ్యయనం చేసి, ఆ అవగాహనతో కవిత్వము యొక్క ఉత్పత్తి, పరిణామాలు, మౌలిక సామాజిక స్థితిగతులను గురించి 'ఇల్యూషన్ అండ్ రియాలిటీ' అన్న గ్రంథం చిత్తుప్రతిని రచించాడు. డిసెంబర్‌లో పార్టీలో సభ్యుడై, మరింత విజ్ఞానాన్ని అనుభవపూర్వకంగా పొందాలని పారిస్ వెళ్ళాడు. అక్కడ పొందిన ఉత్సాహశక్తితో ఆ గ్రంథాన్ని కాడ్వెల్ పకడ్బందీగా తిరిగి రాశాడు. 'స్టడీస్ ఇన్ ఎ డయింగ్ కల్చర్' అన్న పేర ప్రచురించిన పుస్తకంలోని వ్యాసాలను అప్పుడే పూర్తి చేశాడు. 'ది క్రైసిస్ ఇన్ ఫిజిక్స్' అనే రచన మొదలు పెట్టాడు. 1936 నవంబర్‌లో అంతర్జాతీయ సైనిక విభాగంలో చేరటానికి పోయేటప్పటికి 'ఇల్యూషన్ అండ్ రియాలిటీ' అన్న ఈ గ్రంథం అచ్చులో ఉంది.

నిజానికి అతని పేరు కాడ్వెల్ కాదు. సెయింట్ జాన్ స్ప్రిగ్. యుద్ధంలో కొండల మీద మరణించింది జాన్. జాన్ బ్రతికి ఉండగా పుస్తకాలు రచించింది కాడ్వెల్. జాన్ స్ప్రిగ్ తల్లి పేరు జెస్సి మేరీ కాడ్వెల్. ఆ తల్లి పేరునే తన కలం పేరుగా పెట్టుకొన్నాడు. తల్లిదండ్రులు పెట్టిన పేరు జాన్. మార్క్సిస్టు తాత్విక రచయిత అవుతూ తాను పెట్టుకొన్న పేరు కాడ్వెల్. ఆ వైజ్ఞానిక సంకేతమే నిలబడింది.

మార్క్సిస్టు కాకముందు కాడ్వెల్

మార్క్సిస్టు ఆలోచనాపరుడూ, ఆచరణశీలుడూ కాక ముందు కాడ్వెల్ యొక్క జాన్ జీవితం అదొక చిత్రం. పదహారేళ్ళదాకా చదువుకొన్నాడు. తరువాత మూడేళ్ళపాటు యార్క్‌షైర్ అబ్జర్వర్ పత్రికకు విలేఖరిగా పనిచేశాడు. అప్పుడు లండన్‌లోని ఒక విమాన విజ్ఞాన ప్రచురణ సంస్థలో సంపాదకుడుగా చేరి, దానికి డైరెక్టరయ్యాడు. అప్పుడే విలువైన యంత్ర విభాగాలను స్వయంకృషితో కనిపెట్టాడు. విమాన విజ్ఞాన శాస్త్ర విషయాల్లో అయిదు పాఠ్యగ్రంథాలను రాశాడు. అపరాధ పరిశోధక

కేతవరపు రామకోటిశాస్త్రి



కేతవరపు వేంకట రామకోటి శాస్త్రి 1931 డిసెంబర్ 26న అప్పటి గుంటూరు జిల్లా రంగశాయపుర అగ్రహారంలో పుట్టారు. కన్నతల్లి తెలికేపల్లి వెంకమ్మ. దత్తత తీసుకొని విద్యా బుద్ధులు చెప్పించిన తల్లి కేతవరపు సావిత్రమ్మ. హైస్కూల్ చదువు వినుకొండలో, ఇంటర్మీడియేట్ గుంటూరు హిందూ కాలేజీలో చదివి, కొంతకాలం సత్తెనపల్లిలో టీచర్‌గా పనిచేసి, అక్కడి నుండి విశాఖపట్నం వెళ్ళి ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బి.ఎ. ఆనర్స్ పూర్తి చేసి, 1954లో గుడివాడ ఏ.సి. కాలేజీలో లెక్చరర్‌గా చేరారు. 1957లో ఉద్యోగం మానేసి, ఉస్మానియా విశ్వ విద్యాలయంలో బిరుదురాజు రామరాజు గారి పర్యవేక్షణలో తిక్కన కావ్యశిల్పంపై డాక్టరేట్ పట్టా పొందారు. 1960 నుండి ఉస్మానియా విశ్వ విద్యాలయం అధ్యాపకులు. 1968లో వరంగల్ పి.జి. సెంటర్‌కు బదిలీ అయి వచ్చి, కాకతీయ విశ్వ విద్యాలయం తెలుగు విభాగం అభివృద్ధికి నిలబడ్డారు. ఉద్యోగ జీవితం మరో అయిదారు నెలలలో ముగుస్తుందనగా, రోడ్డు ప్రమాదంలో 1991 అక్టోబర్ 28న ఆయన జీవితమే ముగిసింది.

సాహిత్య జీవితం

ఇంటర్మీడియేట్ చదువుతున్న కాలంలోనే ఆయనలో సాహిత్య సృజన, విమర్శన శక్తుల వికాసం మొదలైంది. జంధ్యాల పాపయ్యశాస్త్రి ప్రభావంతో పద్యాలు వ్రాయటం మొదలు పెట్టారు. విశ్వనాథ సాహిత్య అభిమాని అయ్యారు. మహాభారతం వంటి సంప్రదాయ సాహిత్యాన్ని ఎంత గాఢంగా అధ్యయనం చేశారో, విశ్వనాథ రామాయణ కల్పవృక్షాన్ని ఎంత పారాయణ చేశారో, ఆధునిక సాహిత్యాన్ని అంతే శ్రద్ధగా చదివారు.

1968లో వరంగల్‌కు తిరిగి రావటం ఆయన జీవితంలో పెద్ద మలుపు. అక్కడ నుంచి మార్క్సిస్టు తత్త్వశాస్త్ర అధ్యయనం, అవగాహన ఆయన సాహిత్య కృషిని విప్లవాత్మకంగా మార్చాయి. సమాజ, సాహిత్య సంబంధాల గురించి రాజకీయార్థిక దృక్పథంతో చేస్తున్న చింతనను సంభాషణగా మార్చటానికి, 1986-87 విద్యా సంవత్సరంలో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ వారి జాతీయ ఉపన్యాస కార్యక్రమం ప్రాజెక్టు కింద దేశంలోని వివిధ విశ్వ విద్యాలయాలలో ప్రసంగించటానికి ఎంపికైన సందర్భాన్ని చక్కగా ఉపయోగించుకున్నారు. అధ్యయనం, బోధన, విమర్శన, రచన ఆయన ఆచరణ. పరిశోధనలో నూతన సత్యాలకై అన్వేషించే జిజ్ఞాస ఆయనది. వందకుపైగా పరిశోధన పత్రాలు ప్రచురించారు. మెదడులో సుళ్ళు తిరిగే ఆలోచనలను కాగితం మీద పెట్టి చూసుకొనటం, సమాన భావాలు, స్పందనా లక్షణం ఉన్న సాహిత్య జిజ్ఞాసువులైన స్నేహితులతో సంభాషణలో నిగ్గు తేల్చుకొనటం ఆయన ప్రవృత్తి.

రచనలు

ఆయన జీవితకాలంలో వచ్చిన కవిత్వ రచనలు: ఆనందచేతన (1958), అంగహేల, శత్రుంజయము (1963), గీతాంజలి అనువాదం (1962).

ఆయన జీవితకాలంలో వచ్చిన విమర్శ గ్రంథాలు: నైమిశము (1961), సమీక్షణ (1963), తిక్కన కావ్య శిల్పం (1973), భారతము – తత్త్వ దర్శనము (1976), తిక్కన హరిహరనాథ తత్త్వము (1976), పోతన్నగారి వైచిత్రి (1987).

మరణానంతర ప్రచురణలు – కవిత్వం: ఒకే ఇద్దరం (1996), చిచ్ఛేతన (2006), శ్రీకృష్ణ దూత్యము – మరికొన్ని ముక్తకాలు, ఖండికలు (2009).

మరణానంతర ప్రచురణలు–విమర్శ గ్రంథాలు: మళ్ళీ కన్యాశుల్కం గురించి (1992), నాటక విశ్లేషణ (1993), విశ్వనాథ వైఖరి (1994), మహిళా సమాజవాద సాహిత్యం (1995), అభ్యుదయవాద సాహిత్య విమర్శనా దృక్పథం (1996),

కవిత్వం – సమాజం: క్రిస్టోఫర్ కాడ్వెల్ విశ్లేషణ (1998), భారతీయ సాహిత్య శాస్త్రం – భిన్న దృక్పథాలు (1999), నాచన సోముడు (2000), తెలుగు కవిత ఉద్యమాలు (2001), భాషా సాహిత్యాలు – సామాజిక భావనలు (2002), పురాణేతిహాసాలు – విశేష విశ్లేషణలు (2003), సంఘర్షణ – సంవాదం (2004), దృష్టి – దృశ్యం (2005), కావ్య జిజ్ఞాస (2007), సాహిత్య సామాజికతా వాదం – కొన్ని ప్రతిపాదనలు (2008), ఒక రత్నము – ఒక మంత్రము, శృంగార నైషధ కావ్య జిజ్ఞాస (2010), సాహిత్య సంభావన (2011), శాస్త్రీయ సమీక్షలు – ముందుమాటలు (2013), **కవిత్వం:** అనుభవం – అవగాహన (2014), నవలాలోకనం (2015).

1. దిస్ మై హాండ్ (1935)
2. ఇల్యూషన్ అండ్ రియాలిటీ (1937)
3. స్టడీస్ ఇన్ ఎ డయింగ్ కల్చర్ (1938)
4. ది క్రైసిస్ ఇన్ ఫిజిక్స్ (1939)
5. ఫర్దర్ స్టడీస్ ఇన్ ఎ డయింగ్ కల్చర్ (1949)

నవలలు, పాఠ్యగ్రంథాలు తప్పిస్తే మిగిలిన కాడ్వెల్ రచనలన్నీ అతని మరణానంతరం అచ్చయినవే. 1939లో మొదటిసారి అచ్చయిన అతని కవితలు 1965లో పునర్ముద్రణలో వచ్చాయి. ఆ సంవత్సరమే 'స్టడీస్ ఇన్ ఫిజిక్స్' అనే రెండు పుస్తకాల మొత్తంగా 'ది హెరిటేజ్ ఆఫ్ కాడ్వెల్' అనే గ్రంథమొకటి వచ్చింది. కాడ్వెల్ కమ్యూనిస్టుగా బ్రతికి, చావడం కూడా కమ్యూనిస్టుగానే చావడం అతనిది పూర్ణ జీవితం అనటానికి నిదర్శనం.

ఈ శతాబ్దిలో సాంస్కృతిక సాహిత్య కళారూపాల అధ్యయనంలో తన పూర్వీకులను మించిపోయినవాడు కాడ్వెల్. అంటే సాంస్కృతిక సాహిత్య కళా రూపాలు మహాజనం యొక్క మనస్సులను తమ ఆంతర్యానికి అభిముఖంగా మార్చుకొని, వాళ్ళచేత ప్రపంచాన్ని మార్పు చేయిస్తాయన్న చారిత్రక వాస్తవికతను తెలిసి, విశదీకరించి, సాహిత్య అధ్యయన దృక్పథాన్ని మార్చిన వాడన్నమాట.

ప్రవేశిక : కవిత్వం అంటే భాషా, సమాజ విచారణ

కవిత్వాన్ని గురించి, కవిత్వ ఉత్పత్తి మాతృకాస్థానాల గురించి మాట్లాడుతున్నామంటే మనం ఇంకా చాలా వాటిని గురించి మాట్లాడటానికి సిద్ధపడ్డామన్నమాట. అవేమిటంటే, కవిత్వమనేది ఏదో ఒక భాషలో గదా ఉంటుంది! అప్పుడు భాషల ఉత్పత్తి విషయం కూడా మన పరిధిలోనిదే.

అన్ని భాషలూ ఆయా సమాజాల సమష్టి ఉత్పత్తులు. ఆ సమాజంలోని మనుషులంతా తాము ఒకరితో ఒకరు సంబోధించి వ్యవహరించుకోవడం అవసరమై కూర్చుంటే, ఆ అవసరం తీర్చే సాధనంగా అందరూ కలిసి యథాశక్తి ఆ భాషను సృష్టించుకున్నారు. అది సమష్టి మీద ఉత్పత్తి చేసినది గనుక అది సమాజం సొత్తు. ఆ సామాజిక సంపదయైన భాషను ఆశ్రయించి, ఆ రూపంతోనే తాను వ్యవహారంలోకి వస్తున్నది కవిత్వం. ఆ భాష తన రూపాన్నిచ్చి సహకరించకపోతే కవిత్వం లేదు. లేదని ఎందుకనాలి? ఉన్నదనే అందాం. ఉన్నా అది ఉన్నట్లు తెలియకుండా మాత్రమే ఉంటుంది. తెలియాలంటే భాషారూపాన్ని ధరించక తప్పదు. భాష తనకు రూపమిచ్చి తన ఉనికికి తోడ్పడుతున్నది. గనుక, కవిత్వం అందుకు కృతజ్ఞతగా భాషా లక్షణాలను తాను సంతరించుకుని, 'త్వమేవాహమ్' అన్నట్లుగా ఉంటుంది.

భాష యొక్క ప్రధాన లక్షణమేమనుకొన్నాం? అది సమష్టి సామాజిక చైతన్య లక్షణ లక్షిత. సరిగ్గా దాన్నే కవిత్వం కూడా సంతరించుకుంటుంది. అందువల్ల కవిత్వాన్ని గురించి విచారించడం మొదలు పెట్టామంటే, దాని ప్రాథమికమైన స్వరూప స్వభావాలకు సంబంధించిన సమష్టి సామాజిక చైతన్య మూలమైన సాంఘిక అస్తిత్వరూప ఆర్థిక, రాజకీయ వ్యవస్థల స్థితిగతుల దగ్గర మొదలు పెడుతున్నామన్నమాట.

సాహిత్యాన్ని సాహిత్యంగానే చూడాలనే వాదం

ఇలా మొదలు పెట్టడాన్ని పాతవాళ్ళెవరూ ఒప్పుకోరు. సాహిత్యాన్ని, సాహిత్యంగానే విమర్శించాలంటారు. ఉత్పత్తి స్థానాలతో సంబంధం కలిపి విచారించడం పద్ధతి కాదంటారు. కవిత్వం కవిత్వంలా ఉండాలి గానీ మరొకలాగా అది ఉండకూడదంటారు. కవిత్వాన్ని కవిత్వంగానే చూచి విమర్శించాలంటారు. ఇదంతా నిజమే. ఎప్పుడు నిజం? పదార్థ పరిశీలనలో, పరిశోధనలో విడివిడిగా దేనికది స్వయం సంపూర్ణమనుకునే అజ్ఞానమే విజ్ఞానంగా మనిషి ప్రవర్తించిన కాలంలో నిజం. అప్పుడు కవిత్వానికి మరొక దానితో సంబంధం లేదు. దాన్ని దానిగానే చూచేవాళ్ళు. అలాగే వ్యాకరణశాస్త్రం వేరు. తర్కశాస్త్రం వేరు. బాటనీ, జువాలజీలు వేరు వేరే. ఫిజిక్స్, కెమిస్ట్రీలు సరేసరి.

మరిప్పటి పరిస్థితి వేరు. విజ్ఞాన శాస్త్ర పరిశోధనలు రోజురోజుకూ అవన్నీ పరస్పర ప్రభావ ప్రసరణకు లోనవుతున్నాయని రుజువు పలుకుతున్నాయి. ఈ సంఘర్షణలో మేలుకలయికను సంతరించుకొన్నవి కొత్తరూపాలతో విజ్ఞాన రంగంలో అవతరిస్తున్నాయి. ప్రకృతి విజ్ఞాన శాస్త్రాలు ఈ విధంగా కొత్త కొత్త సత్యాలను కనుగొనడం వల్లనే భౌతిక తాత్విక దృక్పథం గతితార్కిక చారిత్రక భౌతిక తాత్వికతగా రూపొందింది. దాని నిరూపణకు నిలబడ్డవాడు మార్క్స్ గనుక అది ఆయన పేరు మీద మార్క్సిజంగా ప్రసిద్ధమైంది.

అంటే మార్క్సిజం దేన్ని మరొకదానితో సంబంధం లేని స్వతంత్ర ప్రతిపత్తితో ఉన్నట్లు అనుకోదు. కర్త, కర్మల సంబంధం క్రియాన్వయ సాపేక్షంగానే సార్థకంగా అవుతున్నట్లు చెబుతున్న వ్యాకరణ తత్వాన్ని జీవితానికి అన్వయించి వివేకాన్ని పెంచడంలో అందరికంటే మార్క్సిస్టులదే ముందడుగు. కర్మార్థాల విషయంలో క్రియాచరణశీలుడు కావడం వల్లనే మనిషి నిశ్చయజ్ఞానం పొందగలుగుతున్నాడు. పొందటమంటే

ఏమిటి? మరొకదాన్ని దేన్నో పొందగలగటమే కదా! దేన్ని గురించిన జ్ఞానమైనా మనిషికి తాను ప్రకృతి శక్తులతో కుస్తీలు పట్టడం వల్లనే కలుగుతుంది. మనిషి కర్త. ప్రకృతి శక్తులు కర్మార్థాలు.

వర్గ సమాజంలో జ్ఞానం, ఆచరణ విడిపోవడం

కానీ వర్గ సమాజంలో బౌద్ధిక శ్రమ తాను వేర్పడి, శారీరక శ్రమ ఫలితాలయిన కర్మలను తాను అనుభవించడానికి అలవాటుపడుతుంది. దీని ఫలితంగా రూపుగట్టుకున్నదే ఆనందానుభవం పరమాత్మదనీ, సుఖదుఃఖాలను ప్రసవించే కర్మ సంబంధం ఆయనకు లేదనీ, సుఖదుఃఖాలను అనుభవించడం అది జీవాత్మ ధర్మమని చెప్పే వేదాంతం.

బుద్ధి జీవులూ, శ్రమ జీవులూ – తెలిసి ఒకరు, తెలియకుండా ఒకరు – దోస్తూ, దోచుకోబడుతూ కలిసి బతుకున్న సమాజంలో సాంఘిక వాస్తవికత, జ్ఞానమూ, ఆచరణగా విడిపడి ఉన్నది. దాన్ని బట్టే చైతన్య పరిధుల్లో జీవాత్మ, పరమాత్మలు వేర్వేరుగా గుర్తింపబడుతున్నారు.

వాస్తవిక సాంఘిక జీవితానుభవాల నుండి సముత్పన్నాలయిన అన్ని విషయాల అవగాహనకూ, మొదట సాంఘిక వాస్తవిక అస్తిత్వం గురించిన వివేకం యొక్క ప్రాధాన్యాన్ని మార్క్సిజం గుర్తించింది. అలా ఉత్పన్నమైన విషయాలలో ముఖ్యమైంది తాత్విక దర్శనమే. అదే ప్రపంచ దృక్పథం. అందువల్ల మొదట దాన్ని సాంఘిక వాస్తవికతకు సంబంధించినదిగా విచారించడానికి మార్క్సిజం పూనుకున్నది.

సాంఘిక వాస్తవికత అన్నది ఆ సమాజంలోని మనుషుల భిన్నభిన్న జీవితాల యొక్క మొత్తంగా ఉంటుంది. అది అనేక రకాలయిన శీఘ్రగతి మార్పులకు లోనవుతూ ఉంటుంది. సమాజంలోని మానవ సంబంధాల లక్షణ జ్ఞానమే సామాజిక విజ్ఞానం. ఒకానొక నిర్దిష్ట యుగ రూపమైన కాల పరిమితుల్లో మానవ సంబంధాలను నిర్ణయించగల సాంఘిక అస్తిత్వ వివేకమూ, ఒక యుగం నుండి మరొక యుగానికి పోయేటప్పటికి ఆ సంబంధాలు మారడానికి వీరిచ్చిన అప్పటి సాంఘిక అస్తిత్వ పరిస్థితుల వివేకమూ కలిసి చారిత్రక భౌతికవాద సిద్ధాంతాన్ని చేస్తున్నాయి.

యాంత్రిక భౌతికవాదం, భావవాదం

యాంత్రిక భౌతికవాదంగానీ, భావవాదంగానీ ఒక్క తాత్విక దర్శనానికి మాత్రమే సంబంధించినవని అనుకోకూడదు. అవి శాస్త్ర విజ్ఞానంలోనూ ఉన్నాయి. మానవజాతి చరిత్రలోనూ ఉన్నాయి. వట్టి యాంత్రిక భౌతిక దృక్పథం గలిగిన మనోవైజ్ఞానికునకు కవిత్వమంతా అదొక రకమైన ప్రవర్తనా విధానంగా కనిపిస్తుంది. అదే విధంగా వచ్చిన తాత్వికునకు మానవ శరీరంలో విడిది చేసిన జీవాత్మునకు స్వభావసిద్ధంగా ఉన్న రసానుభవ గుణానికి విషయంగా కనిపిస్తుంది. భావవాద దృక్పథం కవిత్వానికి ఎంతో అనుకూలంగా ఉంటుంది. ఎందుకంటే భావవాదం చెప్పే సత్య, శివ, సుందర త్రయంతో కవిత్వాన్ని వ్యాఖ్యానించవచ్చు.

యాంత్రిక భౌతికవాద కళా దృక్పథం కర్తృర్థకమైన కళాకారుని సామాజిక జీవితంతో సంబంధాన్ని తెగదెంపులు చేసి, కళారూపాన్ని వట్టి కర్మార్థకంగా చూస్తుంది. అప్పుడు కళారూపమొక్కటే చూపుకు విషయమవుతుంది గనుక, అందువల్ల రూపరచనా శిల్పం గురించి మాత్రమే తెలియవస్తుంది గనుక, ఆ తెలిసినదాన్ని బట్టే కళా నిరూపణ సిద్ధాంతాన్ని తయారుచేస్తుంది. అందులో కళాకారుని ఉనికిని గమనింపవలసిన అవసరం లేని కళారూపంలో కనిపించే రచనా శిల్ప విశేషాలను వర్ణించటం తప్ప మరేమీ ఉండదు. ఇదే నిర్మాణ శిల్ప సిద్ధాంతం.

తాత్విక విచారణలో యాంత్రిక భౌతికవాదమెంతో, కావ్య కళా వివేక విచారణలో నిర్మాణ శిల్ప సిద్ధాంతమంత.

భావవాద కళా దృక్పథం కళారూపాన్ని ఆత్మాశ్రయంగా చూస్తుంది. అంటే అది కళాకారుని మనోభావ రూపమన్న మాట. అనుభవించేవాని విషయంలో కూడా అది అలాంటిదేనన్నమాట. తన చూపుకు ఆనినదాన్ని పట్టుకొని, దానిమీద కళా నిరూపణ సిద్ధాంతాన్ని తయారు చేయటానికి భావవాద దృక్పథం ప్రయత్నిస్తుంది. రసావేశ రూపాలయిన మనోభావాలు అవి స్వభావసిద్ధాలై ఉంటాయి గనుక, ఇక వాటిని గురించి విచారించటానికేముంటుంది? వాటి మంచిచెడ్డలు ఆత్మారాముని కి తెలుస్తూనే ఉన్నాయి. అందువల్ల ఏ రకమైన శిల్పకళా విశేషాలను గురించి ఎవరు విమర్శించినా అది వారి వైయక్తిక అనుభవ లక్షణం తప్ప మరేమీ కాదు. ఇదంతా రసభావావేశ సిద్ధాంతం.

ఈ విధంగా అటు యాంత్రిక భౌతికవాదమూ, ఇటు భావవాదమూ కూడా అశాస్త్రీయాలయిన ఆలోచనా ధోరణులతో తలక్రిందు సిద్ధాంతాలను సాహిత్య కళారంగాల్లో ప్రవర్తింపజేశాయి, చేస్తున్నాయి. ఈ రెండింటికీ తోడు ఇంకా అనేక రకాలయిన ఉదారవాదమనీ, 'కళ కళ కోసమే' అనీ చెప్పుకునే సిద్ధాంతాలు కూడా ఆధునిక సాహిత్య కళా విమర్శనా భూముల్లో ప్రవర్తిస్తున్నాయి. ఇంత కలగాపులగంగా సాహిత్య కళా విమర్శన రంగాలున్నాయంటే, మన ఆలోచనా విధానాన్నీ, అందుకు మూలమైన అస్తిత్వాన్ని పరీక్షించుకోవలసిన సమయం ఆసన్నమైనదనే అర్థం.

విమర్శ అంటే ఏమిటి?

సాహిత్య అధ్యయనంలో, ముఖ్యంగా కావ్య శిల్ప

కళాధ్యయనంలో మనం కేవలం నిర్మాణ శిల్ప సిద్ధాంతాన్నీ, రసభావావేశ సిద్ధాంతాన్ని రెండింటినీ కూడా ఆ విధంగా అంగీకరించం. మేము అంగీకరిస్తామని ఎవరైనా అంటే మనకు అభ్యంతరం లేదు. వాళ్ళు మేము కవులమనీ, సహృదయులమనీ, మరేమని అయినా అనుకోవచ్చు. విమర్శకులమని మాత్రం అనుకోకూడదు. ఆ పని చేయటానికి రాకూడదు. ఎందుకంటే అలా అనేవాళ్ళెప్పుడూ కావ్య కళా గర్భంలోనే కండ్లు మూసుకొన పుట్టని శిశుపిండాలుగా తిరుగుతుంటారు. కవైనా అంతే, సహృదయుడైనా అంతే.

ఆ దశలు దాటి బయటపడితే అప్పుడు కదా విమర్శనానికి అధ్యయనమూ, విమర్శనమూనూ! అప్పుడు కావ్య కళా శిల్ప ఖండాలను వెలుపలి నుండి చూడటానికి వీలవుతుంది. కావ్య కళా రూపాలకు వెలుపల ఏమున్నది? సామాజిక చైతన్యమున్నది. వెలుపల నుండి చూడటమంటే ఈ చైతన్యం నుండి చూడటం.

సామాజిక చైతన్యం ఒక్క కావ్య కళారూపాలనే ఉత్పత్తి చేస్తున్నదా? లేదే. ఆర్థిక రాజకీయాలనూ, మత తాత్వికతలనూ, చరిత్రనూ, విజ్ఞాన శాస్త్రాలనూ ఆ చైతన్యమే సముత్పాదిస్తున్నది. సామాజిక చైతన్యమన్నది ఆ రూపాల ద్వారా మాత్రమే గ్రహించటానికి వీలుగా ఉంటుంది. మరో రకంగా ఉండదు. అందువల్ల కావ్య శిల్ప కళారూపాల విమర్శనకు తదితర సామాజిక చైతన్య రూపాల సంబంధ విజ్ఞానం అనివార్యమైన అవసరమే. అలాగని ఆయా ఇతర విషయాలను తెచ్చి కావ్య కళా విషయాలను కప్పి వేయకూడదు. ఆ అవసరాన్ని గుర్తించి, అనుగుణంగా ప్రవర్తించే అచ్చమైన స్వాతంత్ర్యాన్ని విమర్శకుడు తనంతట తాను సంపాదించుకోవాలి. అది ఒకరిస్తే మరొకరు తీసుకోవటానికి వీలైంది కాదు. అలా వ్యక్తులు స్వతంత్రంగా స్వాతంత్ర్యాన్ని సంపాదించుకోవటానికి అవకాశమిచ్చే విజ్ఞానం చారిత్రక భౌతిక దర్శనం.

సామాజిక చైతన్య రూపాలు ఒక దానిమీద మరొక దాని ప్రభావాన్ని ఎలా ప్రసరింపచేసుకుంటాయో, ఆ చైతన్య రూపాల మొత్తం మీద సాంఘిక వాస్తవ జీవన అస్తిత్వ ప్రభావం ఎలా పడుతున్నదో, ఆ ఉపరితలం మీద ఈ పునాది నిర్మాణ ప్రభావం పడ్డట్లే, ఉపరితల చైతన్య ప్రభావం పునాది మీద కూడా ఎలా పడి మార్పుకు కారణమౌతున్నదో మనకు స్పష్టంగా గతితార్కిక చారిత్రక భౌతికవాద వివేకం విశదపరుస్తుంది. అందువల్ల దాని సిద్ధాంత బలం మీదనే మనం చైతన్య కళారూపాలన్నింటినీ సాంఘిక అస్తిత్వ సంబంధంతో విచారించాలి.

అది నిజమే అయినా అన్నీ చేయలేం గనుక, చేతనైన దొక్కటే చేస్తే చాలు. కవితా కళా తత్వం గురించి అలా శాస్త్రీయమైన విచారణ చేద్దాం. ఎందుకంటే అది ఎంతో ప్రాచీనమైన గొప్ప చరిత్ర కలిగింది. అదెందుకో చచ్చుబడ్డ దానివలె ఈ కాలంలో చాలా వెనుకబడిపోతున్నది. అది అనేక రకాల మార్పులకు లోనవుతూ ఉన్నది. ఈ మార్పులన్నీ కవిత్వ కళ యొక్క ప్రాచీన చరిత్ర గౌరవ మర్యాదలకు వ్యతిరేకంగా పోతున్నట్లు, అనేక సమస్యలను సృష్టిస్తున్నట్లు, అభివృద్ధి లక్షణానికి, అభివృద్ధి లక్షణం కాని దానికి భేదమే లేకుండా పోతున్నట్లూ, కవిత్వ కళాకారుల్లోనూ, విమర్శకుల్లోనూ, విద్వాంసుల్లోనూ కనిపించే అలజడి తొలగటానికి కావలసిన అవగాహన నిమిత్తం కవితా కళా తత్వం గురించి చారిత్రక భౌతిక దృక్పథంతో కొంత విచారణ చేద్దాం.

కవిత్వం - సమాజం

కవిత్వమంతా భాషామయం. భాష సమూహం నుంచి, సంఘం ద్వారా ఉనికిలోకి వచ్చింది. కవిత్వానికి భాష, భాషకు సమాజం మూలాధారాలు. అంటే కవిత్వానికి సమాజం మూలాధారమౌతోంది. కాబట్టి కవిత్వం అర్థం కావాలంటే దాని పుట్టుకకు మూలమైన సమాజం అర్థం కావాలి. అసలా రెండూ రెండన్న చూపుతో చూడదగ్గవి కావు.

కానీ కావ్య విమర్శనమన్నప్పుడు సాధారణంగా మూలాధార తత్వ విచారంతో దానికి సంబంధం లేదనుకోవడమే మనకు అలవాటు. కావ్యం అంటే కావ్యమే తప్ప మరేమీ కాదు. దానికి సమాజంతో పనిలేదు. ఆ ఆలోచనే అనవసరం. అనవసరమే కాదు – అసందర్భం కూడాను అని మనలో కొందరు భావించేవాళ్ళున్నారు. వాళ్ళు కేవలం కావ్యరసాన్ని మాత్రమే ప్రశంసించదల్చినవాళ్ళు. అంత వరకు బాగానే ఉంది. కానీ వాళ్ళు కావ్యార్థ వివేచన రూపంతో విమర్శ మొదలు పెట్టినప్పుడు తమ తలంపును మరచి, కావ్య కళా భూములకు చెందని చారిత్రక విషయాల్ని, మనస్తత్వశాస్త్ర విషయాల్ని, కవి జీవించినప్పటి బ్రదుకు తెరువుల విషయాల్ని, మొదలైన అనేక విషయాల్ని స్పృశిస్తూ, మధ్య మధ్య ఏమేమో విచారిస్తారు. ఇది మన నిత్యానుభవంలోని విషయమే. వాళ్లు తాము స్పృశించిన వాటి ఉచితానుచితాలను సమన్వయం చేసి సమర్థించుకొని పోవడం అవసరం అని కూడా అనుకోరు.

అలాంటి వట్టి కావ్యరసవాదులు విమర్శకులే కారు గనుక, వాళ్లను మనమంతగా నిలదీయనక్కర్లేదు. కేవలం కావ్యరసవాదులు అనలు కావ్య విమర్శకులు కారు. కావ్యరసాస్వాదనంలో మాత్రమే మునిగే చిత్తం వాళ్లది. వాళ్లు కవులు కావచ్చును. ఇంకా పోతే సహృదయులూ కావచ్చును.

కావ్య నిర్మాణ దశా, కావ్య రసాస్వాదన దశా అనే రెండింటినీ దాటాక, ఆ మీది దశ విమర్శనా రంగం. అందులోకి ప్రవేశించిన కవి కవి కాడు. సహృదయుడు సహృదయుడు కాడు. అతడు విమర్శకుడు మాత్రమే అవుతాడు.

కళాఖండంలోపల ఉండడం విమర్శకు పనికిరాదు. లోపల

నుండి బైటకు రావాలి. అనుభవానికి లోపల, విచారణకు బైటా. సంఘ చైతన్యం యొక్క ఉత్పాదక శక్తి కళాఖండాల్ని ఉత్పాదిస్తున్నది. కవిత్వం అట్లా ఉద్భవించింది. కవిత్వానికి బైట నిలబడ్డం అంటే సంఘ చైతన్యంలోకి రావడం (1). కళాఖండం యొక్క వెలుపల ఎప్పుడూ సంఘ చైతన్యం లోపలనే ఉంటుంది.

ఇహ ఇప్పుడు విమర్శ అన్నది వట్టి రసాస్వాదనతో ఎలా భిన్నమైందో మనకు తెలిసి ఉండాలి. కవిత్వంలాగానే విమర్శ కూడా సంఘ చైతన్యంలో నుండి పుట్టింది. కవిత్వం – విమర్శ – సమాజం – ఇదొక త్రిపుటి. సమాజం నానావిధాలు, దాని ఉత్పాదక శక్తి నానావిధాలు, అందులోని ఉత్పత్తులున్ను నానావిధాలు. అంటే ప్రపంచం నానావిధాలు. ఈ విధంగా సమాజంతో కవిత్వం ముడిపడి ఉంది. ఈ రెంటినీ సమన్వయించుకొని చేసే అధ్యయనమే అధ్యయనం. కళల, కళా విమర్శనల మర్యాదలను ప్రకాశింపజేయడానికి సాంఘిక శాస్త్రాభ్యుదయ విజ్ఞానం అధికంగా దోహదం చేస్తుంది.

ఆదిమ సమాజంలో కవిత్వం

మానవజాతి యొక్క అతి ప్రాచీనమైన రసానుభవ వ్యాపారాల్లో కవిత్వ రచన ఒకటి. ఆదిమ మానవ సమాజంలో కవిత్వానికి వేరే ఉనికి (పృథగస్తిత్వం) లేదు. ఆనాడు అదొక్కటే ఉందనడం ఇంకా ఎక్కువ సమంజసం. ఆనాడు మత, చారిత్రక, ధర్మ విషయాలన్నింటికీ అదే వాహిక. అది ఆనాడు లిపి రూపాన్ని పొందలేదు. ఒక ఛందస్సు, ఒక లయ కలిగి ఉంటూ సమాజ జిహ్వించలాలపై ఉండేది అది.

మన భారతీయ వేద వాఙ్మయమంతా చరిత్రకు అందని రోజులనాటి మన పూర్వ సమాజం సముత్పాదించిన కవితా వస్తు సంభారమే. అది ఛందోలయలతో కూడి ఉండడం మూలాన కవిత్వమే అవుతోంది. ఇట్లాగే గ్రీకు, స్కాండినేవియన్, ఆంగ్లో సాక్సన్, రోమన్, చైనా, జపాన్, ఈజిప్టు మొదలైన జాతులు సంరక్షించుకొన్న వారి ప్రాచీన వాఙ్మయాన్ని చూస్తే, అది మన వేద వాఙ్మయంలాగానే ఛందోబద్ధం, లయాన్వితం అయి, బహుళార్థ విషయ వాహకంగా ఉండడం గమనించవచ్చును.

అట్లా ఛందోబద్ధం, లయాన్వితమూ అయిన దానిని మనం కవిత్వం అంటున్నాం. ఆనాటి వాళ్లు దాన్ని ఏమనుకొన్నారో మనకు తెలియదు. అది నిత్య వ్యవహారంలో ఉపయోగించే భాషకంటే ఉదాత్త గంభీరమైన భాష అక్కడ ఉండటం చేతనే దాన్ని మనం కవిత్వం అంటున్నాము (2). అయితే ఆ భాష (ఉక్తి) అట్లా ఉదాత్త గంభీరంగా ఎట్లా తయారైంది? ఛందోబద్ధత వల్ల అట్లా తయారైందా? అవును. ఛందస్సు చేత, దానితో వచ్చిన లయ తాళ గతిచేత, యమకాది శబ్దాలంకారాలకు తావివ్వడం చేత, పాద మాత్రల నియమంచేత, యతి ప్రాసల లాంటి ప్రత్యేకమైన లక్షణాలను అనుసరించడం చేత అందులోని భాష ఉదాత్త గంభీరంగా రూపొందింది. అందువల్లే ఆ భాష నిత్య వ్యవహారం నుండి భిన్నమయింది. భిన్నమయ్యింది కనుకే నిత్య వ్యవహారంలోని దానికంటే దానికి సహృదయ హృదయాకర్షక శక్తి ఇబ్బడి ముబ్బడిగా ఉంది.

మొట్టమొదట ఛందోలంకారాలకూ, కవిత్వానికీ ఎలాంటి విడదీయరాని సంబంధం ఉండేదో ఇప్పుడిక ఆలోచించాలి. ఛందోబద్ధంగా ఉండడమే అది కవిత్వంగా గుర్తింపబడ్డానికి హేతువు. ప్రపంచంలోని ప్రాచీన వాఙ్మయాలన్నీ కవితామయాలే. అంటే ఛందోమయాలన్న మాట. మన వాఙ్మయం సంగతి మనకు తెలుసు. ఈజిప్టులో ప్రాచీన ఖగోళ శాస్త్ర విజ్ఞానం ఛందోబద్ధమయి ఉంది.

ప్రపంచంలోని మతాలన్నీ తమ తమ అవసరాలకు లయ తాళ గతి ఉన్న భాషనే వాడుకొన్నవి. అన్ని మతాలూ భక్తిభావ ప్రచార ప్రబోధాల్ని లయాన్విత భాష ద్వారానే చేసినవి. ఉదాత్త గంభీరమైన ఆ భాష ప్రాచీన ప్రపంచ జాతుల సంస్కృతీ సంప్రదాయాల్ని నిలబెట్టే భారం వహించింది. ఛందస్సు వల్లే అది ఆ పని చేయగల్గింది. అది నిత్య వ్యవహారంలో అందని అందాలున్న భాష. అలాంటి భాషామయత్వం వల్ల అది కవిత్వం.

లయ తాళ గతి సాధించడంవల్ల కదా భాషను మనం ఉదాత్త గంభీరం చేస్తున్నది. సంగీత నృత్యాలకు లయ తాళ గతులు సంబంధించినవి. మరి ఇంతవరకేమో అవి కవిత్వ భాషకు సంబంధించి ఉన్నట్లు మాట్లాడుతున్నాము. భాషను విడిచిపెట్టిన సంగీత నృత్యాలు లేవు. అవన్నీ కవిత్వం లాగానే భాషామయాలు.

కవిత్వం, సంగీతం, నృత్యం - ఏకరూపత

కవిత్వ, సంగీత, నృత్యాలకు లయ తాళ గతులు ప్రాణాలు. ఇవన్నీ భాషామయాలు. భాషను ఉదాత్త గంభీరంగా చేయడం – ఆ ఉదాత్తత ఉట్టి పడేటట్లుగా చదవడం – వాటిని ప్రత్యక్షంగా కల్పించడం అనే ఈ వరుసలో కవిత్వం – సంగీతం – నృత్యం అనే మూడున్నూ ఆదిమ మానవ సమాజంలో ఏకరూపంగా కలిసే సాగినట్లు కనిపిస్తున్నవి. అసలు అవి కలిసి ఏకరూపంలోనే పుట్టినవి.

ఆదిమ మానవ సమాజంలో ఉచ్చై స్వరంతో గొంతెత్తడం, చిందులు, మధ్య మధ్య ఈలలు వేసి పొలికేకలు పెట్టడం, కర్రసాము, కత్తిసాముల ప్రదర్శనలలో చప్పుళ్లు చేయడం – ఇవన్నీ వారి కవితా సంగీత నృత్య ప్రదర్శనాలే. మానవ సమాజ ప్రాథమిక దశలో సంగీత నృత్యాలతో సంబంధించే కవిత్వ భాష ఉంది. ఆ కాలంలో ముఖ్యంగా కవిత్వమూ, సంగీతమూ రెండుగా లేవు. వీటి ఏకరూపత్వం గ్రీకు కావ్య ప్రక్రియల్లో

చూడవచ్చు. ప్రాచీన గ్రీకు కవిత్వం సంగీతంతో ముడిపడి ఉంది. ఆనాడు వాద్య సంగీతం లేనే లేదు. అంతా శాబ్దికమే. సంగీతం కోసమని చెప్పి కవిత్వం కూర్చిన కాలం అది.

దీనినంతా బట్టి మనం గ్రహించాల్సిందిది. ఆదిమ సమాజంలోని ఉదాత్త గంభీరమైన ఒక రకం భాష నుండి క్రమంగా అభ్యుదయ పరిణామాల్ని చెంది చెంది, నాగరికత వెలసిన సమాజంలో లిఖిత వాఙ్మయం వెలుగులోకి వచ్చింది. ఆయా జాతి జనులు నాగరికులయి, కావ్య తత్వజ్ఞత్వాన్ని పెంచుకొని, క్రమంగా ఆ ఉదాత్త గంభీర ముద్ర ఉన్న భాషలోని విశేషాల్ని తెలిసికొని, తర్వాత దానిని దేనికి బడితే దానికి వాడకుండా ప్రత్యేక శ్రద్ధతో కాపాడుకుంటూ దాన్ని ఒక్క కవిత్వానికే ఉపయోగిస్తారు.

ఆయా యుగాల్లో ఆ భాష సామాన్య జనుల నిత్య వ్యవహార భాషకు అతీతంగా ఉంటుంది. ఆదిమ మానవ సమాజంలో బహుళార్థ సాధకంగా ఉపయోగపడిన గంభీరోదాత్తమయిన భాష క్రమంగా నాగరికత పెరిగిన యుగాలలో ఒక్క కవిత్వ భాషగా మాత్రమే నిలిచిపోతున్నది. అంటే నాగరిక యుగంలో ఛందోబద్ధత్వం కవితా లక్షణం అని స్పష్టపడుతోంది. ఇలా నాగరికత ముందుకు సాగిపోతున్న కొద్దీ ఈ ఛందోబద్ధమైన గంభీరోదాత్త భాష పది పనులకు పనికిరాక, ఒక్క కవిత్వానికే వాడబడుతూ సంకుచిత ప్రయోజనం ఉన్నది మాత్రమే అవుతుంది.

కవిత్వం - సామూహిక శక్తి

ఆది పుట్టిన దేశకాలాల సాంఘిక వ్యవస్థ నుండి కవిత్వాన్ని వేరు చేయడానికి వీలు లేదు. సాంఘికమైన నాగరికత దాని ఆర్థిక ఉత్పత్తి శక్తిని బట్టి ఉంటుంది. కాబట్టి కవిత్వం కూడా ఒక రకపు సాంఘిక ఆర్థిక సంపద కావాలి. అది సమాజం పొత్తు.

ఆదిమ మానవ సమాజంలో మానవులు గుంపులు కట్టి జీవిస్తూ, వారివారి లింగ, వయో భేదాలకు అనుగుణమైన సాంఘిక క్రియాకలాపాల్లో పాల్గొన్నారు. అప్పుడు ఒక్కొక్క వయస్సులో ఉండే స్త్రీ పురుషుల సాంఘిక క్రియాకలాపాల్లో భేదం అంత పెద్దగా ఉండేది కాదు. అందువల్ల వారివారి నిత్య వ్యవహారాల్లోని భాష, కవిత్వ రచనా పటువైన బుద్ధి, ఆనందించే అనుభవ శక్తి ఈ మొదలైనవన్నీ అలాగే భేదం లేక ఉండేవి. కాబట్టి ఆనాడు కవిత్వం ఎట్లా తన ఉత్పత్తి విషయంలో సమాజపరమో, అనుభవం విషయంలో కూడా అట్లాగే సమాజపరం.

గుణ కర్మ విభాగం (క్రమ విభజన) ఏర్పడ్డాక వ్యక్తుల మధ్య ఆర్థికమైన హెచ్చుతగ్గులేర్పడ్డవి. ఆ హెచ్చు తగ్గుల్ని బట్టే వాళ్లవాళ్ల వ్యక్తిత్వాల్లో తారతమ్యం చోటు చేసుకొంది. ఆదిమ మానవ సమాజంలో ఇట్లాంటి తారతమ్యం లేదు. వాళ్ల వ్యక్తిత్వం వాళ్ల ఒడ్డు పొడుగులకు మాత్రమే సంబంధించింది ఆనాడు. అది వర్గ రహిత సమాజం కావడం చేత సామాజికులందరూ కూడా సాంఘిక క్రియాకలాపాల్లోలాగానే ఆలోచనా క్రియాకలాపాల్లో కూడా సమానంగానే పాల్గొనే వాళ్లు. వాళ్లకు ఆలోచనల్లోనూ, అనుభూతుల్లోనూ కర్మల్లోలాగే సామ్యం ఎక్కువ.

అలాంటి సంఘంలో వాళ్ళు – పదికాలాలపాటు నిలబెట్టుకోదల్చిన సామూహికమైన విజ్ఞానాన్నీ, అనుభూతుల్నీ గంభీరోదాత్తమైన భాషలోనే వ్యక్తీకరించారు. ఆ విధంగా మొదట కవిత్వం నాగరికత వల్ల వర్గ భేదానికి గురికాని సంఘ సామూహిక శక్తి గర్భం నుండి సముత్పాదితమయింది. గంభీరోదాత్త భాషలో అయింది.

అలాంటి భాష యుగాల మీద సాగి, క్రమంగా పల్చబడి చరిత్రగా, వేదాంత శాస్త్రంగా, ధర్మశాస్త్రంగా, భౌతిక శాస్త్రంగా, ఖగోళ శాస్త్రంగా అనేక విధాలుగా ఇలా విడిపోతుంది. ఇలా విడిపోయిన ఆయా విజ్ఞాన శాఖలు తమ అవసరాల్ని బట్టి కొత్త పదజాలాన్ని సృష్టించుకొంటాయి. అలా సృష్టించుకొన్న పద సముదాయంతో ఉండే భాష నిత్య వ్యవహార భాషలాగా ఉండదు.

ఛందస్సు ఎందుకు?

ఇంతవరకూ గంభీరోదాత్తమైన భాష అని మనం అనుకొంటున్నది ఛందోగతి విశేషంతో ఉంటుంది. సహజంగానే నిత్య వ్యవహారంలోని భాషకు లయ తాళ గతి ప్రత్యేకంగా ఉండదు. కవిత్వంలో అది ప్రత్యేకంగా ఆపాదితమౌతుంది. అలా ఎందుకు ఆపాదితమవ్వాలి? ఛందోలంకారాల వల్ల భాష వికృతమవుతుంది. సహజ సౌందర్యం పోతుంది. ప్రతిబంధకాలు లేని వ్యవహార భాషకంటే కృత్రిమమయిన కవిత్వ భాష తేజోహీనంగా కన్పిస్తుంది. అయినప్పుడు భాషను ఛందోమయం ఎందుకు చేయాలి? ఇట్లా ఆలోచించడంలోనూ తప్పు లేదు.

దీనికో రకమైన సమాధానం ఉంది. ఒక విషయాన్ని సులభంగా జ్ఞాపకం పెట్టుకోవడానికి ఛందస్సు సమకూర్చే లయ సాయపడుతుంది. ప్రాచీన భారతీయ విజ్ఞానమంతా కూడా లిఖిత రూపాన్ని పొందకుండానే విద్వాంసులు జిహ్వాంచలాల మీద కొన్ని వేల సంవత్సరాలు పొల్లు పోకుండా నిలబడి రావడానికి, ఆ విజ్ఞానానికి వాహకమైన భాష ఛందోమయమయ్యి లయ తాళ గతులు కలది కావడమే హేతువు. అంతేకాకుండా శ్రోతల చిత్తాన్ని ఏకాగ్రంగా ఉంచడానికిన్నీ భాషలోని లయ తాళ గతి లక్షణం ఎక్కువగా దోహదం చేస్తుందనడం కూడా సత్యమే.

అన్నింటి కంటే ముఖ్యమైన మాట – ప్రాచీన కవిత్వాలు చావకుండా ఇంతకాలం బతికి బట్టగట్టి మన దాకా

వచ్చినవంటే, అందుకు ప్రధాన కారణం ఆ గంభీరోదాత్తమైన లయ తాళ గతి కల భాష దానికి వాహకం కావడమే.

కవిత్వం - నవల

మనం ముఖ్యంగా గమనించాల్సిన అంశం ఇంకోటి ఉంది. ప్రతి యుగంలోనూ సాధారణంగా పరిపూర్ణ పక్వబుద్ధులు కాని వారే గొప్ప కవిత్వాన్ని సృష్టిస్తున్నారు. వివిధ సాహిత్య ప్రక్రియల్లో పనిచేస్తున్నారు. కవిత్వం మానవుని సహజాతమైన వైయక్తికత్వాన్ని విలక్షణంగా ప్రకటిస్తుంది. దీనికి నవల భిన్నమైంది. మానవుని సాంఘిక వ్యక్తిగా, అంటే సంఘం ఎట్లా గుర్తిస్తుందో అట్లా ప్రకటిస్తుంది.

వర్గ సమాజంలో ఆర్థిక తారతమ్యాల మూలంగా వ్యక్తుల అంతస్తులు గుర్తింపబడ్డాయి. అట్లాంటి సంఘంలో కవిత్వం వెనుకబడి నవల ముందుకు వస్తుంది. అందువల్లే ఈ కాలంలో కవిత్వాభిమానం దిగనాసిల్లిపోతోంది. నవలా రచన పుంజుకుంటోంది. కవిత్వం సహజ ప్రకృతిక సమాజ శక్తి తేజో గర్భం నుండి వెలువడింది. నసి చెడిన ఆధునిక సంస్కృతీ సంప్రదాయాల సమాజపు సంతానం నవల (3).

ఆదిమ మానవ సమాజంలోని గంభీరోదాత్తమైన కవిత్వ భాష కాలక్రమాన వికార పరిణామాలకు లోనయి, చివర చివరకు వట్టి వచనరీతి భాషగా అయి చరిత్ర, తత్వశాస్త్రం, కథ, నాటకం, నవల ఈ విధంగా సాహిత్యం తయారైంది. ఆదిమ మానవ సమాజంలో లయ తాళ గతి కలిగిన గంభీరోదాత్త భాష ఒక్కటే అన్నింటికీ వాహకమైనట్లు, శ్రమ పరిణతి చెందిన నాగరిక సమాజం పండిన దశలో అన్నింటికి వక్రగతి లేని అచ్చమైన వ్యావహారిక గంధంతో ఉండే వచనం వాహకమౌతుంది. ఇది శాస్త్రీయ దృక్పథాన్ని పెంచుకొన్నది. ఆవేశపుటార్భాటపు పొంగులు లేనిది.

ఆదిమ మానవ సమాజంలో భావోద్వృత్తి కవిత్వ హేతువు. ఆధునిక సమాజంలో వాస్తవికత తీరుతెన్నుల్ని అవగాహన చేసుకోవడం కవిత్వ హేతువు. దీనికి రాగతాళ లయాన్వితమైన భాష అక్కరలేదు. ఆవేశాట్టహాసపుటూపుతో సంఘాన్ని ఊపడానికి, పూనకం తెప్పించడానికి అలాంటి భాష కావాలి. విషయాన్ని అవగాహన చేయించాలంటే శ్రోతల్ని ప్రబోధించాలి. కార్యోన్ముఖుల్ని చేసి ప్రోత్సహించాలి. లాభనష్టాల్ని బేరీజు వేసి చెప్పాలి. అందువల్ల ఆధునిక సమాజంలో కవిత్వ భాష ఆదిమ సమాజం కన్నా విభిన్నమైంది. అది ఛందస్సుతో పద్యం. ఇది ముక్తఛందమైన వచనం.

దైనందిన సామాజిక వ్యవహారంలో శబ్దాలకు ఉండే భావ తీవ్రతా భివ్యక్తి లక్షణం మానవానుభవంలో ఉంది. అవసరం వచ్చిందన్నపుడు అనుభవాన్ని బట్టి మానవుడు అలాంటి అభివ్యక్తి శక్తి ఉన్న శబ్దాలను ఎన్నిక చేసి, తాళలయానుబద్ధంగా వాటినొక క్రమంలో కూర్చి, చదవగల్గిన వాళ్ళు దాన్ని చదవడం చేత శ్రోతలు ఆ భావ తీవ్రతను అనుభవించేటట్లు చేస్తున్నాడు. దానికే సంగీతమూ, నృత్యమూ జోడించినప్పుడు దాని దీప్తి ఇంకా అధికమౌతుంది. ఈ విధంగా మొట్టమొదట కవిత్వాన్ని ఛందోబద్ధమైన లయ తాళ గతులతో కూడుకున్న భాష నిలబెట్టింది. సామూహిక భావావేశాన్ని కవితాకళ సక్రమ మార్గంలో నడిపించింది. పండగల్ని, పబ్బాల్నీ కేంద్రంగా చేసింది. కాకుంటే అవే ఆదిమ సమాజంలో కవిత్వాన్ని తయారు చేసినవని చెప్పినా చెప్పవచ్చును.

పాటగా కవిత్వం

ఆదిమ మానవ సమాజ కవిత్వం ముఖ్యంగా పాట (4). అది దాని రాగ తాళ లయలతో సమూహం మీద సమాజాన్ని భావోద్వృత్తి చైతన్యం కలదాన్నిగా చేసేది. ఆ భాషలోని రహస్యమే అది. ఆ విధంగా అది తప్పెట్లతో, తాళాలతో పండుగలు, పబ్బాలు నడుమ నడుమ తెచ్చే సమధికోత్సాహంతో పాటలుగా, పదాలుగా, సంగీతంగా, నృత్యంగా వందలు, వేలు సంవత్సరాలు సాగింది.

ఆదిమ సమాజంలో సమూహం మీద భావోద్వృత్తి చైతన్యం ఎట్లా కల్గింది? ఎట్లా అంటే – పెద్దపులి కన్పించింది. శత్రువు వచ్చాడు. గాలి, గాలివాన ఈడ్చి కొట్టినవి. భూమి కంపించింది. ఈ అన్నింటికీ ఆయా గుంపులు కట్టిన జనసమూహం గుంపులు గుంపులుగానే భయపడ్డారు. ఆ భయం ఆ గుంపుకంతా సమానమే. నాగరికత పెరిగిన సామాజిక జీవితంలో అలాంటి భయహేతువులు లేనప్పుడు దానిని కల్పించడానికి ఒక సాధనం ఉండాలి. ఆదిమ మానవుని సమాజపు నిత్యజీవిత సత్యం నుంచి కవిత్వం పుట్టింది. నాగరికత పెరుగుతూ సమాజాన్ని సత్యం నుండి మిథ్యా భూములు పట్టిస్తుంది. సమాజాన్ని బట్టి దాని ఉత్పాదన శక్తి. దానిని బట్టి కవిత్వం, మొత్తం ఆ విధంగానే ఉంటుంది.

ఆదిమ మానవ సమాజం సామూహిక భావోద్వృత్తులు గంభీరమైన భాషలో వ్యక్తమై కవిత్వంగా మార్పు చెందినవి. దానివల్ల ఆనాడు వాళ్ళకు వాళ్ళ పనిపాటలు ప్రీతిపాత్రాలయ్యాయి. శ్రమ అనిపించక వారి మనస్సులు ఆనందించాయి. ఆ విధంగా కవిత్వం ఆనాడు ఆ సమాజపు కార్మికశక్తిని ఇనుమడింపచేసింది. అది సామూహిక ప్రయోజనం కనుక, ఆ కవిత్వం సామూహిక భావోద్వృత్తుల్నే తనకు విషయాలుగా చేసికొంది. కామక్రోధాది భావావేశ ప్రవృత్తుల్ని సమాజానికి శ్రేయోదాయకాలుగా చేసి కవిత్వం చూపింది. దాని ప్రయోజనం అది. పరంపరగా అట్లా కవిత్వం సమాజం యొక్క ఆర్థిక స్థోమతను పెంచే సాధనమౌతుంది.

శ్రమ విభజన - కవిత్వం దూరం కావడం

శ్రమ విభజన ఎక్కువౌతున్న కొద్దీ కవిత్వం వాస్తవ జీవితం నుంచి దూరమౌతున్నది. వాస్తవ జీవితం పట్టి పని పాటలతో నిండి ఉంటుంది. అప్పుడు కవిత్వానికి పనిపాటలతో సంబంధం ఉండదు. అది జీవిత విశ్రాంతి కాలంతో సంబంధం పెట్టుకొంటుంది. అలాంటి సమాజంలో కవి సామాజికుడు కాదు. ఏకాకి. ఆ ఒంటరితనంలో అతడు రాసే కవిత్వం భావ గీతాల వరకే.

మితిమీరిన శ్రమ విభజన పద్ధతి సమాజానికి సోమరితనాన్ని అలవాటు చేస్తుంది. సోమరిపోతులు బ్రతుకుతున్న సమాజంలో ఉత్పత్తి అవుతున్న కవిత్వం శ్రమజీవనానికి దూరమైంది. అది అట్లా కావడంవల్ల అటు కవితా కళకూ, ఇటు శ్రమజీవనానికి రెండింటికీ నష్టమే. కాని ఇక్కడో చిత్రం ఉంది. అట్లా కవిత్వం సాంఘిక ప్రయోజన శూన్యమై నష్టపోయే కాలంలో దాని రచనా శిల్పం మాత్రం చిత్రాద్భుతాపాదకమయ్యి, అపూర్వ శోభతో మనోజ్ఞమవుతుంది.

సమూహం మీద అనుభవించిన భావోద్వత్తులు ఒంటరితనంలో మానవుని విడిచిపెట్టక అంటిపెట్టుకునే ఉంటాయి. అందువల్ల ఏకాంతంలో భావగీతాలు ఆలపిస్తున్న కవి ఎప్పుడో తాను అనుభవించిన సమ సమాజం యొక్క అనుభూతుల్నే నెమరువేస్తున్నాడనుకోవాలి. ఆ విధంగా కవి తన సోదర జనసమాజం నుంచి కళా ప్రపంచం యొక్క ఏకాంత భూముల్ని ప్రవేశించటం, ఇంతకు ముందుకంటే తన జాతి జనులతో ఇంకా ఎక్కువ సన్నిహితంగా ఉండాలని కోరే చేస్తాడు.

రతి విషయం, ఋతు శోభ, సూర్య చంద్రోదయాస్తమయాదులు, కోకిల పాటలు, మందమారుతం, కొలనులు, పద్మాలు, తుమ్మెదలు మొదలైన వాటికన్నింటికీ సంబంధించినట్టి సమ సమాజం యొక్క అనుభూతులు, తరతరాలుగా అనుభవింపబడుతూ ఆ చారిత్రక భావోద్వత్తుల యొక్క ఇప్పటి మన ఛాయానుభూతుల్ని ఇంకా ప్రేరేపిస్తున్నవి.

వర్గ సమాజంలో కవిత్వం

శ్రమ విభజన ఫలితంగా సమాజం వర్గాలుగా, వర్ణాలుగా విడిపోయింది. పాలకులు – పాలితులు అనే రెండు వర్గాలు మొట్టమొదట ఏర్పడ్డవి. వీటితోపాటు కీలక స్థానాన్ని ఆక్రమిస్తూ పురోహిత వర్గం లేస్తుంది. ఈ సమాజంలో కవిత్వం రాజుల్నీ, దేవతల్నీ, దైవాంశ సంభూతుల్నీ, అవతార పురుషుల్ని ఆశ్రయిస్తుంది. ఇదే పురాణేతిహాసాల రచన జరిగే కాలం. ఆ ప్రభావంతో కొన్ని వందల సంవత్సరాలు సాగుతవి, అనేక విధాలైన మార్పులు వస్తవి. అలా అది భావగీతాల వరకు వస్తుంది. ఆ భావగీతం ఆదిమ మానవ సమాజంలోని కవిత్వానికి భిన్నమైంది. అదేమో సాంఘికుల యొక్క సాధారణ భావాభివ్యక్తి, ఇదేమో వైయక్తిక భావాభివ్యక్తి.

సంఘంలోని సామూహిక భావోద్వత్తే ప్రపంచం. కళా ప్రపంచంలో భావోద్వత్తి శబ్ద చిత్రాలతో ఉంటుంది. ఆ శబ్ద చిత్రాలు నిత్యజీవిత అనుభవంచేత కల్గుతవి. ఆ అనుభవాలు సర్వసాధారణాలు. అనేక రకాల అనుభవాలు కలవడం అనేది సంఘ జీవిత విధానం విస్తరించడాన్ని బట్టే జరుగుతుంది. సంఘ జీవన అభ్యున్నతిని అనుసరిస్తూ సర్వసాధారణంగా ఉన్న భావోద్వత్తులు మారుతవి.

మానవుడు తాను ప్రకృతి మార్పులతో సర్దుకొని పోవడానికి సాంఘికంగా తనని తాను మార్చుకొంటాడు. పరిసర ప్రకృతి వాతావరణంతో ఇమిడి బ్రతకడానికి తాను కొట్టుమిట్టాడుతున్నప్పుడు మానవుని కవితావేశం అతని బ్రతుకు తెరువుని అంటిపెట్టుకొనే ఉంటుంది. అలా ఉండే కాలంలో కవిత మానవుని ఇహలోక కవాటాన్ని బద్దలుకొట్టి ప్రవేశిస్తున్నది. ఆ లోకం దినదిన గండమైన ఈ లోకం కంటే శ్రేష్టమైంది. ఇంతకంటే కూడా ఇంకా సత్యమైంది. నిజానికి దాని సంగతి మనకు తెలియదు. తెలిసికోవడానికి ఈ మాయా మోహనమైన కవిత్వమే ద్వారం. దీని ద్వారా ప్రవేశిస్తేనే ఆ సత్యం దర్శనీయమౌతుంది.

ఆటపాటల్లో అందులోని శ్రమానుభవాన్ని కప్పిపుచ్చకపోతే అసలు ఆ కోత పనులకు, నాట్ల పనులకూ జనం మొగ్గేవారే కాకపోవచ్చును. ఆ పాటల వల్ల మనస్సులు తేలికపడి పనులు కూడా సులభ సాధ్యాలయినవి. అంటే కవిత్వం ముందు ఒక సత్యాన్ని ప్రదర్శించడం ద్వారా, దాని వెనుక మరో సత్యాన్ని ప్రాదుర్భవింపజేస్తుందన్నమాట. నిజానికి అది వరుసక్రమంలో రెండవదయినా, పరమార్థ దృష్ట్యా అది అద్వితీయమైంది. దుర్గమమైంది.

సంఘ సామూహిక భావోద్వత్తి లక్షణాన్ని ప్రకృతి వాతావరణంతో సంబంధించి కిందిమీద బడే ఎప్పుడూ కవిత్వం వర్ణిస్తుంది. అత్యంత సూక్ష్మంగా వ్యక్తీకరిస్తుంది. మనిషి గుడ్డిగా ప్రవర్తించే విషయాలు కవిత్వానికి విషయాలు కావు. తెలిసి ప్రవర్తించే అర్థ సంపాదక విషయాలే కవితా విషయాలు. ఇది ఇదే అని చెప్పడానికి వీలుకాని అవ్యక్త మధుర విషయాలు కవితా విషయాలు కావు. తెలిసీ తెలీని ఏదో మగతలో పాఠకుణ్ని వదలడం కవిత్వ లక్షణం కాదు. దాని ప్రథమ లక్షణం స్పష్ట ప్రతిపత్తి.

అది సంఘ సామూహిక భావోద్వత్తి చైతన్యానికి ప్రతిబింబం. సంఘం బింబము. చేతనలో ప్రతిఫలించిన ప్రతిబింబమే కవిత్వం. బింబం సత్యమైంది. ప్రతిబింబము మాయామోహము. సంఘం బింబము. సంఘశక్తి పేరు చైతన్యం. చైతన్యంలో సంఘం యొక్క సామూహిక భావ ప్రతిబింబమే కవిత్వం.

మతం - కవిత్వం○○○

మతాలు పుట్టుకొచ్చాయి. భౌతిక ప్రపంచం కంటే మత ప్రపంచం భిన్నమయింది. సంఘం యొక్క సామూహికమైన కవితా రసాస్వాదన మోహం క్రమంగా వ్యక్తినిష్ఠమౌతుంది. సాలెగూడులాగా అల్లుకొని ఏర్పడే సంఘగర్భంలోనే ఆ మోహలక్షణ రహస్యం బీజరూపంలో ఉంది. క్రమంగా అది ఇంకా మతాన్ని చుట్టుకొని విపరీతంగా, విస్తారంగా పెరుగుతుంది.

మానవుని స్వాత్మ / సామాజిక చైతన్యమే కవిత్వం (5). ఆ చైతన్యం కేవలం వ్యక్తినిష్ఠమైంది కాదు. సర్వసాధారణమైన భావోద్వేగ ప్రపంచంలో మిగిలిన అందరితోబాటు తానున్నూ ఒక భాగస్వామి కాగల్గినవాని అంతస్సత్వ చైతన్యం – అది సంఘంలోని సామూహికోద్రేకం, పిడుగుపాటు, గాలివాన మొదలైనవాటివల్ల కల్గుతున్నది. అందువల్ల అది భౌతిక సత్యం.

అయితే ఆదిమ మానవ సమాజంలో భావోద్రేకం భౌతిక సత్యమేనా? లేక మాయలో కూడుకొన్న ఒక ఆదర్శమా? నిజానికి అది అక్కడ ఈ రెండున్నూ కాదు. అది ఒట్టి సాంఘిక సత్యం మాత్రమే. మానవ సహజాతాలైన కామక్రోధాది రజస్తమో గుణాత్మక భావాలకున్న సాంఘికమైన చెలామణికి ఆనాటి భావోద్రేకం నిదర్శనం. కావ్యకల్పనం సాంఘిక ప్రతిబింబము.

కావ్యం అంటే ఉచ్ఛారణలో జీవించేది

కవి సృష్టించే కాల్పనిక ప్రపంచంలోని అన్ని సాహిత్య ప్రక్రియలున్నూ – పురాణ, ఇతిహాస, కావ్య, నాటకాలు – మొత్తం మీద ఒక సాంఘిక సత్యాన్నే పరమార్థం చేసి చెపుతవి. సాంఘిక సత్యం అంటే ఇంతకుముందు సూచించిన సహజాతాలకూ, సంఘానికి ఉన్న సంబంధమేనని అర్థం చేసుకోవాలి. అది ఇంకా కూడా వైయక్తికం కాకుండా సమసామాజికం కావాలి. సమసామాజికం కావడం కోసమే ఆ సంబంధం లయాన్వితమైన ఉదాత్త గంభీర భాషలో అభివ్యక్తం కావటం.

కాని అభివ్యక్తమైనంత మాత్రంలో అది కవిత్వం కాదు. పిల్లనగ్రోవి వెదురుబొంగుకు రంధ్రాలు చేశారు. రంధ్రాలే సంగీతం కాదు. గాలినూది వాయిస్తుంటే శ్రోతకు ఏది అనుభవానికి వస్తుంటుందో అదే సంగీతం. అట్లాగే ఎంతటి భావోద్రేకాలు, ఎంతటి భాషలో, ఎంత జాగ్రత్తగా పొదగబడినా (6) నిజం మాట్లాడితే – అప్పుడే అది కవిత్వం కాదు. దాన్ని ఉచ్ఛారణ దక్షుడైనవాడు చదివి చూడాలి. అప్పుడు దాన్లోని కావ్యసౌరభాలు గుబాళిస్తాయి. చదువుతూన్నప్పుడే కావ్యం జీవిస్తుంది. చదవడం అంటే పైకి చదవడమనే అర్థం.

సంఘాన్ని గూర్చీ, దానితో తనకున్న సంబంధాన్ని గూర్చి మానవుడికి ఉండే వ్యాకులమైన విజ్ఞానమే ఆదిమ సమాజంలో కవిత్వం.

భావోద్ధృత్తులు - మంత్రతంత్రాలు

భావోద్ధృత్తులు స్వాత్మగతాలు కావడం వల్ల అవి మానవుడికి తన అదుపులో ఉన్నట్లే ఆగుపడ్డాయి. అందువల్లే భావోద్ధృత్తుల మూలతత్వం ద్వారా మానవుడు బాహ్య జగత్తు మీద అధికారం చేయగల్గుతున్నాడు. మానవుడు తన వ్యష్టి సంకల్ప బలంచేత భౌతిక సత్యమైన ప్రకృతిని నియమించగల్గుతున్నాడు. మంత్రతంత్ర క్రియాదులచేత, ప్రయోగాదులచేత తాను సంకల్పించినదానికి అనుగుణంగా భావోద్రిక్తతల్ని ప్రేరేపించి, తన పని ఈడేరింది (ఫలించింది) అనుకొంటున్నాడు. అందువల్లే అతడికి – అంతర్ముఖత్వాన్ని పెంచుకొంటే భౌతిక సత్యాలైన ప్రకృతిని అదుపులో ఉంచి నడిపించగల్గుతాను అని ఇంకా అనిపిస్తోంది. ఈ ఆలోచన సశాస్త్రీయమయి, ప్రవృత్తి కర్మకు మార్గదర్శకమైనదయినప్పుడు మానవుడు నిజంగా అంత పనిని చేసి తీరుతాడు.

సంఘమంటే వ్యక్తిని చుట్టుకొని ఉన్న వాతావరణం. ఆ వాతావరణానికి సహవాసి జనసమూహం, సంఘం. సంఘం యొక్క తొలిరోజుల్లో మంత్రతంత్రాలు, మతాలు కలగాపులగంగా ఉంటాయి. ఆ కాలంలో సంఘాభివృద్ధి చాలా స్వల్పంగా ఉంటుంది.

మంత్రతంత్రాలు బాహ్యజగత్తును కొన్ని నియమాలకు లోబర్చుకొని నిలపడానికి చూస్తాయి. బాహ్యజగత్తేమో ఎదురు తిరుగుతుంది. దానివల్ల మాంత్రికుడికి జగత్తు యొక్క తిరుగుబాటు లక్షణం, దృఢవైఖరీ చక్కగా అర్థమౌతాయి. అలాంటి దృఢ వైఖరితో ఉన్న ప్రకృతిని ఎదుర్కోవడానికోసం ఇంకా శక్తిమంతాలయిన మంత్రతంత్రాలు కావాలి. దీనివల్ల మనకొక విషయం తెలుస్తోంది. మహామంత్రాల శక్తి వినియోగాన్ని అవసరమైనంత తట్టుకొని నిలబడగలిగే బలం బాహ్యప్రకృతిలో ఉందని. ఇంకా దీన్నిబట్టి ప్రకృతిలో ఉండే బలవద్వైఖరులను అంతకన్నా బలవంతాలయిన దేవతాశక్తులు అధిగమింపగలవని అంగీకరించడం జరుగుతోంది.

ఆ దేవతాశక్తుల యొక్క ఏకరూపత్వమే విధి. ఎవ్వడూ విధిని తప్పించుకోలేడు. ఏదే నియమం. దాన్ని అతిక్రమించే నియమం లేదు. ఇంద్రజాలికాలైన మంత్రతంత్ర విద్యలు క్రమంగా మారి, అంతకన్నా బలవంతమైన 'విధి' సిద్ధాంతంగా మారింది. ఈ విధి ముందు మంత్రతంత్రాలు పనిచేయవు.

బాహ్య జగత్తుకూ, తనకూ ఉండే సంబంధం యొక్క జ్ఞానం మానవుడికి సరిగా లేదు. అందువల్ల మంత్రతంత్ర విద్య ఆ జ్ఞానానికి తగ్గంతగానే ఉంటుంది. తాను అనుక్షణమూ బాహ్యజగత్తుతో పోరాడ్తూనే ఉన్నాడు. ఈ పోరాటం వల్లే వాడికి దాని ప్రకృతితత్వం అర్థం కావాలి. పరిసర వాతావరణానికి, స్వాత్మకూ ఉన్న దగ్గరితనం బోధపడాలి.

ఆదిమ మానవ సమాజం నాగరిక దశాభిముఖంగా చేసే ప్రయాణంలో మంత్రతంత్రాత్మకత్వం, దేవతాత్మకమైన మతాచార అభినివేశం అనేవి రెండు మజిలీలు. అప్పుడు కవిత్వం మతాన్ని విడిచి వేరేగాలేదు. కొంతకాలం అలా గడిచింది. ఆ కాలమంతా ఒకవిధంగా మానవజాతి శిశుత్వదశ అని అనవచ్చు.

కవిత్వం - మార్పు

కవిత్వాన్ని, మతాన్ని మనం వేరేవేరేగా చూడొచ్చు. మతం అచ్చమైన మతంగా పెరుగుతున్న కొద్దీ అందులో కనబడని ఒక విస్పష్టమైన లక్షణం దేశకాలాలతో నిమిత్తం లేకుండా కవిత్వంలో కన్పిస్తున్నది. కవిత్వం ఫలోత్పాదకమైంది. దేశకాలాల్లో పరిణమించేది. ఒక తరం కవిత్వం, తర్వాతి తరం వాళ్ళకు తృప్తినివ్వలేదు.

ప్రతి కొత్త తరం కూడా తనకు వారసత్వంగా సంక్రమించిన ప్రాచీన కవిత్వాన్ని ఆస్వాదించడం, అర్థం చేసుకొని అభినందించడం తప్పక నేర్చుకోవాలి. ఆ మీదట తన నిత్యజీవితంలోని కష్టసుఖాలు, సమస్యలు, ఆశనిరాశలు, మంచిచెడ్డల్ని ప్రత్యేకంగా పరిశీలించి, కవిత్వం రాయటాన్ని గురించి నిలదీసి అడగవచ్చు. ప్రతి తరము ఆ విధంగా అడుగుతోంది గనుకే ఎన్నో కొత్తపాటలు, ఎన్నో కొత్త కథలు, ఎన్నో పురాణాలు, ఎన్నో ఇతిహాసాలు తయారవడం. ఇదంతా మానవజాతి సాహిత్య జీవితంలోని ప్రత్యేకత.

ఈ ప్రత్యేకత ఏం చెప్తోంది? సాహిత్యకళకు మార్పు సహజమని చెప్తోంది. సంఘం అనే వృక్షం చిటారు కొమ్మన పూచిన పువ్వే కావ్యకళ. సంఘం మారినట్లల్లా అది మారుతుంటుంది. సంఘం పెరిగిన కొద్దీ అది పెరుగుతుంటుంది. సంఘం బలపడిన కొద్దీ అది బలపడుతుంటుంది. మారిన కొద్దీ, పెరిగిన కొద్దీ, బలపడిన కొద్దీ అది సంఘం మొత్తానికి ఉపయోగపడే కళ కవిత్వం.

కావ్య కళ ఇంతగా మార్పులకు లోనవడానికి అది మాయామహితం కావడమే కారణం. మాయా మహితత్వం పరిణామ లక్షణరూపం. ఈ మాయాలక్షణం యొక్క పరిజ్ఞానం కలిగిన తర్వాత కావ్యం ప్రపంచంతో సరితూగుతూ ఉండాలని ఎవ్వడూ భావించడు. ఆ విషయంలో అంత పట్టుదల కూడా ఎవ్వడూ చూపించడు. ఇట్లా అనడం వల్ల కావ్య ప్రపంచానికీ, భౌతిక ప్రపంచానికి ఎలాంటి సమైక్య లక్షణం కనబడదని అంటున్నట్లుగా అర్థం చేసుకోగూడదు.

కావ్య విషయాలు తు.చ. తప్పని సత్యాలుగా ఎప్పుడూ అంగీకరించము. అదీగాక కావ్య విషయంలోనే పోయి చోటు చేసుకొని కూర్చోవాలనే తొందర వాస్తవికతకు మాత్రం ఏముంది? అది లేదు కనుకే నిరాటంకమైన కావ్యధార ఉత్పత్తి అవుతోంది. అసలిది దేశకాలాలతో సంబంధం లేని కవితాతత్త్వం. ఒక విధంగా మత లక్షణం కూడా ఇదే. సంఘం తొలిదశలో తాను పుట్టినప్పుడు – అప్పుడు కవిత్వంతో కలిసి ఉండేది కదా. తాను ఇంకా పురాణశాస్త్రాదికాన్ని మించి కూడా అప్పుడు లేదు. కాలం సాగిన మీదట, పురాణ శాస్త్ర యుగం ముగిసిన తర్వాత మతం అచ్చమైనదై ప్రవర్తిస్తుంది.

వర్గ సమాజం - పాలకవర్గం, పాలితులు

శ్రమ విభజన వల్ల వర్గ సమాజం ఏర్పడింది. ఈ సమాజంలో పాలకవర్గం బలవంతమయి, పాలితుల యొక్క సామూహికశక్తి ఉత్పత్తి చేసిన వస్తుజాలాన్ని వాళ్ళ నోళ్ళు కొట్టి తమ ఇళ్ళల్లో నింపుకొంటుంది. కనీస పక్షపు దోపిడీ విధానాన్ని అనుసరించినా, అందులోని మంచి వస్తువులూ, ఎంతో అవసరమైన నిత్యావసర వస్తువులూ పాలకులు కాజేస్తారు. పాలితులేమో అట్లాగే పీడింపబడుతూ ఉంటారు.

పాలకవర్గం మొత్తం పెత్తందారీ వర్గం. వాళ్ళంతా బుద్ధిజీవులు. బుద్ధిశక్తిని ఉపయోగించి వాళ్ళు పని చేస్తారు. వారికి సర్వ సుఖానుకూలమైన పరిస్థితులున్నవి. సుఖానుభవానికి అవసరమైన విరామం(విశ్రాంతి) ఉంది. ఉత్పాద్య వస్తువుల్లో వాళ్ళ భీముని చాటా వాళ్ళకు ఉంది. ఇవన్నీ నెమ్మదిగా ఆ వర్గానికి ఒక ఆలోచనా విధానం, ఒక సంస్కృతి సంప్రదాయం అభివృద్ధి కావడానికి దోహదం చేస్తవి. పాలితుల్లో అలాంటి అభివృద్ధి కనబడదు. కష్ట భూయిష్టమయిన వాళ్ళ నిత్యజీవిత విధానం అలాంటి అభివృద్ధి విషయంలో పూర్తిగా పెడమొగం పెట్టి ప్రవర్తిస్తుంది.

ఈ విధంగా క్రమ విభజన ఏర్పడిన కాలం కొంత దాటిన తర్వాత ఇక సంఘం ఎక్కడికక్కడ ముక్కలు చెక్కలు కావడం మరింత ఎక్కువౌతుంది. ఈ వర్గ విభేదం పీడించే పాలకవర్గాన్ని రోజు రోజుకీ వాస్తవిక ప్రపంచానికి దూరం చేస్తుంది. ఆ విధంగా వాళ్ళు దూరమైన కొద్దీ ఏకాంతమైన ఆలోచనా ప్రవాహాల్లో పడిపోవడం ఎక్కువవుతుంది. వాటిని నిజానికి ఆలోచనలనడం మంచిది కాదు. వినోద కాలక్షేపాలవసరం అవుతాయి. సంస్కృతి సంప్రదాయాల సంపద వాళ్ళకు పెంపుగా కన్పిస్తుంది.

ఇక పీడితులు. వాళ్ళు ఆలోచనలకు దూరం. ఊహలకు దూరం. సంస్కృతీ సంప్రదాయాలు వారి దగ్గరకు రావు. వాళ్ళది మితిమీరిన శ్రమ జీవనం. వాళ్ళు పరిస్థితుల ఇరకాటంలో బ్రతుకుతారు.

శ్రమ విభజన - క్షీణదశ

వర్గ సమాజంలో శ్రమ విభజన మొదట మంచి ఫలితాల్నే ఇస్తుంది. కాని క్రమంగా అది సమాజాన్ని ఎంతో

దయనీయమైన స్థితికి దిగలాగుతుంది. ఆలోచనాత్మకమైన జ్ఞానబుద్ధి క్రియాశీలం కాదు. పరపీడన పరాయణమైన పాలకవర్గం వట్టి భోగలాలస అయి, పరాన్న భోజన ప్రియమైనప్పుడు భౌతిక సత్యమైన జగత్తు నుండి వాళ్ళ ఆలోచనలు విడివడి, శుష్క పాండిత్య ప్రదర్శనానికి వెన్నుబలంగా నిలబడతాయి. పీడిత ప్రజానీకం ఇంకా దిగజారి కేవలం బానిసలుగా మారినప్పుడు శ్రమ పూర్తిగా జ్ఞానబుద్ధితో తెగతెంపులు చేసికొంది. అప్పుడు శ్రమ (కర్మ) గానుగెద్దులాగా సాగింది.

ఈ స్థితి సంఘ జీవితంలో స్పష్టంగా ప్రతిబింబిస్తుంది. కళాశాస్త్ర విజ్ఞానాల్లో ప్రతిబింబిస్తుంది. ఆర్థిక వస్తూత్పత్తి దెబ్బతింటుంది. రాజ్యం 'అరాచక'మవుతుంది. ఈ విధమైన క్షీణదశ అస్వతంత్ర భారతదేశంలో ఉండేది. పతనకాలపు రోమన్ సామ్రాజ్యంలోనూ, ఈజిప్టు, చైనా దేశాల్లో అప్పుడు ఈ క్షీణ యుగమే ప్రవర్తించింది.

శ్రమ విభజన వర్గ భేదము లేని సమాజాన్ని వర్గాలుగా విభజించింది. ఒక వర్గమంతా బుద్ధిజీవులు. మిగిలిన వర్గం శ్రమజీవులు. ఇలాంటి సమాజం వల్ల సంఘం ఎంత నీచ స్థితికి చేరుతుందో, అప్పటి మతాలు, కళలు – ఇవి కూడా అట్లాగే దిగజారి పోతాయి. అప్పుడిక మతం కాని, కర్మ కాని సంఘ సామూహిక శక్తి చేత ఉత్పన్నం కావు. పాలకవర్గమే వాటిని తయారుచేస్తుంది. వాళ్ళు శాసనాల్ని అమలు చేసినట్లుగానే తమ మతాన్ని జనం మీద అమలు చేస్తారు.

ఆదిమ సమాజంలో పరిస్థితి వేరు. ఒకరు ఇంకొకర్ని పని చేయమని ఆదేశించేది లేదు. వాళ్ళ అవసరం కొద్దీ వాళ్ళు పని చేస్తారు. వాళ్ళు గుంపులు గుంపులుగా నివసించే వాళ్ళు కాబట్టి గుంపులుగానే పని చేసికొనే వాళ్ళు. వారికప్పటికున్న కొద్దిపాటి సంప్రదాయం, మతనియమాలు వాళ్ళను కార్యోన్ముఖుల్ని చేసేవి. వారికి ఏ సమస్య వచ్చినా అది ఆ గుంపులోనే అనుకూలంగా పరిష్కారమయ్యేది. ఆ గుంపంతా ఒకటిగానే బ్రతికేది కదా! అందువల్ల అది సాధ్యమయ్యేది.

వర్గ సమాజంలో భిన్న వర్గాల ఆలోచనలు వేరు. ఆదర్శాలు వేరు. అభిరుచులు వేరు. పాలితుల్ని పాలకులు శాసిస్తారు. ఇప్పుడు వాళ్ళ పరస్పర సంబంధం నిర్బంధ లక్షణంలో ఉంటుంది.

మతం - మూఢాచారాల పుట్ట

ఇహ మతం – అది మూఢాచారాల పుట్ట. సంఘానికి మోహాన్ని, విభ్రాంతినీ బోధిస్తూ అది మనుగడ సాగిస్తుంది. రాజులు పాలించే సమాజంలో పరమేశ్వరుడొకడుంటాడు. సమాజం సామ్రాజ్య భాగమైనప్పుడు దేవతా సమాజం పెద్దది అవుతుంది. మానవ లోకపాలకుల్ని అనుసరించే ఈ కాలంలో ఆ దేవలోకంలో కూడా దేవతల్లో అనేకవిధాల అంతస్తులు – హోదాలను బట్టి, అధికారాల్ని బట్టి ఏర్పడతవి. భూలోకంలాగానే దేవలోకం కూడా.

వస్తు విభాగంలోని అసమానత్వం వల్ల, పరస్పర వ్యతిరేకమైన కామనల వల్ల విపరీతమైన విరోధం పెరిగి, అది సంఘాన్ని ఇంకా విభేదాల పాలు చేస్తుంది. ఈ విభేదాల వల్లే అల్లర్లు, తిరుగుబాట్లు చెలరేగడం, అణచివేయటం సాగుతుంది. సంఘపరంగా ఉండాల్సిన ఉత్పత్తి సాధన వస్తు సామాగ్రి పూర్తిగా పాలకవర్గాల వారి హక్కు భుక్తంగా అయినప్పుడిక పీడిత ప్రజావర్గం బలప్రయోగానికి దిగక తప్పదు. అట్లా హక్కు భుక్తం చేసికొనే లక్షణమే నిరంకుశత్వం.

మత విషయంలోనూ అంతే. సంఘ సామూహిక జీవిత స్పర్శ ఈషణ్మాత్రమూ లేకుండా, దేవతల్లోనూ, పరలోకంతోనూ నిండి అది నిరంకుశంగానే ప్రవర్తిస్తుంది. తత్ఫలితంగానే దాన్లో మూఢాచారాలు నిండుతవి. నిరంకుశత్వం, మౌఢ్యం అటు పరిపాలనలోనూ, ఇటు మతంలోనూ సమానంగానే ఉంటాయి. ఆ కాలంలో ప్రభుత్వమూ, మతమూ రెండూ రెండు కావన్నట్లుగా ఉంటాయి. ప్రభుత్వ మతమే ప్రజల మతం. భిన్న మతావలంబనం దోషం కూడా.

పాలకవర్గం సామాజికమైన శ్రమ జీవనాన్ని పూర్తిగా వదలి బ్రతకడానికి పూనుకొనే కాలం వ్యావసాయికంగా అభివృద్ధి చెందిందై ఉంటుంది. వ్యావసాయిక నాగరికతలో ప్రభువు ప్రత్యక్ష దైవంగా సంఘంలో మహోన్నతుడుగా ఉంటాడు. అప్పుడు సమస్త సంఘశక్తి వాడి హస్తగతమే అవుతుంది. దాన్ని అతడే సంబాళించుకుని పోతున్నట్లుంటుంది. బానిసలు తమ శక్తి సామర్థ్యాల్ని తాము తెలిసికోరు. పైగా తమ శక్తి సామర్థ్యాలు తమ ప్రభువువి అని వాళ్ళు భావిస్తారు. ఆయన నియామకాన్ని అనుసరించే వాళ్ళ శక్తియుక్తులు పని చేస్తవి కదా అందుకని. బానిసకు ప్రభువు, ప్రభువర్గం–అందరూ పూజ్యులే. ఈ విధంగా బానిస, ప్రభువుకు స్వాత్మ సమర్పణం చేస్తాడు. వాడి శక్తి సామర్థ్యాలు ఉత్పాదించిన వస్తు సమూహం ఎలా పాలకవర్గాల పాలవుతుందో, వాడి ఆత్మకూడా అట్లాగే అవుతుంది. ఆస్తి పోయింది. మానాభిమానాలు పోయినవి. బానిసలు ఎంత వినయ విధేయతలతో ఉంటారో, ఆ సంఘంలో వాళ్ళ వల్ల అంతటి ఘనకార్యాలు నిర్వహించబడుతున్నవని అర్థం.

మతం - స్వర్గ సుఖాలు

మతం అంటే ప్రపంచం యొక్క విపరీత చైతన్యం. వర్గ సమాజంలో వర్గ విభేదం అధికమవుతున్న కొద్దీ వస్తూత్పత్తి శక్తి సన్నగిల్లింది. అది కొందరి సొత్తు అయింది. అట్లాగే మతం కూడా అనేక రకాల నిర్బంధాలకు లోనయి, కరుడుకట్టుకుని, చావు బ్రతుకుల నడుమన ఉన్నట్లుంటుంది.

పాలకవర్గం తాను తన మతంలో విశ్వాసం కలిగి ప్రవర్తిస్తూ, అందులోని మంచి మంచి అనుకూలమైన వాటినన్నింటినీ స్వాయత్తం చేసుకుంటుంది. సంఘంలోని మేలుజాతి వస్తు సముదాయమంతా దాని సొంతమే కదా! మత విషయంలోనూ అది అట్లాగే ప్రవర్తిస్తుంది. స్వర్గసుఖాలన్నీ దానివే. ఆనందమంతా దానిదే. అట్లా సాగుతున్న కాలంలో ఎప్పుడైనా పీడితుల్లో మరీ మొండికెత్తిన రకం వాళ్ళు కొందరు ఎదురు తిరుగుతారు. అప్పుడు పాలకవర్గం తమ స్వాధీనంలో ఉంచుకున్న ఆనందభూముల్లో ఇంత చోటిచ్చి వాళ్ళను శాంతింపచేస్తుంది. భౌతిక వస్తువులయితే మరొకళ్ళకిస్తే విలువలు తగ్గిపోతాయి. ఆధ్యాత్మిక వస్తువుని ఎందరికిచ్చినా పోయేదేమీ లేదు. (కీస వెలితి కాదు).

ఇలాంటి సందర్భాల్లో కొన్ని విచిత్రాలు జరుగుతాయి. ఈజిప్టులో బానిసజాతికి కూడా శాశ్వత స్వర్గ సౌఖ్యం అంగీకరించబడింది. ఇంకా కొన్ని అవాంతర మతాలు మొట్టమొదట ప్రభువుల పట్ల ఉండే దైవభావాన్ని క్రమంగా దిగజార్చి, అల్ప విషయాల్లో దైవాంశాల్ని ప్రవేశపెట్టాయి. రోజురోజుకీ ఎక్కువవుతున్న పీడిత ప్రజానీకం యొక్క దౌర్భాగ్య స్థితికి ప్రతిబింబమే ఇది.

ధర్మంగా బ్రతికితే మరణానంతర జీవితంలో సుఖపడవచ్చనే ప్రచార ప్రబోధాలు. ధర్మంగా బ్రతకడం అంటే యజమానులకు లోబడి వినయ విధేయతలతో ఉండటమే. వర్గ సమాజం స్వర్గలోకపుటూహా సౌఖ్యాల్నే పాలితుల్లో చాలామందికి మరణానంతరం సమకూర్చింది. ఆ విషయాన్నే బుట్టలకెక్కించింది. స్వర్గాది లోకాలెంత సత్యాలో, మరణానంతర జీవితమూ అంతే సత్యం. ఒక్క పాలకవర్గానికి తప్ప మిగిలిన వాళ్ళకెవరికీ వాస్తవమైన, నిత్యజీవితంలో అనుభవింపదగిన సుఖమేదీ ఉండదు. వాళ్ళు పండించిన పంటే వాళ్ళకు దక్కదు కదా!

మత విషయ ప్రయోజన జ్ఞానం యొక్క అభివృద్ధి క్రమంగా పాలకవర్గం వాళ్ళకు మతం విషయంలో అవిశ్వాసాన్ని పెంచుతుంది. తనకు అవిశ్వాసం పెరుగుతున్న కొద్దీ దాన్ని నిర్బంధం చేసి, పరాయివాళ్ళ మీద రుద్దుతుంది. అప్పుడింకా పాలకవర్గం ఒక మంచి మనోహరమైన ఆదర్శవాదాన్ని గానీ, రహస్యమైన వేదాంత తత్వాన్ని గానీ పెంచి, దాని అండలో తాను నిలద్రొక్కుకుంటుంది.

పాలితుల మూఢవిశ్వాసాలు

పాలకవర్గం వారి పరిస్థితి ఇట్లా ఉంటే, పాలితుల్లో కొన్ని మూఢవిశ్వాసాలు ప్రబలుతాయి. కొన్ని గాథలు ప్రచారమవుతాయి. దీనికంతటికీ మూలం జనసామాన్యంలో వ్యాపించిన పౌరాణికతే. కానీ పాలకవర్గం ఇప్పుడు పాలితుల మూఢవిశ్వాసాల్ని అమర్యాదకరంగా భావిస్తుంది. మొత్తం మీద అవమానింపబడ్డా, సన్మానింపబడ్డా అది వ్యాప్తిని పొందుతుంది.

ఆ విశ్వాసాలు అదృష్టాలకు సంబంధించినవి. ఆహారం లభించడం, బంగారం చేజిక్కడం, అదృష్టవంతులైన పిల్లలు పుట్టడం ఈ మొదలైనవన్నీ వాటికి సంబంధించి ఉంటాయి. ఇలాంటి అదృష్టాలు వాళ్ళకీ జీవితంలో లేనేలేవు. ఆ విశ్వాసాల మీదనే వాళ్ళు బ్రతుకు పోరాటాన్ని సాగిస్తున్నారు. వాళ్ళకి విశ్వాసం విషయంలో ఏ మాత్రం అపనమ్మకం లేదు. ఎందుకంటే అవి ఎవరో నెత్తిన రుద్దినవి కావు కదా! అందుకోసం వాటిని సమాజం అంతా కలిసి పెంచుకొన్నది.

అందుకని తన సమాజం అంటే విభజన జరగని తమ వర్గమని అర్థం – మతం కవితా విషయం కాని కాలంలో వారి ఆ విశ్వాసాలే మతకవితా విషయాలు. అణగదొక్కబడిన వాళ్ళ కళావిషయం అది. మానవ సహజాతాలైన కామక్రోధలోభమోహాది వాసనలు సాంఘిక జీవితంలో కలిసిపోవడాన్ని ప్రకటించేటంత వరకు ఆ విశ్వాసాలే కవితా విషయాలు. కవితా విషయాలు మాత్రమే గాని ఉత్తమ కవితా విషయాలు కావు. అవి బానిసజనం విశ్వాసాలు కదా! సర్వతంత్ర స్వతంత్రులే ఉత్తమ కవితా నిర్మాణ దక్షులు. దీన్లో ఏ మాత్రం అబద్ధం లేదు. ఈ కవిత్వం వాంఛా సాఫల్య భూముల హద్దుకు లోబడే ఉంటుంది. ఈ కవితా నిర్మాతల నిత్యజీవితంలోనే స్వేచ్ఛామూలకమైన ప్రవృత్తి లేదు. అందువల్ల వారి కవిత్వం కూడా అట్లాగే ఉంటుంది.

వర్గ సమాజంలో కళ

వర్గ సమాజంలో యజమానులు చెప్పినట్లు కార్మికులు గుడ్డిగా పనిచేస్తారు. తాజ్‌మహల్ నిర్మాణానికి అందరూ తలా ఒక రాయి ఎత్తినవాళ్ళే. రాయి మోయడమే వాళ్ళకు తెలుసు. తాజ్ మహల్ నిర్మాణం జరిగినట్లు పాలకులకు మాత్రమే తెలుస్తుంది. పాలితులు ఊరికే లొంగి పనిచేస్తారు. వాళ్ళకేమీ తెలియదు. వారు అస్వతంత్రులు (7). పాలకులు స్వతంత్రులు.

అందువల్ల వాళ్ళ కళా వ్యాపారం పోనుపోను పూర్తిగా వాళ్ళ అభీష్టాన్ని, అభిలాషల్ని వ్యక్తం చేస్తూ, వాళ్ళ విశేష ప్రతిపత్తికి నిదర్శనంగా కన్పిస్తుంది. ఒక వర్గం మతం కోసం గాను ప్రత్యేకించడం వల్ల అది వెన్నెముక బలం మీద నిలదొక్కుకుని, కళ నుండి వేరు పడుతుంది. ఈ విధంగా కళ మతం నుండి దూరమవుతుంది. ఇంతకు ముందే పాలకవర్గం వాళ్ళ విశ్వాసాన్ని అది కోల్పోయింది. పాలకవర్గం కంటే ఎక్కువ నిరాఘాటంగా అది ప్రజాపీడనం చేస్తున్నది. వర్గ సమాజంలో మతం అవిశ్వాసం పాలవుతున్న కొద్దీ, స్వతంత్రులైన పాలకవర్గం వాళ్ళ కళారుచులు విశేషాభివృద్ధి చెందుతాయి.

ఇప్పుడు పాలకవర్గం వాళ్ళ భావోద్ధృత్తుల్ని అభివ్యక్తీకరించడమే కళాతత్వం అవుతుంది. ఈ కాలంలో

కొన్నాళ్ళపాటు ఇలా – దోచుకునే పాలకవర్గాల వాళ్ళ భ్రష్ట కళాఖండాలు, అటు దోపిడీ పాలయ్యే పాలితుల జానపద గాథావళులు రెండున్నూ పక్కపక్కగానే బ్రతుకుతవి. కానీ ఈ స్థితి ఎంతో కాలం నిలవదు.

కవిత్వానికి ఏ మాత్రం అవకాశం లేనంతగా పాలకవర్గం అస్వతంత్రమయి, గుడ్డిదైపోతుంది. ఇక ఇప్పుడు కవిత్వం వెనుకటి నమూనాల మీద కుంటిగా నడవక, గుడ్డినడక నడుస్తుంటుంది. కళాతత్త్వం నశించిపోతుంది. అది కవిత్వానికి కాలం కాదు. ఇట్లా పాలకవర్గం చెడిపోతున్న కొద్దీ పాలితుల బ్రతుకులు మరింత ఘోరమవుతాయి. వాళ్ళింకా పీడింపబడ్డారు. వాళ్ళ జీవితం ఇంకా అస్వతంత్రమయి, బానిస బ్రతుకయి, యాంత్రికంగా తయారవుతుంది. సంఘం యొక్క ఆర్థిక స్థోమత సేవ్య సేవక తత్త్వం మీద ఆధారపడుతుంది.

జానపద కళలు కానీ, వట్టి మూఢ విశ్వాస విషయాలు కానీ కవిత్వ రూపంలో వెలువడడానికి కూడా యాదృచ్ఛికత కావాలి. బానిసవర్గానికి అది లేదు. బానిస సమాజానికి కళలు లేవు. కవిత్వాలు లేవు.

ప్లేటో - అరిస్టాటిల్ : కవిత్వ రహస్యం - ప్రవృత్తి

కవిత్వాన్నుండి సంఘాన్ని వేరుపర్చలేము. అది మానవ ప్రవృత్తికి సంబంధించింది. సంఘం ప్రవృత్తిమయమైంది. కవిత్వ రహస్యమంతా ఆ ప్రవృత్తిలోనే ఉంది. మానవ ప్రవృత్తి సహజాతాలైన వాసనల్ని బట్టి ఉంటుంది. కాని ఇంతకంటే కూడా మానవతకు ఇంకా చాలా దగ్గరై, మార్పు లక్షణాల్ని కలిగి ఉంటూ, సహజాతాలకే మాత్రమూ సంబంధం లేని ప్రవృత్తులున్నవి. అవి తరతరానికి వరస తప్పకుండా వారసత్వంగా సంక్రమిస్తవి. ఇంకా అవి ప్రతి తరాన్ని, దాని పూర్వతరం కంటే భిన్నంగా తీర్చిదిద్దుతాయి. ఇదంతా నాగరికత. మొదటిదంతా సహజత్వం.

సహజత్వంతో మానవతకూ, నాగరికతతో మానవతకూ ఏర్పడ్డ వైరుధ్యమే కవిత్వానికి అవకాశం కల్పించింది. సహజత్వంతోడి మానవత్వం అంటే స్వతంత్ర వ్యక్తి. వాడి మీద ఏ విలక్షణ ప్రభావమూ లేదు. నాగరిక మానవుడంటే నాగరికత వల్ల కలిగే అనేక విలక్షణ ప్రభావాలకు లోనైనవాడని అర్థం. ఇట్లా విలక్షణత్వం లేకుండటానికి, ఉండటానికి గల రాపిడి వల్లే కవిత్వానికి ఒక అర్థం ఏర్పడింది. ఆ మేరకు కవిత్వం సత్యమని అందువల్లే అనిపిస్తోంది. కవిత్వం ఫలోత్పాదక శక్తి కలిగింది. ఇంకా అది ఆర్థికమైన కృషి కూడా. ఈ పునాది నుండి కవిత్వాన్ని కదిలించి చూస్తే దాని తత్త్వం అసలు అర్థమే కాదు.

ప్రాచీనుల దృష్టి

ఇక ప్రాచీనులు ఈ కవిత్వతత్త్వాన్ని ఎట్లా భావించారో మనం గమనించాలి. ప్లేటో, అరిస్టాటిల్ తమ సమకాలంనాటి సాంస్కృతిక విషయాలనన్నింటినీ కావ్య కళతో సహా పరిశీలించారు. వారిద్దరున్నూ వర్గపోరాటం ఫలోన్ముఖం కాని కాలానికన్నా ముందటివాళ్ళే. ప్లేటో అప్పటి పాలకవర్గ ప్రతినిధి. అరిస్టాటిల్ నిత్యజీవితపు బ్రతుకు తెరువులో మొండికిబడి సాగే ప్రజావర్గానికి ప్రతినిధి.

అరిస్టాటిల్ తన సమాజంలో భాషను ప్రయోజనానుకూలంగా ఎట్లా భిన్నభిన్నంగా ప్రయోగిస్తున్నదీ గమనించాడు. జన బాహుళ్యాన్ని ప్రబోధించే వేదికల మీద ప్రయోగించే భాషలో ఎంత వాక్చాతుర్యం ఉంటున్నది, దాని శక్తి వల్ల వక్త సామాజికుల్ని ఎట్లా తనతో తీసుకొని పోతున్నది అరిస్టాటిల్ స్పష్టంగా చూశాడు. అది ఆనాదంతగా, సమాజంలో ప్రధానంగా ఉన్నది కాబట్టే వాక్చాతుర్యాన్ని గురించి అంతగా రాశాడు. మరి కవిత్వం విషయంలో సమసామాజికమైన అనుభూతే అప్పుడు ఉండింది. ఆదిమ సమాజ లక్షణమే అప్పటికీ ఇంకా ఉండింది.

న్యాయస్థానంలో న్యాయవాదులకూ, రాజకీయరంగంలో ప్రజానాయకులకూ శ్రోతల్ని ముగ్ధుల్ని చేసి, తమ పక్షం ఆమోదించేట్లుగా వాళ్ళని ప్రబోధించాల్సి ఉండటం చేత వాక్చాతుర్యం తప్పనిసరిగా నేర్వాల్సిన కళ అని అరిస్టాటిల్ భావించాడు. అరిస్టాటిల్ భావించిన వాగ్వైలక్షణం కవితా ప్రచార సాధనం కాదు. మరి నిత్యజీవితంలో పరస్పర నియోజనావసరాల్లో గాని, ఉపదేశావసరాల్లో గాని భాషలో ఉపయోగించే చాతుర్యం, ముందు పేర్కొన్న ప్రయోజన సాధనం వంటిది కాదు. ముందు పేర్కొన్న రెండు స్థలాల్లో మాత్రమే వాక్చాతుర్య ప్రసక్తి. తక్కిన చోట్ల కాదు. ఈ విషయాన్ని అరిస్టాటిల్ స్పష్టంగా చెప్పాడు.

అలంకారికమైన భాషాశైలి ఉన్న ఉపన్యాస చాతుర్యం కంటే వేరుగా గేయాల్ని, రూపకాల్ని, ఇతిహాసాల్ని, ప్రేమగీతాల్ని గురించి సాహిత్య శాస్త్ర మీమాంస చేశాడు. అది, కావ్య ప్రక్రియలు అట్లా విడిపడుతున్న కాలం. అందువల్లనే ఆయన కావ్య ప్రక్రియలన్నింటిలోనూ కనిపించే సాధారణ లక్షణం ఏదీ అని విచారించాడు. అది కవిత్వమవుతుందా? కాదా? అని తేల్చి చెప్పగల్గే ఏకైక లక్షణం కోసం అతడు అన్వేషించి, కవిత్వం కథను చెబుతోందని కనుగొన్నాడు. ఇంకా అది దేవతల పద్ధతుల్ని కానీ, మానవుల పద్ధతుల్ని గురించి కానీ చెప్తున్నదనీ, కాకపోతే కవి యొక్క భావోద్ఘత్తుల్ని వ్యక్తం చేస్తున్నదనీ, ఇదంతా నిజం కాకపోయినా నిజమన్నట్లు కన్పిస్తున్నదనీ భావించాడు. ఇతిహాసం అబద్ధపు చరిత్ర, నాటకం – కపట నాటకం. ప్రేమ కవిత్వం కూడా ఆత్మవంచన, పరవంచనలో కూడుకున్నది. అందువల్ల గ్రీకులకు కవిత్వం వట్టి మాయగా – అందులోనూ తెలిసిన మాయగా కనిపించేది.

ప్లేటో - కవుల నిషేధం

ఈ రకం కావ్యకళ ప్లేటోకు ఎంతో శోచనీయంగా కన్పించింది. అందువల్లనే ఆయన తన ఆదర్శ రాజ్యంలో కవులను అనుమతించలేదు. ఒకవేళ వాళ్ళను రానీయాల్సి వచ్చినప్పుడు ముందుగా వాళ్ళ కృతులను గుణదోషులు బాగా విమర్శించాలని నియమం చేశాడాయన. ప్లేటో ప్రతీప తాత్విక బుద్ధి. అలాంటి వాళ్ళెప్పుడూ ముఖ్యంగా సమకాలీన సంస్కృతిని నిరసిస్తూనే ఉంటారు. ప్లేటో సమకాలీన సంస్కృతి ముఖ్యంగా కావ్య సంబంధమైంది. తాత్వికుడుగా ఆయన కవిత్వాన్ని నిరసించాడు. మనిషిగా దానివల్ల ఆనందాన్ని అనుభవించాడు.

కవిత్వం మాయాకల్పనమే ప్రధానంగా కలిగి ఉండేదనే నిర్ణయానికి గ్రీకులు వచ్చారు. అందువల్ల కవి, బాహాటంగా మాయను సృష్టించగలదాన్నే నిర్మించడానికి పూనుకున్నాడు. నిత్యజీవితం కంటే సత్యమైన చరిత్రను నిర్మించాడు. కవి అంటే అచ్చంగా ఇట్లాంటి నిర్మాణ దక్షత ఉన్న వాడేనని గ్రీకులు భావించడం మొదలు పెట్టారు. ఆ భాషలో కవి శబ్దానికి వ్యుత్పత్యర్థం 'చేసేవాడు' అనే. చేయడం అంటే సృష్టించడం అని కూడా అర్థం. ఇలా సృష్టించడం కవులకీ, దేవతలకీ మాత్రమే తెలిసిన విద్య (8). కాని వాస్తవ విషయ సంకేతాలైన శబ్దాల వల్ల ఒట్టి శూన్యం నుండి కవి ఏమీ సృష్టించలేదు. మొదటగా కవి వాస్తవికత్వానికి కృత్రిమమైన అనుకరణాన్ని తయారు చేస్తాడని వాళ్ళు అభిప్రాయపడ్డారు.

ప్లేటో దృష్టిలో కవి అన్నవాడు వాస్తవ జీవితానికి అనుకరణాన్ని సృష్టించి, శ్రోతల్ని తాను సృష్టించిన ఛాయా ప్రపంచంలో మోసపుచ్చేవాడు. ఈ అనుకరణ సిద్ధాంతమే సభాసంభాషణా చాతుర్యం నుండి కవిత్వాన్ని వేరుపరచడానికి అరిస్టాటిల్‌కు అవకాశాన్నిచ్చింది. ఇప్పటి మన ఆధునిక మనస్తత్వానికి, అప్పటి నుండి ఇప్పటి దాకా వచ్చిన సాహిత్యంలోని మార్పుల వల్ల ఆయన చేసిన వేర్పాటు సర్వసమగ్రంగా కన్పించదు. అయినప్పటికీ అది ఆనాడు అరిస్టాటిల్ కాలానికి యుక్తమైందే.

మనం కవిత్వాన్ని నవల, నాటకాల కంటే భిన్నంగా చూస్తాం కదా! అరిస్టాటిల్ అట్లా చూడడు. సాహిత్య ప్రక్రియలు శాశ్వతాలు కావు. జీవశాస్త్ర శాస్త్రీయ విభాగాలే శాశ్వతాలు కావు. సాహిత్యం, జీవశాస్త్రం రెండూ మారుతుండాల్సిందే. ప్రాణికోటి పరిణామం కంటే శీఘ్రంగా సంస్కృతీ పరిణామం జరుగుతుంది. అందువల్ల – సంస్కృతీ సంప్రదాయ విమర్శనాన్ని తగినట్లుగా మార్పుల్ని, చేర్పుల్ని తనలోకి రానిస్తుండాలి.

కళా ప్రయోజన పద్ధతుల్ని మనం సమగ్రంగా అర్థం చేసుకోవడానికి అరిస్టాటిల్ అనుకరణ సిద్ధాంతం అత్యంత ఉపయోగమైంది. అరిస్టాటిల్ దృష్టి కావ్యం మీద, అంటే నాటకం మీద లగ్నమైంది. దానివల్ల ప్రభావితులైన వాళ్ళతోటి ఆయనకు పనిలేదు. దాన్ని సృష్టించిన వాడితోటీ ఆయనకు అంతగా పనిలేదు. ఆయన కావ్యానుశీలన పద్ధతి చక్కని రసదృష్టితో ఉంటుంది. దీనికి ప్లేటో వ్యతిరేకం. రచన అంత ముఖ్యం కాదు. కవి ముఖ్యం. శ్రోత కూడా ముఖ్యమే.

లేఖనం కనుగొన్న తర్వాత సమష్టి నుండి వ్యష్టికి కవిత్వం మార్పు చెందుతున్న కాలంలో, ఆదిమ సమాజంలో కవి ప్రయోజనాదుల్ని గురించి అధికారికంగా కొంతవరకైనా చెప్పేటట్లు చేసేది సంస్కృతి కాదు. గ్రామ్యతే. ఎంతో ప్రతీపబుద్ధి కలిగి ఉన్న ప్లేటో విషయంలో కావ్య నిర్మాణం చేయగలిగే మానసిక విజ్ఞానం చాలా ప్రాథమిక విషయమే.

ప్లేటో - అయస్కాంత శక్తి ఉపమానం

'ప్లేటో పూర్వకాలపు మనిషి. తన కళ్ళముందు వచ్చిన మార్పుని కూడా ఆయన గమనించలేదు. అంతకు మునుపు లాగా అతని కాలంలో కవిత్వమంటే ట్రాజెడీయే కాదు. ప్రేక్షకులూ, నటులూ అందరున్నూ కలిసి మిక్కిలి ఉత్సాహంతో జరుపుకొనే ఒక సామూహికోత్సవం. అందరూ కలిసి విహరించే ఒక కళాప్రపంచం అప్పటి ట్రాజెడీ. ప్లేటో కాలంలో స్థితి వేరు. సామూహికమైన సంఘజీవితం నుంచి విడిపోయిన వ్యక్తులు, లేక వ్యక్తుల గుంపులు అనుభవించడం కోసంగాను కావ్యాలు సంఘం నుంచి తొలగిపోయి చాలా దూరం నిలబడ్డవి.

లేఖనం కనుగొనడం ఈ విషయంలో చాలా మార్పులకు దోహదం చేసింది. లేఖనం వచ్చినందువల్ల బహువిషయాల్ని జ్ఞాపకం పెట్టుకోవాల్సిన అవసరం లేకుండా పోయింది. జ్ఞాపకం ఉంచుకొన్నవాడు చెప్పడం, మిగిలినవాళ్ళు వినడం పోయింది. రాసిపెట్టిన విషయాలను ఎవరికివారు చదివి తెలుసుకోగల్గుతున్నారు. కవిత్వం రాతరూపంలో వ్యక్తమవుతోంది. అది సామూహికమైన సంఘశక్తిచేత ఉత్పన్నం కాదు. అట్లాగే అనుభవం సందర్భంలో కూడా సంఘసమూహంతో దానికి నిమిత్తం లేదు. ఒంటరిగా ఎవడికి వాడు దాన్ని చదువుకొని అనుభవించవచ్చును.

కాని ప్లేటో ఈ మార్పుల విషయం పట్టించుకోలేదు. వర్గభేదం ఏర్పడని సమాజంలో సామూహికోత్సాహాల కాలానికి ఆయన విమర్శనలు సరిపోతాయి. అవి సత్యాలే. కాని పనికిమాలినవి. ఎందుకంటే తాను నిరసిస్తున్నవి తన కాలంలో వచ్చిన వర్గ సమాజం యొక్క ఆర్థిక విధాన లక్షణాలని ఆయన గుర్తింపలేకపోయాడు. అందువల్లే ఆయన ముందుకు సాగి, వర్తమాన సమస్యలకు ఒక పరిష్కార మార్గ స్థితిని పొందలేకపోయాడు. ఈ సమస్యలు పుట్టని కాలానికి – అంటే వెనుకకు సాగి చేరుకొన్నాడు. చరిత్ర అనే గడియారపు ముల్లును ఎవ్వడూ వెనక్కు తిప్పలేదు.

ఫాసిస్టు తాత్వికుల్లో ప్లేటో చాలా నాగరికుడు. ఎంతో మానవతా దృక్పథం ఉన్నవాడు. ఈనాటి ప్రతీప తాత్వికులలో ఎవ్వడు కూడా ప్లేటో అంత నాగరికుడు కాడు. ఆయనలాగా చిత్తాకర్షణ చేయగలిగే వాడున్నూ కాడు. ప్లేటో కవిని గురించి ఇలా భావించాడు. "నిన్ను కదిలించేది ఒక దైవీశక్తి ప్రభావం. అది ఆయస్కాంత శిలలోని ఆకర్షణ శక్తిలాంటిది. ఈ శక్తి చాలా విచిత్రమయింది. అది ఒక్క ఇనుప వస్తువుని ఆకర్షించడం మాత్రమే కాదు. తాను ఆకర్షించిన దానికి మరింకొక దానిని ఆకర్షించే శక్తిని అది ప్రసాదిస్తుంది. ఆయస్కాంత శక్తి ఆ విధంగా తన ప్రభావంలోకి వచ్చిన ఇనుప కొక్కేలన్నింటి గుండా తాను సంచారం చేసి, వాటన్నింటినీ ఒక్క గొలుసుగా కలుపు తోంది. వాగ్దేవత ఆయస్కాంత శక్తిలాంటిది. అది ముందు కవికి ఒక ఆవేశాన్ని కల్గించి, అతని ద్వారా అలాంటి సమాన ధర్ములనందర్నీ ఆవేశపరుస్తుంది. ఆ విధంగా కవిని, సహృదయ సమాజాన్ని వాగ్దేవత తన శక్తిచేత నిబంధించుతుంది."

మనమిప్పుడు బ్రహ్మాండంగా మెచ్చుకొనే మన పూర్వకవుల కావ్యాలు – కావ్యకళా నియమానుసారంగా రచించటం వల్ల గొప్పదనాన్ని పొందలేదు. అవన్నీ వాగ్దేవతా ప్రసాదం వల్ల సిద్ధించిన మహావేశంచేత నిండిన కవి హృదయం తంత్రీ లయాన్వితమైన భాషలో ఆవిష్కరించిన భావానుభూతులు.

ఆ విధంగా కవులు దైవీప్రేరణ పొందిన స్థితిలో మహాకావ్య గీతాలు ఆవిర్భవిస్తాయి. ఈ ఆవేశంలో ఉన్నప్పుడే శ్రోతల్ని ఉర్రూతలూగించే మధుర నాదావిష్కారం జరుగుతుంది. పూనకం వచ్చిన జానపదులు ఆవేశించిన దేవతా ప్రభావంతో అద్భుతాల్ని ప్రదర్శిస్తారు. తేనెల్ని, పాలనీ నదుల్లోంచి దోసిళ్ళతో తాగిస్తారు. ఆవేశం పోయి మామూలు స్థితికి వచ్చినప్పుడు పాలు లేవు, గీలు లేవు. వట్టినీళ్ళే మిగిలేది. కవుల హృదయాల్లో ఈ పవిత్రాద్భుతశక్తి ఉంది. ఉందని కవులే చెప్తారు. కవిహృదయాలు భ్రమరాల లాంటివి. భావ కుసుమాలు రాలిరాలి, అవి ఉద్యానవనాల్లో తేలితేలి, పచ్చిక బయళ్ళలో సాగిసాగి, స్వాదు కవితా మధుమాధుక ప్రవాహాల్లో మునిగిమునిగి మదించిన, బరువైన, నెమ్మదియైన, సుందరమైన నడకల్లో శ్రోతల్ని చేరి సంతోషపెడతవి.

అట్లా భావతీవ్రాకృతి అయిన కవి హృదయం సత్యాన్నే పలుకుతుంది. లోకాతిశాయి అయిన చిత్తవృత్తుల్ని కవి కలిగి ఉంటాడు. రెక్కలు కట్టుకొని మహోన్నతమైన సీమలకు ఎగరగల్గుతాడు. పుణ్యశీలుడు. అలాంటి భావావేశంతో నిండేటంత వరకు కవి కవిత్వం రాయలేడు. హేతు విచారణ బుద్ధి లక్షణం ఉన్నంత వరకు ఎవ్వడూ కవిత్వం చెప్పలేడు. భవిష్యత్తును దర్శింపలేడు. దైవీశక్తి ప్రేరితుడు కావడాన్ని బట్టి, కావ్య సరస్వతి వారికి ప్రసన్నురాలు కావడాన్ని బట్టి కవులలో అంతస్తులుంటాయి. ఆ ప్రేరణ, ఆ ప్రసన్నత లేకుంటే వాళ్ళు చేయగల్గిందేమీ లేదు. వాళ్ళెందుకూ పనికిరారు. ఇట్లా అనడం ఎందుకంటే, వాళ్ళు తాము చదివి సంపాదించుకొన్న కావ్యకళా లక్షణ వ్యుత్పత్తి మీద ఆధారపడి కాదు కవిత్వం చెప్పేది. అంతర్వాణి ప్రభావం యొక్క ఆవేశ తీవ్ర బుద్ధితో చెప్తారు. శాస్త్ర నియమానుసరణంతో ఏ విషయాన్నైనా పట్టుకొని మంచి కవిత్వం రాయగల్గడం వాళ్ళకు తెలియదు.

కవులకీ, మతప్రవక్తలకీ, ఎరుకతలకీ భగవంతుడు హేతువిచారణ బుద్ధిని పూర్తిగా పూజ్యం చేశాడు. ఎందుకంటే తన అస్తిత్వాన్ని నిలబెట్టుకోవడానికి, తన మహిమల్ని వ్యాఖ్యానించి ప్రదర్శించడానికి అలాంటి వాళ్ళే కావాలి కనుక, పరమాద్భుతంగా రచనలు చేసే వాళ్ళు భగవత్ప్రేరణ వల్లనే మనకోసం కవిత్వం చెప్తారు.

శ్రోతల చిత్తాన్ని వశపర్చుకోగల్గిన చమత్కారమైన వాగ్విన్యాసం నుంచి ఇక్కడ ప్లేటో కవిత్వాన్ని వేరేగా చూపించాడు. ఆ చమత్కారమైన వాగ్విన్యాసానికి కొన్ని రచనా నియమాలున్నాయి. దాన్ని జాగ్రత్తగా నేర్చుకోవాలి. ప్లేటో దృష్టిలో కవిత్వం తెలిసి చేసే పని కాదు. తెలిసి చేస్తే దానికో నియమం, ఒక ఆలోచన ఉంటాయి. కవిత్వానికి అవి లేవు. భగవదావేశం వల్ల కవిత్వం వస్తుంది. ప్లేటో కవినీ, మత ప్రవక్తను, ఎరుకతనీ సమానంగా చూశాడు. ఆదిమ సమాజం నాగరికతని సమీపిస్తున్న దశ. ప్లేటో ఈ ఆవేశం కవికే కాక పాఠకుడికి కూడా ఉండాలని చెప్పాడు. కవిని గురించి ప్రసంగించేవాడూ, కవి యొక్క కవితా ప్రభావం సోకిన భావుకుడున్నూ భగవదావేశపూరితులు కావాలి.

కవిత్వ రచనే కాక దాని అనుభావం కూడా వ్యక్తి చైతన్యమూలకం కాదనేదే దీనికంతటికీ తాత్పర్యం. మాయ చేయడంకూడా ప్లేటోకు ఒక రకం మంత్ర విద్యావేత్తృత్వమనే అభిప్రాయం. కవులు మాంత్రికులు. వాళ్ళు మతానికి సంబంధించిన శక్తుల్ని మాత్రమే ప్రదర్శిస్తుంటారు. ప్లేటో చెప్పిన ఆయస్కాంత శక్తి విషయాన్ని బట్టి కూడా ఆయన ఆదిమ మానవ సమాజంలోని సమూహ లక్షణాలచేత కూడిన కవిత్వాన్ని గురించే మాట్లాడుతున్నట్లు స్పష్టమౌతుంది. ఆయన దృష్టిలో ఉన్నదదే. ఆయన ఆదర్శవాది. కావ్య ప్రయోజనం కంటే కూడా కావ్యానందం ఆయనకు ముఖ్యం. అరిస్టాటిల్ ఈ విషయంలో ప్లేటోకు వ్యతిరేకి.

అరిస్టాటిల్ - కథర్సిస్

అరిస్టాటిల్‌కు కవి హృదయంతో నిమిత్తం లేదు. కావ్య నిర్మాణాన్ని, కావ్యానుభావాన్నీ వ్యక్త చైతన్యం చేస్తుందా? అవ్యక్త చైతన్యం చేస్తుందా? అనే విచారణ ఆయనకు అక్కరలేదు. నిర్మిత కావ్యమే ఆయనకు ముఖ్యం. దాన్నిబట్టే విమర్శ, విచారాలు ఉండాలని ఆయన చెప్తాడు. వాటిని ఆ విధంగానే ఆయన క్రమబద్ధం చేసి, విషయానుగుణంగా చేసి, కావ్యమంతా

కొన్ని నియమాలకు లొంగి వచ్చేటట్లుగా చేస్తాడు. అందువల్ల అనుకరణ సిద్ధాంతం నిరాఘాటంగా అంగీకరింపదగిన హేతువుల్ని అన్వేషించి, సూత్రీకరించినట్లుగా ఆయన రచించాడు.

ప్లేటో కంటే అరిస్టాటిల్ ఒక అడుగు ముందుకు వేసి, ట్రాజెడీ యొక్క సాంఘిక ప్రయోజనం ఏమిటని ఆలోచించాడు. అది కథర్సిస్ అని చెప్పాడు. కానీ ఆ మాటకు స్పష్టార్థ ప్రతిపత్తి లేదు. కొందరు ఫ్రాయిడ్ అనుయాయులు అరిస్టాటిల్ చెప్పింది, ఫ్రాయిడ్ ప్రవచించినటువంటి 'థెరపీ బై ఆబ్రియాక్షన్' కంటే భిన్నం కాదన్నారు. కానీ అది వేరు. ఇది వేరు. అట్లా చెప్పడం రెండింటికి సంబంధించిన మిడిమిడి జ్ఞాన లక్షణం తప్ప మరేమీ కాదు. కావ్య ప్రయోజనాన్ని గురించి మనకు ఒక స్పష్టమైన అభిప్రాయం ఏర్పడి, అరిస్టాటిల్ అభిప్రాయాల్ని మన వాటితో పోల్చి చూచుకోగలిగేటంత వరకూ, అరిస్టాటిల్ కథర్సిస్‌ను గురించి మనమంతగా దూరం పోయి విచారించకుండుటయే మంచిది. ట్రాజెడీ విషయంలో ఆయన చూచిందిది. ప్రేక్షకునిలో సుఖకరాలు కాని భయము, ఆతురత మొదలైన అనుచిత వృత్తుల్ని ట్రాజెడీ కల్పిస్తున్నది. ఇంకా అది ప్రేక్షకుల్ని ఆ అనుభవానికి తిరిగి ఆకర్షిస్తున్నది. ఆ అనుభవం సుఖకరం కాకపోయినప్పటికీ ప్రేక్షకులు మళ్ళీ వస్తున్నారు. కనుక వారికది కొంత మంచి చేసిందనే చెప్పాలి. మింగడానికి చేదైన మందులు ఆరోగ్యాన్ని కలిగిస్తున్నవి కదా! అందువల్ల అరిస్టాటిల్ ట్రాజెడీలు ప్రేక్షకుల హృదయ మాలిన్యాల్ని ప్రక్షాళనం చేసి, మనస్సుని నిర్మలం చేస్తవని భావించి ఉండొచ్చు. ఒక విరేచనం మాత్ర కడుపులో కుళ్లును బయటకు నెట్టివేసి, కడుపును శుభ్రపరుస్తోంది కదా!

ఇంత వాస్తవిక దృక్పథంతో అరిస్టాటిల్ ట్రాజెడీ ప్రయోజనాన్ని భావించడం ఆరోగ్యకరమైన మంచి విమర్శనా పద్ధతి. అది అచ్చమైన గ్రీకు పద్ధతి. ట్రాజెడీ కనుక ప్రేక్షకుల్ని నిర్మలచిత్తులుగా, అంతకు ముందుకంటే సుఖంగా ఉండడాన్ని భావింప జేయజాలకపోతే, అది ట్రాజెడీ అయినా కూడా చెడ్డదనే అర్థం.

గ్రీకు దృక్పథం - ముగింపు

వర్గభేదం అప్పుడే మొదలవుతున్న కాలంలో బుద్ధిమంతులైన గ్రీకుల సాహిత్య దృక్పథం ఇది. సభా వేదికల మీద నుండి శ్రోతల్ని ఉర్రూతలూగించే గంగాప్రవాహం లాంటి వాక్య విన్యాసం యొక్క విలక్షణమైన విజ్ఞానంతో భాషా ప్రయోగ నైపుణ్యం మంత్రముగ్ధుల్ని చేసే సంభాషణా చాతుర్యం – ఇదంతా ఒక కళ. తెలిసి, నేర్చి, అభ్యసించాల్సింది. ఇంకోటి కావ్యకళ. అది అనుకరణ కళ. వాస్తవానుకరణ శీలమైన కావ్యకళ. అది విన్నవాళ్ళల్లోనూ, కన్నవాళ్ళల్లోనూ భావ అనుభావ తీవ్రతను బట్టి దాని విలువలు నిర్ణయమౌతాయి. ఈ విషయంలో ప్లేటో, అరిస్టాటిల్ ఇద్దరూ ఏకీభవిస్తారు. కానీ ప్లేటో మాత్రం ఆ తీవ్రత కావ్య నిర్మాణ దశలోనూ, అనుభావ దశలోనూ కూడా నియమాలను అనుసరించడం వల్ల సాధించలేమని భావిస్తాడు. వ్యక్త చైతన్యం పరిధికి అవతలే కావ్య నిర్మాణమూ, అనుభవ ప్రశస్తి రెండున్నూ జరుగుతాయని ఆయన విశ్వాసం. మరి ప్లేటో, కావ్యానికి సాంఘిక ప్రయోజనం ఉంటుందని అనుకోనే అనుకోడు. ఈ విషయాన్ని మనస్సులో పెట్టుకునే అరిస్టాటిల్ కావ్య శ్రవణం వల్ల కానీ, దర్శనం వల్లగానీ కలిగే తీవ్రమైన భావ అనుభావాలు సాంఘిక ప్రయోజనాన్ని సాధిస్తాయని చెప్పాడు. కథర్సిస్ అది ఆ ప్రయోజనమే.

ఆ మాత్రపు ప్రయోజన దృష్టితో చేసిన కావ్య నిర్వచనం ఈ కాలానికి పనికిరాదు. గ్రీకులు తప్పు చెప్పారని కాదు, పనికిరాదనడం. సంఘం మారిపోయింది. ఈనాడు అరిస్టాటిలే కనుక ఉండి, నేటి సాహిత్యాన్ని క్రమబద్ధం చేసి వింగడిస్తున్నట్లయితే, ఆయన తన అనుకరణ సిద్ధాంతం ఈనాటి సాహిత్య ప్రక్రియలన్నింటినీ ఒక గాటికి లాగి కట్టడానికి అవకాశం లేకుండటాన్ని తప్పక చూసికొని ఉండేవాడు. అది ఆయన సిద్ధాంతంలోని లోపం కాదు. సాంఘిక పరిణామ మహస్సు సాగిన ఇంతకాలం మీద కొత్త కొత్త ప్రక్రియలెన్నో పుట్టుకొచ్చాయి. అందువల్ల అన్నింటికీ అనుకరణ సిద్ధాంతం పట్టదు.

ఆధునిక కాలంలో వచ్చిన నవల–నాటిక – ఈ రెండు ప్రక్రియల్లోనూ వాస్తవిక సత్యానుకరణం ఉంది. మనం కవిత్వమని దేన్ననడానికి అందరమూ అంగీకరిస్తున్నామో, అది నవలా నాటకాల కంటే భిన్నమైంది. దాని ప్రత్యేకత్వాన్ని మనం కనుగొనాలి. ఇక మీదట మనమా ప్రయత్నం చేద్దాం.

కానీ అరిస్టాటిల్ చెప్పిన నిర్వచనాన్ని బట్టి మనం కవిత్వ మూలతత్వాన్ని విచారిస్తే, ఇతర సాహిత్యమంతా కవిత్వమే కాబట్టి, విస్మరించలేము. భౌతిక దృక్పథంతో సంస్కృతీ సంప్రదాయ అధ్యయనం చేస్తే, మనం ఆ విస్మరించడమనే పొరపాటు చేయనే చేయము. మతము–సాహిత్యము మొత్తం ఒక కవిత్వ రూపంలోనే ఉన్న కాలం ఒకనాడుందని మనకు తెలుసును. అయినా ఆధునికులుగా, పెట్టుబడిదారీ యుగంలో నివసించే జనంగా మనం ముఖ్యంగా బూర్జువా కవిత్వ తత్వాన్ని అధ్యయనం చేయాలి. ఆధునిక కవిత్వాభివృద్ధికి సంబంధించిన స్థూల చారిత్రక దృక్పథంతో అధ్యయనం దీని తర్వాత చేద్దాము.

ఆధునిక కవిత్వం - బూర్జువా కవిత్వం

ఆధునిక కవిత్వం అంటే అది బూర్జువా కవిత్వం అనే అర్థం. ఇంతకూ మనం దేన్ని ఆధునికత అంటున్నాం? పదిహేనవ శతాబ్దం నుండి నేటి వరకూ యూరపు ఖండంలో అభివృద్ధి అయిన నాగరికత యొక్క మొత్తం ప్రత్యేకత్వాన్ని ఆధునికత

అంటున్నాము. ఈ ప్రత్యేకత ఒకానొక ఆర్థికమైన పునాది బలం మీద ఆధారపడి ఉంది. ఈ ప్రత్యేకత ఇంకా మార్పు లక్షణాన్ని కలిగి ఉంటుంది. ఆర్థికమైన పునాదులు పాలెగాండ్ర (ఫ్యూడల్) నుండి పారిశ్రామికుల వైపుకు మారినవి. ఈ నాగరికత యొక్క ప్రత్యేకత ఉత్పత్తిలో బూర్జువాలు తెచ్చిన విప్లవ స్వరూపానికి సంబంధించింది. ఈ విప్లవ స్వభావాన్ని మార్క్స్ సంపూర్ణంగా విశ్లేషించి 'దాస్ కాపిటల్'లో వివరించాడు. ఆ లెక్కలో ఆధునిక కవిత్వం అని మనం అనేది పెట్టుబడిదారీ కవిత్వమే.

ఈ ఆధునిక కవిత్వం మనకు చక్కగా అర్థం కావాలంటే దీన్ని మనం గతితార్కిక చారిత్రక దృక్పథంతో అధ్యయనం చేయాలి. అలా కాకుండా కవిత్వాన్ని చైతన్య రహితమూ, జడమూ అయిన కళగా భావించి అధ్యయనం చేస్తే, అది ఆ విధంగా మాత్రమే మనకు అర్థం అవుతుంది. అది బొత్తిగా వ్యర్థమైన పని. విపరీత చైతన్యం ఉన్న సంఘ శక్తి చేత ఉత్పన్నం అయిన కవిత్వం ఉన్నప్పుడు, దాన్ని అసలు అట్లా అధ్యయనం చేయనే కూడదు. అందువల్ల అట్లా చేయడం వ్యర్థం.

కానీ బూర్జువా నాగరికత కాలంలోని కవిత్వాన్ని అధ్యయనం చేయడం అంత సులభ సాధ్యమైన పని కాదు. ప్రపంచంలోని చాలా జాతులు, చాలా భాషలు బూర్జువా నాగరికత యొక్క మహోద్యమంలో భాగస్వామ్యాన్ని పొందాయి. ఏదేమైనా కవిత్వాన్ని అర్థం చేసుకొని ఆనందించాలంటే, అది ఏ భాషలో రాసి ఉందో ఆ భాషలో అత్యంతమైన అభినివేశంతో గాఢమైన పరిచయం ఉండి తీరాలి. సాహిత్య ప్రక్రియలన్నింటిలోనూ ఒక్క కవిత్వానికే ఈ ప్రత్యేకత ఉంది (9).

ఇంగ్లాండ్, ఫ్రాన్స్ విప్లవాలు

ఇంగ్లాండ్‌లోని బూర్జువాలే మొట్టమొదట ఆర్థిక విప్లవాన్ని తెచ్చారు. వాళ్ళను చూసే తక్కిన దేశాల వాళ్ళు ఆ మార్గాన్ని అనుసరించారు. క్రీ.శ. 1789-1871 సంవత్సరాల మధ్యకాలంలో ఫ్రాన్స్ దేశంలో ఈ బూర్జువా విప్లవం ఇంగ్లాండ్‌లో కంటే ఒక ప్రత్యేక మార్గంలో సాగింది. దాని గమనంలో ఒక విపరీతమైన వేగం ఉంది. దాని స్వరూప స్వభావాల్లో ఒక స్పష్టమైన ప్రతిపత్తి ఉంది. దాని ప్రవృత్తిలో ఒక గట్టితనం ఉంది. దాని ఆదర్శ స్వరూపం ఎక్కువ గందరగోళం పట్టిన దాని విపరీత వేగం వల్లనే.

బూర్జువా సాహిత్యాన్ని మొత్తంగా అధ్యయనం చేయడానికి ఆ కాలంలోని ఫ్రాన్స్ విప్లవం ఎంతో ముఖ్యమైనది. కేవలం కవిత్వాధ్యయనానికి అయితే ఇంగ్లాండ్ విప్లవం ముఖ్యం. ఆధునిక కవిత్వంలో వైవిధ్యానికి, విస్తృతికి ఇంగ్లాండే బాగా దోహదం చేసింది. అది ఇంకా మూడు శతాబ్దాల పాటు ప్రపంచ రాజ్యాల్ని పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థకు అభిముఖం చేసి నడిపించింది. ఆ కాలంలో ఆయా దేశాల్లోనే ఈ ఆధునిక కవిత్వం అభివృద్ధి అయ్యేటట్లుగా కూడా అది చూసింది. ఆ ఆర్థిక వ్యవస్థా, ఈ కవిత్వాభివృద్ధి రెండున్నూ పరస్పర సంబంధం లేనివి కావు. చారిత్రక గతిలో ఆ సంబంధంతో వృద్ధి కావడం ఒక భాగం. చారిత్రకంగా బూర్జువాలు ఎంతో విప్లవాత్మకమైన పాత్ర నిర్వహించారు.

బూర్జువా యుగం - నిరంతర విప్లవం

సంఘ జీవితంలో అధికారికంగా తమది పైచెయ్యి అయినప్పుడు బూర్జువాలు పాలెగాళ్ళనూ, పురోహిత వర్గాన్ని అణగదొక్కారు. ఆ విషయంలో కొంత నిర్దాక్షిణ్యంగా కూడా ప్రవర్తించారనవచ్చును. ఇంకా బూర్జువాలు ఉత్పత్తి సాధనాల విషయాలకూ, దాని ద్వారా ఉత్పత్తి సంబంధాల విషయంలోనూ, వాటితో బాటు సాంఘిక వ్యవస్థ విషయంలోనూ తరచుగా విప్లవాన్ని కొని తెస్తుంటారు. దాన్ని తేకుండా వాళ్ళు బ్రతకలేరు.

ఉత్పత్తి విషయమైన నిరంతర విప్లవం, అనివార్యమైన సాంఘిక వైపరీత్యాలు, ఎడతెగని అనిశ్చిత పరిస్థితులతో ఆందోళన - ఇవి బూర్జువా యుగాన్ని ముందు వెనుకల నుండి వేరు చేసి ప్రత్యేకంగా చూపేవి. పెట్టుబడిదారీ కవిత్వం ఈ విషయాల్ని ప్రతిబింబిస్తుంది. ఈ పరిస్థితుల నుంచే ఆ కవిత్వం పుట్టుకొని వచ్చింది. భేదభావం లేని ఆదిమ సమాజం యొక్క మనోమయ కోశం నుండి కవిత్వం ఆవిర్భవించింది. కవిత్వానికి అందువల్లే పౌరాణికత్వం ఏర్పడింది. వర్గ సమాజం ఏర్పడిన తర్వాత కవిత్వం పాలకుల చేతి కళ అయి, మత విషయమైన సంబంధాల నుండి వేరు పడింది.

బూర్జువా ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తి సాధనాల్లో ఎట్లా తరచుగా నిరంతర విప్లవం వస్తుందో, అట్లాగే కళాభిరుచుల విషయాల్లోనూ తన విశ్వాసాన్ని, సంకేతాన్ని అది తరచు మార్చుకొంటుంది. ఇంతకు ముందు చెప్పిన అన్ని విషయాలకు సంబంధించిన హేతువులలోని ఔచిత్యం - అనిశ్చితత్వం వల్ల కలిగే ఆందోళన - ఇవి బూర్జువా కళాత్మకతను అంతకు పూర్వం నుండి వేరు చేసి చూపుతాయి. బూర్జువా కళాకారుడెవరైనా తన కాలం భావ తీవ్రతల్ని ఎంత పట్టుకొని తరానికి తరం కృషి చేసినప్పటికీ, అది పాండిత్య రూపాన్ని పొంది, ప్రాణరహితమవుతుంది. ఆధునిక ఆంగ్ల కవిత్వమంతా అట్లా తయారయిందే.

కవిత్వం - బూర్జువా తత్వం

కవిత్వం పుట్టుక మనకు తెలుసును. అది ఊరి పండగల్లో సామూహికమైన భావోద్వృత్తుల నుండి పుట్టింది. అది ఆర్థికమైన సర్దుబాట్ల అవసరాల చేత నియతమవుతున్న సంఘ సామూహిక చైతన్య ప్రతిబింబం. అదొక వర్గ సమాజ నాగరికత, దాని వ్యక్తిత్వమే దానిని సంపాదించింది. అయితే బూర్జువా తత్వం కవిత్వానికి అనుకూలమైంది కాదు. వ్యతిరేకమైంది కూడా. ఏమంటే,

కవిత్వం సామూహిక లక్షణం నుండి రావాలి. బూర్జువా తత్వం వైయక్తిక లక్షణం నుంచి బయలుదేరింది. అందువల్లే ఆ రెంటికీ పొత్తు పొసగేటట్లుగా కనిపించడం లేదు (10).

బూర్జువా తనని ఒక మహా పురుషుడుగా భావిస్తాడు. తానే సర్వతంత్ర స్వతంత్రం కోసం పోరాడుతున్నట్లుగా అనుకొంటాడు. సాధారణ మానవుణ్ని–స్వేచ్ఛగా పుట్టి, బతుకంతా బంధనాలతో బతికే వాడ్నీ, బంధించి పెట్టే అన్ని సాంఘిక సంబంధాలతోనూ తానొక్కడే వైయక్తికంగా ఎదురు తిరిగి పోరాటం సాగిస్తున్నట్లు తనను తాను విశ్వసిస్తాడు. నిజానికి అతని వైయక్తికత సశాస్త్రీయమైన ఎడతెగని అభ్యుదయాన్ని సాధించదు. అందువల్ల అతడు సాధించే స్వాతంత్ర్యం అంతంత మాత్రంగానే ఉంటుంది. పాలెగాండ్ర సాంఘిక వ్యవస్థపైన బూర్జువాలు చేసిన తిరుగుబాటు వల్ల సంఘంలోని ఉత్పాదక శక్తులకు కొంత స్వేచ్ఛ లభిస్తోంది. వాటి వైయక్తిక ముద్ర బూర్జువా ఆర్థిక మౌలిక విధానంలోని నిరంతర విప్లవ దృష్టిని ఇంకా అధికంగా పెంచుతుంది.

బూర్జువా కవి - పగటి కల

బూర్జువా కవి కూడా తన వ్యక్తిత్వం వైపే తాను చూసుకొంటాడు. తన హృదయాన్ని ప్రకటించుకోవడం ద్వారా స్వాత్మ దర్శనాన్ని అతడు అభిలషిస్తాడు. ఇది బూర్జువా పగటి కల. తానొక్కడే ఈ దృశ్య ప్రపంచ నిర్మాతను అనేటటువంటి కల అది. బూర్జువాలకు తమ వ్యక్తిత్వం మీద ఇంత ప్రత్యయం ఏర్పడ్డానికి హేతువు, పాలెగాళ్ళ సాంఘిక మర్యాదల్ని తుడిచి పెట్టాలనే కోరికే. ఆ కోరికే ఉత్పత్తి సాధనాల విషయంలో బ్రహ్మాండమైన శాస్త్రీయ అభివృద్ధినీ, ప్రగతిని సాధించింది. ఆ విధంగానే కవిత్వంలో, రచనా శిల్ప విషయంలో గణనీయమైన ప్రగతిని బూర్జువా వ్యక్తిత్వ దృష్టి సాధించింది. కాని ఇందులో అభ్యుదయ పథంలో పయనించే లక్షణం లేదు.

త్వరలోనే పెట్టుబడిదారు తన అహంకార దృష్టి, తన సర్వతంత్ర స్వతంత్రత పట్టి యుద్ధోన్మాదాన్ని, అరాజకాన్ని, ఆర్థిక మాంద్యాన్ని, విప్లవాన్ని మొదలైన వాటిని మాత్రమే సృష్టిస్తున్నట్లు తెలిసికొంటాడు. అతడు ప్రవేశపెట్టిన యంత్రం, తన వస్తూత్పాదక శక్తి తీవ్రత చేత చివరకు అతన్నే భయపెడుతుంది. మార్కెట్ కూడా ఒక భయంకరమైన ప్రకృతి శక్తిగా తయారవుతుంది. అప్పుడది చేలో పడ్డ గుడ్డెద్దులాంటిది.

మార్కెట్ - పోటీ

ఆ మార్కెట్ ద్వారా పెట్టుబడిదారు తన తోటి పెట్టుబడిదారుని శంకరగిరి మాన్యాలు పట్టిద్దామని చూస్తాడు. నిరంతరం వదలకుండా అతడీ ప్రయత్నాన్ని చేస్తూనే ఉంటాడు. దాని ఫలితంగా నిన్నటి స్వతంత్ర వృత్తివాడు రేపు ఫ్యాక్టరీ పనివాడవుతాడు. ఈ సంవత్సరం సొంతంగా కొట్టు పెట్టుకొని వ్యాపారం చేసేవాడు, మరుసటి సంవత్సరం దాన్ని మానుకొని ఎక్కడో ఒకచోట స్టోరు మేనేజరవుతాడు. ఈ వారం బడ్డీకొట్టు పెట్టుకొన్నవాడు దాన్ని వదిలిపెట్టి, వచ్చే వారానికి ఒక పెద్ద కంపెనీలో ఏదో ఇంత జీతం మీద కొలువు చేసేవాడవుతాడు.

ఈ విధంగా పెట్టుబడిదారీ విధానం విప్లవ ఫలితాన్ని సాధిస్తుంది. ఇదంతా అంటే ఈ వ్యక్తిత్వం, ఈ స్వతంత్రత, ఒక విచిత్రమైన అస్వతంత్రతను, పెట్టుబడికయ్యే మూలధనం మీద ఆధారపడేదాన్ని సృష్టిస్తుంది. ఇట్లా ఈ మార్కెట్టు విధానం తాను ఆశించిన, తనకు అనుకూలమైన ఫలితాన్ని కాక, తాను ఆశించని, తనకు అననుకూలమైన ఫలితాల్ని తెచ్చి పెట్టడం చేత బూర్జువా ఆ వ్యవస్థ మీద తిరగబడి, ఇంకా అంతకంటే మంచి మార్కెట్టును, మంచి తీవ్రమైన పోటీని సృష్టించడానికి ప్రయత్నిస్తాడు. ఇట్లా ఈ ప్రయత్నం కొనసాగిన కొద్దీ తాను ఆశించిన ఫలితాలు రాక, తాను ద్వేషించి వదిలించుకోవాలని చూసిన బానిసత్వమే ఇంకా చెట్టుకట్టుకొని వస్తుంది. ఈ విధంగా నిజమైన స్వతంత్రత ఎప్పుడూ బూర్జువాకు అందీ అందక పోతుండడం వల్లనే, అతడు ఎప్పుడూ స్వేచ్ఛావృత్తిని గురించి మాట్లాడతాడు.

బూర్జువా కవి - ఏకాంతం

బూర్జువా కవి కూడా సరిగ్గా పైన చెప్పిన గాడిలోనే పడి తిరుగుతాడు. తనకున్న స్వాతంత్ర్యం వట్టి బలవంతపు బ్రాహ్మణార్థంగానూ, పది కాలాలపాటు పనికివచ్చేది కానిదిగానూ చూసుకుంటాడు. అందువల్ల ఒక ఏకాంతాన్ని అతడు అనుభవిస్తాడు. ఈ విశ్వాసానికి చెందిన, విశ్వాంతరానికి చెందిన విషయానుభూతి క్రమంగా తన అభిరుచికి దూరమైందిగానూ, తన స్వాతంత్ర్యాన్ని అరికట్టేదిగానూ బూర్జువా కవికి అవగతమవుతుంది. సాంఘిక మర్యాదలన్నింటినీ అతడు తన హృదయం నుంచి దూరం చేస్తాడు. దానితో అతడు అల్పుడుగా, దివాలా తీసినవాడుగా, స్థిమితం తప్పిన వాడుగా అయ్యి, అణగదొక్కబడుతున్నట్లు అనుభూతిని పొందుతాడు.

ఈ విధంగా బూర్జువా వ్యక్తిత్వ దృష్టి వ్యక్తిత్వాన్ని నశింప చేసింది అవుతుంది. సాంఘికమైన బంధనాల్ని నిర్మూలించడం కోసమైన ఆ బూర్జువా ఆర్థిక విధానం చివరకు అంతకు మునుపు కనీవినీ ఎరుగని బలవంతాలైన కట్టుబాట్లతో ఒక గందరగోళమైన సంఘాన్ని సృష్టిస్తుంది. స్వాతంత్ర్యం కోసం బూర్జువా పడిన తహతహ అతడికి అస్వతంత్రతను ప్రసాదిస్తుంది. అతడు చేసిన ప్రతిపనీ ఆతడు ఆశించిన దానికి పూర్తిగా వ్యతిరేక ఫలితాల్ని కల్గిస్తుంది (11). పెట్టుబడిదారీ వస్తూత్పత్తి విధాన మూలసూత్రాలలోనే ఈ స్వభావ వ్యాఘాత లక్షణం ఉంది. దీనివల్లే ఉత్పత్తి తేవాల్సినంత లాభాన్ని తేలేదు.

ఎక్కడ చూసినా నిరుద్యోగం విలయతాండవం చేస్తుంది. ప్రపంచానికొక విషమ పరిస్థితి ఏర్పడుతుంది. పెట్టుబడిదారీ విధానం క్రమంగా క్షీణిస్తుంది. అది ఒక మహాయుద్ధానికి గానీ, విప్లవానికి గానీ దారి తీయవచ్చును. ఈ చివరి దశలో కాని బూర్జువాకు తన స్వేచ్ఛా విధానమే తనకు బంధనమయి, అవసరాలు బలవంతాలై తనను బానిసగా చేసికొంటున్నవని తెలిసిరాదు. అంతకంటే అతడు చేయగలిగిందీ లేదు.

కార్మిక రాజకీయ పక్షం

బూర్జువా వస్తూత్పత్తి విధానం ఆ వర్గం మీద నిర్వహణ భారాన్ని పెంచుతుంది. బూర్జువా ఆర్థిక వ్యవస్థ తన జనాన్ని పట్టణాలకు చేరవేస్తుంది. ఫ్యాక్టరీల దగ్గర గుమికూడుస్తుంది. అట్లా చేసి వాళ్ళు పరస్పర సహకారాలతో పనిచేసేటట్లు చేస్తుంది. పోటీ మనస్తత్వంతో కూడిన జీవన విధానాన్ని బూర్జువా వర్గం తాత్కాలికంగా అరికట్టేందుకు సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని పైకి తీసుకొని వచ్చి ప్రచారం చేస్తుంది. ఈ ప్రచార ఫలితంగా పాలెగాళ్ళ జులుంను తోసిరాజంటుంది. దీనివల్ల కలిగే ఇంకో ప్రయోజనం ఏమిటంటే, కూలినాలి జనానికి ఒక రాజకీయ విద్యా చైతన్యం కలగడం, చివరికి ఆ చైతన్యం వాళ్ళనందర్నీ కలిపి ఒక రాజకీయ పక్షంగా నిలబెట్టడం.

కొత్తగా వచ్చిన ఈ కార్మిక రాజకీయ పక్షం క్రమంగా తాను పరిపాలనాధికారాల్ని చేజిక్కించుకొని, తానే ప్రభుత్వాన్ని నడిపిస్తుంది. అదే ఈ వర్గానికి సర్వతంత్ర స్వతంత్ర దశ. అప్పుడు బూర్జువా సమాజం సొంత ఆస్తిపాస్తులు లేనిదై, తాను కూడా అసలైన సర్వతంత్ర స్వతంత్ర స్థితికి వచ్చి చేరుతుంది. ఇంతకు పూర్వం ఈ బూర్జువా వ్యవస్థలో సొంత ఆస్తుల్ని పెంచుకోవడానికున్న అవకాశాలే దాని స్వాతంత్ర్య లక్షణంగా చెల్లుబడి అయ్యేవి. ఆ వ్యవస్థ దాన్నే స్వతంత్రతగా భావించింది. కార్మిక రాజకీయ పక్షం నడిపించే ప్రభుత్వాన్ని అందుకొన్నాక కాని బూర్జువాలకు తాము అనుకొన్నది నిజమైన స్వాతంత్ర్యం కాదని తెలిసిరాదు. ఇది తెలిసి వచ్చిన తరువాత బూర్జువా వ్యవస్థ లేదు. నీళ్ళల్లో ఉప్పులాగా కరిగిపోతుంది. బూర్జువాతోటే ఆ బూర్జువా ఉత్పత్తి విధానం కూడా మాయమైపోతుంది. అప్పుడు – అసలైన స్వాతంత్ర్యంతో మిగతా జాతి తల ఎత్తుకొని లేస్తుంది.

స్వాతంత్ర్యం అంటే ఏమిటి?

పెట్టుబడిదారి వర్గ సమాజంలో వచ్చినటువంటి కవిత్వాన్ని అర్థం చేసుకోవడానికి ఆ సమాజ స్వభావం మనకు తెలియాలి. బూర్జువా వ్యవస్థలో ఉన్న స్వభావ వ్యాఘాత లక్షణాన్ని మనం గుర్తించి ఉన్నాము. బూర్జువా కవిత్వాన్ని అంత శీఘ్రగతితో, అంత విపరీతంగా అభివృద్ధి చేసేది ఆ స్వవ్యాఘాత లక్షణమే. దైనందిన వాస్తవ జీవిత విధానం ఏది ఉందో అది బూర్జువా ఆదర్శ జీవనానుభూతిని చక్కదిద్దుతుంది. మొత్తం ఏకరూపమైన వాస్తవిక సాంఘిక ప్రపంచమే మొత్తం ఏకరూపమైన కళా ప్రపంచాన్ని పోషిస్తుంది. వాస్తవ సాంఘిక ప్రపంచం సాంఘిక ప్రయోజనాన్ని ఉద్దేశించి ప్రవర్తించేది. బూర్జువా వ్యవస్థలోని వైయక్తిక దృష్టి, స్వభావ వ్యాఘాత లక్షణం స్వాతంత్ర్యం అని భ్రమించి సంకెళ్ళను చేతులకు తగిలించుకోవడం – మొదలైన ఇలాంటి గుణ విశేషాలన్నీ పెట్టుబడిదారీ కవిత్వంలో చోటు చేసుకొంటాయి.

బూర్జువా ఎప్పుడున్నూ సచేతనమైన కార్యకారణ పరిజ్ఞానాన్ని కలిగి ఉండడాన్ని స్వాతంత్ర్యంగా భావించదు. ఆ విషయంలో ఎంత అజ్ఞానం ఉంటే అంత స్వాతంత్ర్యం ఉన్నట్లుగా అనుకొంటాడు. స్వతంత్రతను సంపాదించి పెట్టే సహజ పాండిత్యంలో అతడికి కొంత విశ్వాసం ఉంది. తాను ఏ ఉద్దేశంతో క్రియాశీలుడౌతున్నాడో దాన్ని తెలిసి ప్రవర్తించడం స్వతంత్రమని అతడు అనుకొంటాడు. ఉద్దేశం విషయంలో జాగృతుడు కానివాడు కార్యకారణ పరిజ్ఞానం ఉన్నవాడు కాలేడు. కార్యకారణం అంటే కేవలం అవసరం (నెసెసిటీ) అని అర్థం. కానీ బూర్జువా దీన్ని అంగీకరించదు. అవసరాన్ని అస్వతంత్రతగా అతడు భావిస్తాడు. కాని ఎవడైనా తాను ఏ ప్రయోజనాన్ని ఉద్దేశించి – అంటే ఏ అత్యవసరం ముంచుకొని రావడం చేత తాను ఆయా పనుల్లో ప్రవర్తిస్తున్నాడో – తెలిసి ప్రవర్తిస్తున్నాడో, వాడే నిజానికి స్వతంత్ర బుద్ధి.

అట్లా కాకుండా ప్రయోజన దృష్టి లేక స్వభావ ప్రేరణతో గుడ్డిగా ప్రవర్తించడం పశువులాగా ప్రవర్తించడం. ఎవళ్ళో వెనక నుంచి నెడితే ముందుకు పడ్డ దానికీ, దీనికీ భేదం లేదు. పైన చెప్పినవి తెలిసి ప్రవర్తించడం అన్నది అంతర్దృష్టి వల్ల రాదు. వాస్తవ పరిస్థితులతో తలపడి పోరాటం సాగించడం వల్ల వస్తుంది. ఈ పోరాటం పరిస్థితులని తెలుసుకొని ఉపయోగపెట్టుకోవడాన్ని నేర్పుతుంది. కాని బూర్జువా ఈ విషయాల్ని అంగీకరించదు. అంగీకరించకుండా ఇంకా చిత్రంగా అతడు – తాను బాహిరమైన సాంఘిక బాధ్యతల నుంచి తప్పుకొంటే చాలు, తనకు తాను స్వతంత్రుణ్ణి అని భావిస్తాడు. కాని వెంటనే పెట్టుబడిదారీ ఉత్పత్తికి సంబంధించిన పరిస్థితులు అతణ్ణి తాను నివసించే సమాజంలోని ప్రజానీకంతో ఇంకా ఇంకా సంశ్లిష్టమైన సంబంధాలు పెట్టుకోక తప్పనివాణ్ణి చేస్తాయి. అందువల్ల అతడు అనుకొన్నట్లుగా సర్వస్వతంత్రుడు కాడు. చివరికి అతడు యుద్ధం వల్ల, ఆర్థిక మాంద్యం వల్ల, అనుచితమైన పోటీ వల్ల అణగారిపోతాడు. అతడు చేసిన పన్ల వల్లే అవన్నీ అయినవి. అవి అవాలని అతడు అనుకోకపోవడం అది వేరే విషయం.

స్వతంత్రత ఎప్పుడున్నూ కార్యకారణ రూపమైన నిత్యావసర

హోదా జ్ఞానంలోనే ఉంటుంది. సాంఘిక సంబంధ బాంధవ్యాల నియమ లక్షణం యొక్క అవగాహన లేకుండా మానవుడు ఎప్పటికిన్నీ నిజంగా సర్వస్వతంత్రుడు కాలేడు.

స్వాతంత్ర్యానికి సంబంధించిన, మానవ సహజాతాలతో కూడుకొన్నటువంటి సాంఘిక ప్రయోజనాలకు సంబంధించిన భ్రమ ప్రమాదం బూర్జువాకు బూర్జువా వ్యవస్థలోని అస్తవ్యస్తం నుంచే పుట్టింది. సాంఘికాలు కావాల్సిన ఉత్పత్తి సాధనాలు వ్యక్తిగతమైన సొంత ఆస్తిపాస్తులుగా ఉండడమే అస్తవ్యస్త లక్షణం. తన సాంఘిక సంబంధ నియతి యొక్క వివేకం కలిగిన మరుక్షణం ఇక బూర్జువా బూర్జువా కాడు. మనస్సును ఊరికే ఏకాగ్రం చేయడం మాత్రమే వివేకమూ, జ్ఞానమూ కాదు. అది తీవ్రమైన కర్మాచరణలోంచి పుట్టుతుంది. ఇంకా అది వాడి యొక్క సాంఘిక సంబంధాలను నియమించుకోవడానికి సంబంధించిన ప్రయోగాల నుంచి పుట్టుతుంది. ప్రకృతిని నియమించుకోవడానికి సంబంధించిన ప్రయోగాల నుంచే కదా ప్రకృతి యొక్క స్వభావ పరిజ్ఞానం కలిగింది? ఇదిన్నీ అట్లాగే.

కాని మానవజాతి తన యొక్క సాంఘిక సంబంధ బాంధవ్యాలను ఒక కట్టుబాటుకు తెచ్చే ప్రయత్నం చేయడానికి ముందు దానికా శక్తి ఉండాలి. అంటే సాంఘిక సంబంధాలకు ఆధారభూతమైన "వస్తూత్పత్తి సాధనాల్ని అదుపులో పెట్టుకోగలిగిన శక్తి" అన్నమాట.

పాలెగాళ్ళ పాలన సాగిన కాలంలో బూర్జువాలకు స్వతంత్రత అంటే వాళ్ళ పాలన అంతం కావడం. బూర్జువాలు పాలన సాగించే కాలంలో కార్మికులకు స్వతంత్రత అంటే ఆ ఉన్న పరిపాలనా వ్యవస్థ నిర్మూలనమవడం మాత్రమే. పూర్ణ స్వాతంత్ర్యం ఉన్నటువంటి – అంటే వర్గ రహితమైన సమాజం ఏర్పడడానికి పూర్వం, తత్పూర్వం ఉన్న వ్యవస్థ అట్లాగే కావాలి. అలాంటి సమాజంలో మాత్రమే, సామాజికులందరున్నూ, సంఘానికి అభ్యుదయాన్ని కల్గించే విధుల్ని, అభీష్టానుగుణంగా నియమించుకోవడం ద్వారా, సాంఘిక నియతి యొక్క లక్షణ వివేకం, పరిజ్ఞానం ఎంతో పెంచుకొంటారు. స్వాతంత్ర్యం అంటే అట్లా చేసికోగల్గడమే. సర్వజనుల యొక్క స్వాతంత్ర్య విషయం ఇది. బూర్జువాకి ఇది అక్కరలేదు. అతడు బూర్జువాగా ఉన్నంత వరకూ స్వాతంత్ర్యం యొక్క ఈ నిర్వచనాన్ని అంగీకరించడు. కాని అతడు ఎల్లకాలం అట్లాగే ఉండలేడు.

బూర్జువాలు భావించిన స్వాతంత్ర్యం విషయంలో ఉన్న వైరుధ్యం క్రమంగా ఆ సమాజం క్షీణిస్తున్న కొద్దీ విస్పష్టం కావడం మొదలు పెడుతుంది. ఆ బూర్జువా వర్గం యొక్క స్వాతంత్ర్య భావం మొత్తం సమాజం యొక్క స్వాతంత్ర్యంతో విరోధాన్ని ఇంకా ఎక్కువగా పెంచుకొంటుంది. మొత్తం సమాజం యొక్క స్వాతంత్ర్యం దాని ఆర్థికోత్పత్తి శక్తి యొక్క స్వరూపంలో ఉంటుంది. ఇది మానవుడు ప్రకృతితో ఎదురు తిరిగి పోరాడి సాధించుకొన్నది. క్రమంగా ఆర్థికోత్పత్తి సాధనాలు విరివిగా అవుతున్న కొద్దీ బూర్జువా తాను సర్వస్వతంత్రుణ్ణని భావిస్తాడు. తక్కిన సమాజం మన ఉత్పత్తి ఫలితాల్ని తాను కూడా అనుభవిస్తూ, ఆ పరిస్థితులకు ఎదురు తిరిగి విప్లవం తేవాలని అనుకోదు. పైపెచ్చు నెమ్మదిగా ఆ పరిస్థితుల్ని అంగీకరిస్తుంది కూడా. ఈ దశలో బూర్జువా భావించిన స్వాతంత్ర్య నిర్వచన విధానం స్థిరపడడం కనిపిస్తుంది. ఇలా కనిపించినంత వరకు బూర్జువా స్వాతంత్ర్య నిర్వచనం సత్యంగానే అనిపిస్తుంది. కానీ అది ఒక మిథ్యా కల్పనం. అది ఒక ఐంద్రజాలికమైన మాయామోహం. అనుభవంలో విషయం అర్థమౌతుంది.

సాంఘిక సంబంధాల్ని తోసి పారేయడం చేత మానవుడు తనను స్వతంత్రుడనుకోవడం పాలెగాళ్ళ నాగరికత. బూర్జువా విధానం అభివృద్ధి కావడం చేత ఆ నాగరికత చెలామణి లేనిదయింది. ఇక్కడ నాగరికత అంటే అది వారి ఆర్థిక విధానమని అర్థం.

అభ్యుదయ పథంలో నడిచేటటువంటి సంఘం దాన్ని పూర్తిగా వ్యతిరేకించడం చేత బూర్జువాలు కల్పించిన స్వాతంత్ర్య నిర్వచనం యొక్క బండారం బయటపడి, అది ఏమీ కాకుండా పోయి, కొత్త నిర్వచనానికి చోటిస్తుంది. ప్రతి విషయాన్ని స్వతంత్రంగా ఆలోచించి నిశ్చయించుకొనే జ్ఞానం ఎంత ఉంటే వాడంత స్వతంత్రుడు. స్వతంత్రత అంటే అలాంటి జ్ఞానం. సాంఘిక సంబంధాల్ని, అంటే ఉత్పత్తి శక్తుల్ని, వాటి ప్రవృత్తుల్నీ అదుపులో పెట్టుకోగల్గే జ్ఞానమే మానవుని స్వాతంత్ర్య లక్షణం. కాని ఈ లక్షణం విప్లవం చేత ప్రాణం పోసుకొంటుంది. ఈ విప్లవం సామ్యవాదానికి, కార్మిక ప్రభుత్వ శక్తికి అభిముఖమయింది. దీనికి బూర్జువా అంగీకరించడు. అతడు అనుకొన్న స్వాతంత్ర్యానికి ఇది పూర్తి వ్యతిరేకం కదా. అందుకని ఈ పరిస్థితిలో బూర్జువా మొత్తం సంఘం కోసమే తన బదుకన్నట్టుగా మాట్లాడి, తనవి తాను నిలబెట్టుకోజూస్తాడు. కాని సంపూర్ణ సామ్యవాద సాంఘిక వ్యవస్థ కోసం విప్లవిస్తున్న మహాజన సంఘం ఆ విధంగా బూర్జువాను నిల్వ తీయ్యదు. మాట్లాడనియ్యదు.

వ్యక్తి స్వాతంత్ర్యం అంటే సమాజంతో కలిసిపోయినప్పటికీ తనని తాను దర్శించుకోవడం. అట్లా కలిసిపోవడానికి ఉన్న అనువైన పరిస్థితులే స్వాతంత్ర్య లక్షణాలు. ఇలాంటి లక్షణాలున్న సంఘం స్వాతంత్ర్య దర్శనానికి సాధనం. వాస్తవం ఇలా ఉంటే, బూర్జువాకి ఉన్న స్వాతంత్ర్య విషయంలోని భ్రమ ప్రమాదం ఈ విషయాన్ని పరిగణించనే పరిగణించదు. అతడు ఎప్పుడూ వివేకంతో పనిలేని స్వాతంత్ర్యాన్ని, సంఘంతో పనిలేని వ్యక్తిత్వాన్ని మహావిషయాలుగా భావిస్తుంటాడు. పై భ్రమ ప్రమాదం నుంచే ఈ భావించడం మొదలైంది. బూర్జువా

పరిపాలన సాగడానికి ఆధారమైన ఏ విశేషమైన ఆధిక్యం ఉందో, దాని ప్రతిబింబమే ఆ భ్రమ ప్రమాదం. ఇంకా అది ఒకానొక ప్రత్యేకమైన వర్గ సమాజం నుంచే ఉత్పన్నం అయింది. అది తాను ఉన్నంత వరకూ సంఘాన్ని ఇంకా చీల్చేయజూస్తుంది.

అన్ని వర్గ సమాజాలకు వాటి మిథ్యా భ్రమలు వాటికున్నాయి. బానిస సమాజంలో స్వాతంత్ర్యం అంటే నిర్బంధ పద్ధతి. బానిస విధానం లేకపోవడం కాదు. అది ఒక విలక్షణమైన బలాత్కారంలో స్వాతంత్ర్యాన్ని చూస్తుంది. ఈ విలక్షణత్వం ఆజ్ఞారూపంలో ఉంటుంది. యజమాని ఆజ్ఞాపిస్తాడు. దాని మేరకు దాన్ని బానిస నెరవేరుస్తాడు. అలాంటి సమాజంలో ఆజ్ఞ ఇవ్వగల్గడమే స్వాతంత్ర్యం. వర్గాలు అభివృద్ధి అవుతున్న కొద్దీ మొత్తం మీద ఆజ్ఞలిచ్చే మనస్తత్వాన్ని వాస్తవం నుంచి తొలగించడానికి నియమించే జ్ఞానం సడలిపోతుంది. గుడ్డిగా యజమానుల ఆజ్ఞల్ని శిరసావహించి పనిచేసేటటువంటి బానిస వాస్తవ పరిస్థితుల్లో తెగించి పోరాడాల్సి వస్తుంది. దీని ఫలితంగా వచ్చే ఆర్థికమైన బడుగుతనం – నిరంతరం పెరిగిపోతున్న మానవుని నిత్యావసర విషయ పరిజ్ఞాన శూన్యత వల్ల కలిగే అస్వతంత్రతకు ప్రతిబింబం. ఈ బడుగుతనంలో జ్ఞానానికి, స్వతంత్రతకూ వాహకం కావాల్సిన వర్గ సమాజం నిశ్చేతన్యం అవుతుంది. అది క్రియాశూన్యతతో నిండిపోతుంది.

వివేకం (కాన్షియస్‌నెస్) ప్రకృతితో మానవుడు చేసే తీవ్ర పోరాటం నుంచి పుట్టుకొని వస్తుంది. ఆ పెనుగులాట ఆగిపోతే, వట్టి చూపు సరిపోని మూర్ఖాచారాల అనుసరణ కాలంలో, వివేకం రూపు మాసిపోతుంది. సంఘంలో ఆ వివేకం యొక్క పురోభివృద్ధిని కుంటుపడచేసే, చూపు చాలని మూర్ఖత్వం వల్ల జరిగే నిలువు దోపిడీ విధానాన్ని తోసిరాజనడానికి నిరంతరమైన సంకుల సమరం కొనసాగుతుండాల్సిందే. ఇలాంటి తీవ్ర సంచలనం ఉన్నప్పుడే వివేకం – స్వతంత్రత సంఘ గర్భం చీల్చుకుని కాగడాలు వేసికొని బయలుదేరాయి. అప్పుడు కాని అసలైన స్వాతంత్ర్యం యొక్క అంతస్సత్యం అవగతం కాదు. అలా కావాలంటే ముందుగా సమాజంలో వర్గాలు లేకుండా పోవాలి. నిజంగా స్వతంత్రులవడానికి మానవులకి అన్ని మార్గాలూ తెరచుకోవాలి. అవి అట్లాగే తెరుచుకుంటాయి. అట్లా కావడానికి పెట్టుబడిదారీ వర్గమే కావాల్సిన అన్ని ఏర్పాట్లని చేసి ఉంచుతుంది. దాని గోతిని అదే తవ్వుకుంటుంది (12).

పాదసూచికలు:

Art is the product of society, as the pearl is the product of the oyster, and to stand outside art is to stand inside society - Illusion and Reality (Seven Seas Books 1977), P :18. మిగిలినవి కూడా యీ గ్రంథంలోనివే)

This poetry is not Pureμμ poetry in any modern sense. We may describe it as a heightened form of ordinary speech, without committing ourselves to this is an adequate definition of poetry - P: 19.

In this sense poetry is the child of Nature, just as the developed novel is the child of the sophistication of modern culture - P-28.

Poetry is characteristically song, and song is characteristically something which, because of its rhythm, is sung in unison, is capable of being the expression of a collective emotion - P: 33.

Poetry is the nascent self-consciousness of man, not as an individual but as sharer with others of a whole world of common emotion. P: 39.

A pianola rou is pierced with holes. Those holes are real concrete entities. But they are not the music. The music is what happens when it is played. The poem is what happens when it is read. P:40.


In a class society the workers do their tasks blindly as they are told by supervisors. They build pyramids but each contributes as stone only the rulers know a pyramid is being built.... The ruled obey blindly and are unfree. P:51

To build from matter is sublimely great, But only gods and poets can create P: 58.


It is the characteristic of poetry that it demands for its appreciation a more intimate knowledge of the language in which it was written than any other form of literature. P: 65.

Now bourgeois culture is the culture of class to whom freedom- mans realisation of all his instinctive powers is secured by individualism. It might, therefore seem that bourgeois civilisation should be antipoetic, because poetry is collective and the bourgeois is an individualist. P: 70.


His demand for freedom is a negation of freedom. He is mirror revolutionary and continually revolutionises society by asking for that which will procure the opposite of what he desires. P: 72 ❑



డే బై డే విన్యాసాలు



గేమ్ ఓవర్




ఉత్తర కుమార..!

కార్టూన్స్ : సతీష్ ఆచార్య

RNI Title Code : APTEL 16175 - DAARI DEEPAM (Telugu Monthly)


Vol : 5 - Issue No : 1 Online Edition October 2026



ప్రతులకు..
ప్రజాశక్తి
బుక్ హౌస్,
విజయవాడ

సమగ్ర భారత చరిత్ర జాతీయోద్యమం

₹100.00



ఏది సనాతనధర్మం?

₹30.00

కొత్త పుస్తకాల స్వీకారం



ప్రతులకు..
నవతెలంగాణ
బుక్ హౌస్,
హైదరాబాద్

